దుష్యంతోపాఖ్యానం

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత

డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2018

DUSHYANTOPAKHYANAM
with Commentary

Commentary by
Dr. G.V. Subrahmanyam

T.T.D. Religious Publications Series No. 1292

First Print : 2018

Copies : 2000

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **"మహాభారతం"** అయ్యింది.

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు – అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.


పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలను వ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **దుష్యంతోపాఖ్యానం.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...



కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

పీఠిక

అమితాఖ్యానక శాఖలంబొలిచి వేదారామలచ్ఛాయమై
సుమహద్వర్గచతుష్కపుష్పవితతిన్ శోభిల్లికృష్ణార్జునో
త్తమనానాగుణకీర్తనార్థఫలమై ద్వైపాయనోద్యాన జా
తమహాభారత పారిజాతమమరున్ ధాత్రీసురప్రార్థ్యమై.

మహాభారతపారిజాతం సర్వపురుషార్థ విజ్ఞాన ఫలప్రదమైనదని నన్నయగారు గొప్పగా వర్ణించిన యీ పద్యప్రభావమే కావచ్చు పోతనగారి 'లలితస్కంధము...' పద్యం, రెండు పద్యాల్లోను–పారిజాత, కల్పవృక్షము లున్నాయి. ఇవి విశేషవిశేషణాలు. ఇక నన్నయగారి పద్యం ఆరంభమే 'అమితాఖ్యానకశాఖల'తో రావటం మహాభారతంలో చెప్పబడే అనేకానేక కథలను గూర్చిన సూచనకావచ్చు. అందుకే తెలుగు భారతంలో చిన్నాపెద్ద అఖ్యాన–ఉపాఖ్యానాలు దాదాపు 160 దాకావుంటాయి. కవిత్రయం తెల్పిన ఈవుపాఖ్యానాల్లో ఏ ఒక్కటి కూడా అనవసరంగా లేవు. అన్నీ ముఖ్యకథా పరిపుష్టకాలే. ఇదివారి రచనావిశేషం. ఆఖ్యానం అంటే మొదటినుండీ చివరిదాకాసాగే కథ. దీనికి పోషకంగా నిలిచేది ఉపాఖ్యానం అంటే అనుబంధకథ, ఇవే ఉపాఖ్యానాలు ఆఖ్యానకాలు అనికూడా పరివ్యాప్తమై మహాభారతంలోని విశేషతాత్పర్యాన్ని మిత్రసమ్మితంగా తెల్పటానికి బాగాతోడ్పడుతాయి. మహాభారతకల్పవృక్షం బోదెవంటిదైతే – ఉపాఖ్యాన–అఖ్యానములు దీనికి కొమ్మలు. విశాలంగా దట్టంగా శాఖలున్న వృక్షంబాగా విస్తరిస్తుంది. ఆ విధంగానే మహాభారత వృక్షం ఆకారంలోను గుణంలోను ఆఖ్యాన ఉపాఖ్యానయుతమై వర్ధిల్లుతుందని నన్నయగారి స్థూలాభిప్రాయం. అందుకే మహాభారతంలోనున్న ప్రతి ఉపాఖ్యానం ఒక కావ్యకళాగౌరవం కలిగివున్నట్టిదే, వీటి ప్రభావమే కావచ్చు అనంతరకాలంలో ఉపాఖ్యానామ యుతంగా–గయోపాఖ్యానం. నాచికేతూపాఖ్యానం. హరిశ్చంద్రనలోపాఖ్యానం. నిరంకుశోపాఖ్యానం. మొదలైనరచనలు ప్రసిద్ధమైనాయి. మహాభారతంలో

కూడా అంబోపాఖ్యానం. సౌపర్ణోపాఖ్యానం. నలోపాఖ్యానం ధర్మవ్యాధోపాఖ్యానం వంటి ఎన్నో ఆఖ్యాన ఉపాఖ్యాన లక్షణాలను గూర్చి చర్చ చేసినారు. ఆదికావ్యమైన శ్రీమద్రామాయణం 'ఏవమేతత్పురావృత్తమాఖ్యానం భద్రమస్తునః'–'మహదుత్పన్నమాఖ్యాతం రామాయణమితిశ్రుతం' అని తెల్పటమేకాక వేదాలలోను ఆఖ్యాన ఉపాఖ్యానములున్నాయి. పురాణాల్లోను వీటి ప్రసక్తి అధికంగా వుంటుంది. అందుకే నన్నయగారు తన మహాభారత రచన ప్రత్యేకతను విశేషమైన మహార్థవంతమైన 'ఆఖ్యాన' పదంతోవ్యక్త పరచినారు. ఆ పరంపరలోని ఆఖ్యానాల్లో ఒకటి–

దుష్యంతోపాఖ్యానం : ఇది ఎంతో ప్రాముఖ్యం సంతరించుకున్నకథ. భరతుడు భరతవంశం భరతజాతి మొదలైన ఎన్నో విశేషాలను తెల్పి ధర్మప్రతిపాదనచేసి మనజాతికొకగొప్పసందేశాన్ని అందించింది. అందుకే నన్నయార్యుడు దీన్ని ప్రసన్నకథాకలితార్థయుక్తిగానే గాక నానా రుచిరార్థ సూక్తినిధిత్వంగా రచించి–అటు మూలకథావిశేషాలను ఇటు కాళిదాసు అభిజ్ఞానశాకుంతలకథను–అవసరమైనమేర గ్రహించి మెరుగులు దిద్దిన మహానుభావుడు మన ఆదికవి. దుష్యంతోపాఖ్యానం– నన్నయభారతం ఆదిపర్వచతుర్థాశ్వాసంలో–8–109 వరకున్న గద్యపద్యాల్లో వర్ణితమైంది (కథానాయకుడైన దుష్యంతుడు కలిలుదు–అనేవానికి రథంతరియందు జన్మించినాడు). దీనికి శకుంతలోపాఖ్యానం అని మరొకపేరు ప్రఖ్యాతం. అనంతరకవుల్లో కొందరు శకుంతలా పరిణయం. శృంగారశాకుంతలం అనే పేర్లతో ప్రబంధకథను చెప్పినా వీరికి కాళిదాసు అభిజ్ఞానశాకుంతలం. నన్నయగారి యీకథలే ముఖ్యాధారాలు.

నన్నయగారివరకే'ఉదాత్తరసాన్వితకావ్యనాటకక్రమములు'న్నందు వలన కాళిదాసునాటకం ప్రసిద్ధిగాంచియుంటుంది. నన్నయగారు భారతం మూలకథతోపాటు కాళిదాసునాటకాన్ని పరిశీలించి మూలకథా విశేషాలకే

మాత్రం భంగంకల్గకుండా ఈ దుష్యంతోపాఖ్యానాన్ని చెప్పినాడు. కాళిదాసు రచన దృశ్యం కాబట్టి ప్రేక్షకజనానికి ఆనందం. ఆలోచనకలిగే విధంగా చిన్నచిన్నమార్పులతో సందర్భానుగుణపాత్రలతో కథను నడిపినాడు. ఇక నన్నయగారిరచన 'శ్రవ్యం' కాబట్టి తాను కృత్యాదిలో తెల్పిన 'ధర్మతత్త్వజ్ఞులు' – పద్యాని కనుగుణంగా దీన్ని సిద్ధంచేయటం వలన నాటకంలోని ఎన్నో పాత్రలు. ఎన్నో సన్నివేశాలు దీంట్లోచోటుచేసుకోలేదు. కాళిదాసు అభిజ్ఞ–(ఉంగరం గుర్తు) కన్నా 'పుత్రగాత్రపరిష్వంగసుఖం' ఇది 'అంగాదంగాత్సంభవసి–'అనే వేదసూక్తిని ప్రవచిస్తుంది. ఇట్లా విశేషమైన యీ కథను నన్నయగారు వివిధచ్ఛందాలు–వచనాలలో ప్రత్యేకకావ్యకళా రీతిలో ధర్మప్రతిపాదన కథాకథనంగా నిర్మించటం–కవికి గల ప్రత్యేకశ్రద్ధ కొక తార్కాణం.

ఈ కథలో దుష్యంతుడు లౌకికధర్మానికి శకుంతల ఆత్మధర్మానికి ప్రతీకలై–వ్యక్తిధర్మం. వ్యవస్థాధర్మం గార్హస్థ్యధర్మం అనేవాటిని ఎంతో గొప్పగా నిరూపించి నిల్పటం దుష్యంతోపాఖ్యానకథా విశేషం.

సంక్షిప్తంగా– దీనియందలి కథ దుష్యంతమహారాజు సముద్రాలే హద్దుగావున్న భూమండలాన్ని చక్కగా పరిపాలిస్తూ ఒకనాడు రాజధర్మా న్ననుసరించి తగిన పరివారంతో వేటకు వెళ్లి–ఎన్నోమృగాలను చంపి బాగా అలసట చెందినందున ఒక స్థలంలో కాసేపుసేదదీరి– తనసైన్యాన్ని ఇక్కడనే వుండుమని ఆదేశించి పరిమితజనంతో ముందుకు నడచి సమీపంలోని మాలినీనదీతీరంలోవున్న కణ్వాశ్రమాన్ని చూచి అక్కడి వాతావరణానికి జాతివైరంలేని జంతువులప్రవర్తన మొదలైనవాటికి ముగ్ధుడై గంగానదీ తీరంలోని నరనారయణ స్థానం వలె కన్పడే ఆశ్రమంలోనికి ప్రవేశిస్తాడు. ఇదే కణ్వాశ్రమం. చాలకాలం నుండి తాను కణ్వమహర్షి పేరు విన్నందున వారిని సేవించాలనే కుతూహలంతో వచ్చిన రాజుకు

అందాలరాశియైన శకుంతల అనే కన్యక దర్శనమవుతుంది. ఆమె కూడా కంతుజయంతుల సోయగం గల దుష్యంతుని చూచి పరవశం చెందుతుంది. దుష్యంతుడు కణ్వమహాముని గూర్చి ఆమెను అడుగగా 'వారు ఫలపుష్పాదుల నిమిత్తం వెళ్లినారు త్వరగానే రాగలరు'. అని బదులుచెప్పి ఆశ్రమోచితమైన అతిథి సపర్యల చేస్తుంది. రాజు ఆమెయందు బద్ధాదరుడై కన్యకయని తెలిసి. ఇంత అందాలరాశి మునికన్యయెట్లు? అని సంశయిస్తాడు. వెంటనే శకుంతల వైపుచూచి అందాలరాశియైన నీవు ఎవరవు? అని ప్రశించగా ఆమె కణ్వపుత్రిని అంటుంది, బ్రహ్మచారియైన ఈ మహర్షికి ఈమె పుత్రిక యెట్లయింది, ఈమెను చూస్తే నామనస్సు ఎందుకు చలించింది? అని ఆలోచించి ఆమెతో–కణ్వమహర్షి ఉత్తమ ఆశ్రమనిష్ఠగలవాడు ఆయనకు నీవు ఎట్లా కుతూరువైనావు? అని మళ్లీ ప్రశ్నిస్తే ఆమె కాస్తా ఓపికగా –'నేను మేనకావిశ్వామిత్రుల పుత్రికను వారు నాకు జన్మనిచ్చి మాలినీనదీతీరంలో వుంచి పోతే శకుంతములు (పక్షులు) నన్నురక్షించినవి. ఒకనాడు కణ్వహహర్షి అటువచ్చి నన్ను చూచి తెచ్చి పుత్రికానిర్విశేషంగా పెంచుతున్నాడు'. అని ఈ విషయాన్ని వారు ఎవరో మునులకు తెల్పేసమయంలో నేను విన్నాను–అని అంటుంది,

ఈ విషయాన్ని తెలుసుకున్న దుష్యంతుడు. మొదట ఈమెను 'మునికన్య' అనుకున్నా ఇప్పుడు 'మునినాథకన్య' యని క్షత్రియజాతికి చెందినదని గ్రహించి ఆమెయందు లగ్నమనస్కుడై–వివాహభేదాల్లో ఒకటైన 'గాంధర్వరీతి' పరిణయమాడటానికి శకుంతల నంగీకరింపచేస్తే. అప్పుడామె–మన కుద్భవించే కుమారుణ్ణి నీవు యువరాజ్యపట్టాభిషిక్తుని చేయటానికి అంగీకరించవలెనంటుంది. దానికి రాజు సమ్మతించి–ఆమెతో సుఖభోగాలననుభవించి–వెళ్లే సమయంలో నా పరిచారకుల పంపి నిన్ను నా రాజ్యనికి రప్పించుకుంటానని చెప్పి–పురానికి బయలుదేరుతాడు.

అనంతరం కణ్వమహర్షివచ్చి తన దివ్యశక్తిచేత జరిగిన విషయాన్ని గ్రహించి నీ గర్భంలోవున్న శిశువు 'భవిష్యత్తులో అఖిల భువన భారధౌరేయుడు కాగలడు'– అని శకుంతలను ఆశీర్వదిస్తాడు. కొంతకాలం తర్వాత ఆమెకు కలిగిన పుత్రునికి భరతుడని పేరుపెట్టిన కణ్వమహర్షి–ఆ బాలుడు యుక్తవయస్సున శోభిల్లుతుంటే ఆడుపిల్ల ఎప్పుడైనా భర్తయింట నివసించదగిందే కదా! అని చెప్పి తన యిద్దరు శిష్యులనిచ్చి కుమార యుక్తయైన శకుంతలను దుష్యంతుని వద్దకు పంపుతాడు. అక్కడ రాజు సభలో దుష్యంతుడు ఈమెను గుర్తుపట్టని విధంగా ఏవో సంభాషణలు చేస్తే బాధకల్గిన శకుంతల దుష్యంతునికి గతంలో కణ్వాశ్రమంలో జరిగిన విషయాలను గాంధర్వవివాహం పుత్రునికి యువరాజ్యాభిషేకం మొదలైన వాటిని వివరించి–గృహస్థధర్మాన్ని పుత్రగాత్రపరిష్వంగసుఖ విశేషాలను ఎంతో గొప్పగా వివరించినా ఆయన పెడచెవిని పెట్టడం వల్ల దుః ఖభారంతో తన పుత్రుని తీసుకొని తిరిగి వెళ్లటానికి సంసిద్ధురాలైన సమయంలో ఆకాశవాణి సభాసదులందరు వినేటట్లు దుష్యంతునితో' ఈ శకుంతల నీ భార్య ఈ బాలుడు నీ పుత్రుడు. నిస్సంశయంగా వీరిని నీవు పరిగ్రహించవచ్చును' అని పల్కగా అప్పుడు శకుంతలను పుత్రుని దుష్యంతుడు గ్రహించి – 'లోకాపవాదభీతికి నేను అట్లా సంభాషించినాను' – అని తెల్పి – భరతుని యువరాజపదవిలో వుంచి కొంత కాలంతర్వాత దుష్యంతుడు వానప్రస్థుడై వనాని కరుగుతాడు–" ఇది దుష్యంతోపాఖ్యానకథా సంగ్రహం–

కాళిదాసు నన్నయలు చిత్రించిన శకుంతలపాత్రలు భిన్నంగా వుంటాయి. అభిజ్ఞ (ఉంగరం గుర్తు) విస్మరించిన కాళిదాస శకుంతల దుర్వాసశాప కారణంగా బాధలననుభవిస్తే అమాయకత్వంతో దుష్యంతుణ్ణి విశ్వసించి అనంతరకాలంలో ఆయన విస్మృతి కారణంగా భారతశకుంతల బాధాతప్తయైన కారణంగా గృహస్థధర్మం. సత్యవాక్కుయొక్కఘనత.

పుత్రగాత్రపరిష్వంగవైభవం– మొదలైన వాటిని ప్రవచించే వీలుకలిగింది. ఇది నన్నయగారి ధర్మతత్పరత. లోకజ్ఞత్వాలకొక ప్రతీక. నాటకంలో పాత్ర లధికం. అది దృశ్యం కాబట్టి ప్రత్యక్షసన్నివేశచిత్రణల కా పద్ధతి సరిపడింది. మహాభారతంలో కణ్వదుష్యంత–శకుంతలా పాత్రలే ముఖ్యాలై– మిగిలిన రాజుసైన్యం. కణ్వశిష్యులు నామమాత్రశేషులు గానే వున్నారు. వీరిలో భరతుడొక నిశ్శబ్దపాత్ర. వేటాడేరాజు నాటకంలో ముని ఆశ్రమాన్ని చేరుకోవటంకన్నా ఒక్కటే మునియందలి గౌరవంతో విచ్చేయుట–భారత దుష్యంతరీతికి మెరుగుపెట్టింది. ఇక శకుంతల తన పుట్టుకను స్వయంగా చెప్పటం వలన రాజుతో ప్రత్యక్షసంభాషణ కనువుగా వున్న విధం భారతంలో నిరూపితమై ఆయనకున్న సంశయాన్ని నివృత్తిచేసింది. ఈ విషయం తెలియనప్పుడు 'ఇది మునికన్య–' యనిభావించిన నాయకుడు సంశయ నివారణకాగానే 'మునినాథకన్య' యనటంలో గల విశేషార్థాలను గొప్పగా చెప్పించిన నన్నయగారి 'అక్షరరమ్యత' ప్రశంసావహం ప్రారంభంలోనే చెప్పిన 'అతిరుచిరాగతుండయిన' –పద్యం భవిష్యత్తులో దుష్యంతునకు జరుగబోయే శుభాన్ని (వివాహం) వ్యంగ్యంగా చెప్పి. కవివర్యుని 'రుచిరార్థ సూక్తినిధిత్వా' నికి నిదర్శనమైంది. అట్లే శకుంతలను పెంచిన కణ్వమహర్షి' తన జనకుండు...' పద్యంద్వారా తెల్పిన అయిదురకాల సంరక్షకులు ధర్మశాస్త్ర నిరూపితమైనవారు కావటం విశేషం. ఈ విషయాల్లోనేగాక 'బ్రాహ్మంబుదైవంబు...' అనే పద్యంద్వారా వివాహభేదాలను తెల్పి–సంఘంలో స్త్రీపురుషుల స్వేచ్ఛాప్రవృత్తికొక అడ్డుకట్టవేయటం వలన ధర్మనిరతి వ్యక్తమైంది. శకుంతల తనకు పుట్టబోయే పుత్రుని యువరాజును చేయవలెనని కోరటం వెనుక భవిష్యత్ 'భరత' దేశదృష్టి. ఈ దేశసాంస్కృతిక–చైతన్య వారసత్వప్రతీకలు నిరూపితమై – మున్ముందు రాజసభలో ఇదేవరం చర్చనీయాంశంగా మారుతున్నది. ఇట్లా ఈ పద్యాలు త్రాసులో ముల్లువలె ధర్మబద్ధంగా నిల్చినాయి. ఈ

విషయాలను నన్నయగారు తననీతి, ధర్మ– లౌకిక విద్యాపరం పరలను తెల్పటానికెంతో అనువుగావున్నాయి. ఇట్లా శకుంతలా దుష్యంతసంబంధ సంభాషణలద్వారా భరతజాతి స్త్రీపురుషులకొక మహోపదేశాన్ని అందించిన ఔపదేశికుడు నన్నయభట్టారకుడు, కణ్వాశ్రమంలో గాంధర్వవివాహం ఈ యిద్దరి మధ్యనే జరిగింది. తర్వాత రాజసభలో తనను స్వీకరించవలసిందిగా మహోదాత్తంగా వుపన్యసించిన సమయంలోను శకుంతలాదుష్యంతులే వున్నారు, భరతుడొక నిశ్శబ్దరూపి, రెండుసన్నివేశాల్లోను–సూర్యచంద్రులు. ఉభయసంధ్యలు మొదలైనవి (విమలయశోనిధీ1...73 పద్యం) మాత్రమే సాక్ష్యాలు. అందుకే శకుంతల తన ప్రసంగంలో నేటికి ప్రాధాన్య మీయటం గమనార్హం, ఇక దుష్యంతుడు సైతం పుత్రయుతయై వచ్చిన యామెను వెంటనే స్వీకరిస్తే లోకాపవాదానికి లోనయి–ధర్మవ్యతిరేకుడనే అపప్రథకు గురికావలసివస్తుంది. కాబట్టే– మహాసంయమనంతో శకుంతల భాషణాన్నివింటూ– ఆకాశవాణి పలుకుల తర్వాత తనకర్తవ్యాన్ని నిరూపించిన ధర్మిష్ఠి దుష్యంతమహారాజు. 'ధర్మోరక్షతి రక్షితః–' అనేది ఈ యిద్దరియందు గొప్పగానిరూపితమై ఒక 'భరతమాత'గా శకుంతల. భారతీయ సనాతనధర్మసంరక్షణకొక నిదర్శనమూర్తి దుష్యంతుడు మన సంఘంలో శాశ్వతులైనారు. నన్నయగారి ధర్మోపదేశం ఒక చిన్నపాటి ధర్మప్రబోధ కావ్యం. ఆ నాటి ధార్మిక విషయాలు నేటికీ తెలుగుజాతికి ఆరాధ్యాలై–నిత్య సవ్యప్రసక్తాలైనాయి. దీనిలోని ప్రతిపద్యం ఒక ఆణిముత్తెం, స్త్రీపురుషులు గమనించవలసిన బహువిషయ సముపేతాలైనా వాటిలో

విపరీతప్రతిభాషలేమిటికి–84
నుతజలపూరితంబులగు–87
వెలయంగనశ్వమేధంబులు–88
సర్వతీర్థాభిగమనమ్ము –89.

మొదలైన పద్యాలు తెలుగుజాతి నాల్కలమీద నిల్చిన మహోపదేశ రత్నాలు దుష్యంతోపాఖ్యానం సరళ-సరసకవితాభిరామం. ప్రతిపద్యం మహోదాత్త విషయసంభరితం. ఈ కథ స్త్రీ పురుషధర్మాలు గృహస్థజీవన విశేషాలు. జాతి అనుసరించవలసిన ధర్మం. మొదలైనవాటిని తెల్పటం- కేవలం శకుంతలాదుష్యంతులకేగాదు యావత్‌భారతజాతికి మేలుకొల్పును కల్గించటం. ఈ విషయాలల్లో నన్నయగారు మూలవిధేయంగాను మూలాన్ని విపులీకరించేవిధంగాను మహోన్నతకాళిదాసు నాటకవిషయాలను ఎంతో జాగ్రత్తగా చిత్రించి 'ధర్మార్థసాధనకుపకరణంబు'(78)గా గృహస్థ ధర్మాన్ని నిల్పి పెద్దనాదుల 'కెలకుల నున్న తంగెటిజున్ను-'కు ఆధారం కల్పించింది, భరతజాతికి ఇట్లా మహోపదేశాన్ని ప్రబోధించేది-దుష్యంతోపాఖ్యానం.

- డా॥ శ్రీరంగాచార్య

దుష్యంతోపాఖ్యానం

దుష్యంతుఁడు వేఁట కరుగుట (సం. 1-63-1)

శా. ఆ దుష్యంతుఁ డనంతసత్త్వుఁడు సమస్తాశాంతమాతంగ మ
ర్యాదాలంకృత మైన భూవలయ మాత్మాయత్త మై యుండఁగా
నాదిత్యాంశు సమీర దుర్గమ మహోగ్రారణ్య దేశాళితో
నాదిక్షత్త్ర చరిత్ర నేలె నజితుండై బాహువీర్యంబునన్. 1

ప్రతిపదార్థం: అనంత, సత్త్వుఁడు= అంతులేని బలం కలిగిన; ఆ, దుష్యంతుఁడు= అంతటిదుష్యంతుడు; సమస్త, ఆశా+అంత, మాతంగ, మర్యాదా+అలంకృతము+ఐన= అన్నిదిక్కులయొక్క చివరలందలి ఏనుగులయొక్క హద్దుతో అలంకరింపబడింది అయిన; భూవలయము= భూమండలం; ఆత్మ+ఆయత్తము+ఐ, ఉండఁగాన్= తనకు ఆధీనం కాగా; ఆదిత్య+అంశు, సమీర, దుర్గమ, మహత్, ఉగ్ర, అరణ్య, దేశ+ఆళితోన్= సూర్యుడి కిరణాలకున్నూ, గాలికిన్నీ ప్రవేశింప శక్యంగాని మిక్కిలి భయంకరమైన అడవిప్రాంతాల సమూహంతో; ఆది, క్షత్త్ర, చరిత్రన్= తొలుతటి మనువు మొదలైన రాజుల చరిత్రవంటి చరిత్రతో; బాహువీర్యంబునన్= భుజాల యొక్క బలంతో; అజితుండు+ఐ= ఓడనివాడై; ఏలెన్= పరిపాలించాడు.

తాత్పర్యం: అనంతమైన బలం కలిగిన ఆ దుష్యంతుడు అన్ని దిక్కుల చివరలలో గల యేనుగులు (అష్టదిగ్గజాలు) సరిహద్దుగా ఒప్పిన భూమండలం తనకు అధీనమై ఉండగా సూర్యకిరణాలకున్నూ వాయువుకున్నూ ప్రవేశింప రానట్టి భయంకరాలైన అడవిప్రదేశాలతోపాటుగా పూర్వరాజులవర్తనంవంటి వర్తనంతో, భుజబలంతో, ఓడనివాడై భూమిని పరిపాలించాడు.

విశేషం: భూమిని ఎనిమిది దిక్కులందు ఎనిమిది ఏనుగులు మోస్తూ ఉంటా యని చెప్పుతారు. ఆ అష్టదిగ్గజాలు హద్దుగా గల భూమి అంటే సర్వభూమిని

అని అర్థం. దుష్యంతుని విశాలమైన రాజ్యంలో దుర్గమారణ్యాలు, తపోవనాలు ఎక్కువగా ఉన్నా యని సూచన. ఇవి భావికథలో దుష్యంతుడు వేటకు పోవటానికీ, శకుంతలను చూచి వివాహం చేసికొనటానికీ అనువుగా ఉన్నవి. ఇటువంటిభావికథార్థసూచన నన్నయ వస్తుధ్వనికి నిదర్శనం. 'అనంతసత్త్వుఁడు' అంటే అనంతుడి(ఆదిశేషుడి) బలంవంటి బలం కలవాడనికూడ అర్థం చెప్పవచ్చును. భూభారం వహించే సందర్భం కనుక ఇదికూడ సమంజసంగా ఉంటుంది. ఓజోగుణభూయిష్ఠమైన ప్రసాదగుణం ఉదాత్తవిభావవర్ణనలో సముచితంగా ప్రయోగింపబడింది.

క. ఆతని రాజ్యంబున ను।
ర్వీతలము ప్రజాసమృద్ధి వెలసి రుజాశో
కాతంక క్షయ శంకా।
పేతం బై ధర్మచరితఁ బెరుఁగుచు నుండెన్. 2

ప్రతిపదార్థం: అతని రాజ్యంబునన్= ఆ దుష్యంతుని పరిపాలనలో; ఉర్వీతలము= భూతలం; ప్రజాసమృద్ధిన్= జనులయొక్క అభివృద్ధితో; వెలసి= ప్రసిద్ధిపొంది; రుజా, శోక, ఆతంక, క్షయ, శంకా+అపేతంబు+ఐ= రోగాలు, దుఃఖాలు, విఘ్నాలు, నష్టాలు, అనుమానాలు లేనిదై; ధర్మ, చరితన్= ధర్మమైన వర్తనంతో; పెరుఁగుచున్+ఉండెన్= అభ్యుదయాన్ని పొందుతూ ఉన్నది.

తాత్పర్యం: దుష్యంతుడి పరిపాలనంలో దేశం ప్రజలఅభివృద్ధితో ప్రసిద్ధిచెంది రోగాలూ, దుఃఖాలూ, విఘ్నాలూ, నష్టాలూ, అనుమానాలూ ఏమీ లేనిదై ధర్మమైన ప్రవర్తనంతో సాగుతూ ఉన్నది.

విశేషం: దుష్యంతుడు ప్రజలకు ధర్మవర్తన మైన పాలనను అందించటంవలన వారికి ఎటువంటి అరిష్టాలు కలుగకుండా అభ్యుదయాలు కలుగుతూ ఉన్నాయని తాత్పర్యం. మూలంలో ఆరు శ్లోకాలలో ఉన్న భావాన్ని 'రుజా..... అపేతంబై' అన్న సమాసంలో కుదించి చెప్పాడు నన్నయ. భావికథలో ప్రజాపవాదభీతివలన

శకుంతలాభరతులను భార్యాపుత్రులనుగా నిండుసభలో పేర్కొనకపోవటానికి తగిన భిత్తికను నన్నయ కథాకథనంలో సమకూర్చాడు.

వ. అమ్మహీపతి యొక్కనాఁడు మృగయావినోదార్థి యయి యాదిత్యహయం బుల కంటె వడిగల హయంబులు పూనిన రథం బెక్కి యాజానేయతు రంగారూఢు లైన యాశ్వికులు పరివేష్టించి రాఁగ ననంతకుంతశక్తిచాప కృపాణపాణు లయిన వీరభటసహస్రంబులతోఁ జని వనంబులోని మృగంబులం జుట్టుముట్టి. 3

ప్రతిపదార్థం: ఆ+మహీపతి= భూమికి నాథు డైన ఆ దుష్యంతుడు; ఒక్కనాఁడు= ఒకరోజున; మృగయా, వినోద+అర్థి, అయి= వేటయందలి ఆనందాన్ని కోరినవాడై; ఆదిత్య, హయంబులకంటెన్= సూర్యుడియొక్క గుఱ్ఱాలకంటె; వడి+కల= వేగం కలిగిన; హయంబులు, పూనిన= గుఱ్ఱాలను కట్టిన; రథంబు+ఎక్కి= రథాన్ని ఎక్కి; ఆజానేయ, తురంగ+ఆరూఢులు+ అయిన= మేలిజాతి గుఱ్ఱాలను ఎక్కినట్టివా రైన; ఆశ్వికులు= రౌతులు; పరివేష్టించి, రాఁగన్= చుట్టూ చేరి వస్తూఉండగా; అనంత, కుంత, శక్తి, చాప, కృపాణ, పాణులు+అయిన= అనేకాలైన ఈటెలు, చిల్లకోలలు (ఆయుధవిశేషాలు), విండ్లు, కత్తులు చేతులలో కలవారైన; వీర, భట, సహస్రంబుతోన్= వీరులైన అనేక యోధులతో; చని= వెళ్ళి; వనంబులోని= అడవిలోని; మృగంబులన్= జంతువులను; చుట్టుముట్టి= నలువైపుల క్రమ్ముకొని దాడిచేసి.

తాత్పర్యం: ఆ దుష్యంతుడు ఒకనాడు వేటాడి వేడుక పడదామన్న కోరికతో సూర్యుడి గుఱ్ఱాలకంటె వేగంగల గుఱ్ఱాలను కట్టిన రథాన్ని ఎక్కి, మేలిరకం గుఱ్ఱాలపై ఎక్కిన ఆశ్వికులు తన చుట్టూ చేరి అనుసరిస్తూ ఉండగా ఈటెలు, చిల్లకోలలు, విండ్లు, కత్తులు మొదలైన ఆయుధాలను ధరించిన వీరభటులు అనేకులు వెంటరాగా, ముందుకు సాగి, వనంలోని మృగాలను నలువైపుల చుట్టుముట్టి దాడిచేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కలయఁగ నార్పుల బొబ్బల।
యులివున నవ్విపిన మను మహోదధిఁ బెలుచం
గలఁచెను దుష్యంత మహా।
బల మందరనగము సత్త్వభయజననం బై. 4

ప్రతిపదార్థం: కలయఁగన్= వనమంతా వ్యాపించగా; ఆర్పులన్= మానవుల అరపులయూ, బొబ్బలన్= జంతువుల అరపులయూ; ఉలివునన్= ధ్వనితో; ఆ+ విపినము+అను, మహత్+ఉదధిన్= ఆ అరణ్యమనే పెద్ద సముద్రాన్ని; దుష్యంత, మహత్+బల, మందర, నగము= దుష్యంతుడిసేన అనే మందరపర్వతం; సత్త్వ, భయ, జననంబు+ఐ= ప్రాణులకు భయాన్ని కలిగించేదై; పెలుచన్= ఆటోపంతో; కలఁచెను= కలతపెట్టింది.

తాత్పర్యం: ఆ వనమంతా వ్యాపించగా భటులూ, జంతువులూ చేసే కేకలూ అరుపులూ కలిసిన చప్పుడుతో ఆ అరణ్య మనే మహాసముద్రాన్ని దుష్యంతుడిసేన అనే మందరపర్వతం (కవ్వపుకొండ) ప్రాణులకు భయంకలిగేటట్లు కలతపెట్టింది.

విశేషం: అలం: రూపకం. అరణ్యమనే సముద్రాన్ని మథించగా దుష్యంతుడికి శకుంతల అనే లక్ష్మి లభిస్తుం దనే సూచన ఇందులో ఉన్నది.

క. సరభస పరిచరిత మహా।
శరభ ద్విపరిపు వరాహ శార్దూల మద
ద్విరదాది ప్రకర భయం।
కరవనమధ్యమున నృపతి గడుఁ గడిమిమెయిన్. 5

ప్రతిపదార్థం: సరభస= తొట్రుపాటుతో కూడికొన్న వేగంతో; పరిచరిత= తిరుగుతున్న; మహత్+శరభ= గొప్పవైన శరభమృగాలున్నూ; ద్విప, రిపు= (ఏనుగులకు శత్రువులైన) సింహాలున్నూ; వరాహ= పందులున్నూ; శార్దూల=

పెద్దపులులున్నూ; మద, ద్విరద+ఆది= మదించిన ఏనుగులు మొదలైన వానియొక్క; ప్రకర= సమూహాలచేత; భయంకర= భయాన్ని కలిగించే; వన, మధ్యమునన్= అరణ్యముయొక్క నడిమిప్రాంతంలో; నృపతి= రాజు, దుష్యంతుడు; కడున్= మిక్కిలి; కడిమిమెయిన్= పరాక్రమంతో.

తాత్పర్యం: తొందరగా తిరుగుతున్న మహాశరభాలు, సింహాలు, పందులు, పెద్దపులులు, మదపుటేనుగులు మొదలైన జంతుసమూహాలతో భయంకరమైన ఆ అరణ్యమధ్య ప్రాంతంలో దుష్యంతుడు మిక్కిలి పరాక్రమంతో.

విశేషం: 10వ వచనం నుండి వేటవర్ణనం జరుగుతున్నది. రాజు సైన్యంతో అడవిలో ప్రవేశించి, మృగాలను చుట్టుముట్టి, అరుపులతో, బొబ్బలతో వేసి, వాటిని భయపెట్టి అరణ్యమధ్యభాగానికి వచ్చేటట్లు చేశాడు. వనమధ్యభాగంలో రాజు వేటచేశాడు. అత్యంత సహజసుందరంగా వేటవర్ణనం సాగుతున్నది. మితహితవచనాలకూ, యథార్థవర్ణనలకూ స్తుతులకూ నన్నయ ప్రసిద్ధి.

క. ఓసరిలి పఱచు మృగముల।
నేసియు, డాసిన మృగముల నెగచి భుజాసిన్
వ్రేసియుఁ, జంపెను మృగయా।
వ్యాసక్తి నపారఘోరవన్యమృగాళిన్. 6

ప్రతిపదార్థం: ఓసరిలి= తప్పించుకొని; పఱచు= పారిపోవు; మృగములన్= జంతువులను; ఏసియున్= కొట్టియున్నూ; డాసిన, మృగములన్= దగ్గరకు వచ్చిన జంతువులను; ఎగచి= తరిమి, కుప్పించి; భుజ+అసిన్= చేతిలోని కత్తితో; వ్రేసియున్= కొట్టియు, నరికియున్నూ; మృగయా, వ్యాసక్తిన్= వేటయందలి వేడుకతో; అపార, ఘోర, వన్య, మృగ+ఆళిన్= అంతులేని క్రూరాలైన అడవికి చెందిన జంతువుల సమూహాన్ని; చంపెను= చంపాడు.

తాత్పర్యం: తప్పించుకొని పారిపోయే జంతువులను కొట్టియున్నూ, సమీపానికి వచ్చినవాటిని తరిమి, కుప్పించి నరికియున్నూ దుష్యంతుడు వేటలోని వేడుకతో అపారక్రూరవనజంతువులను సంహరించాడు.

వ. ఇట్లు పెక్కుమృగంబుల నెగిచి చంపుచు మఱియుఁ జంపెడువేడుక నతి దూరంబున కరిగిన, నాతని రథవేగంబు ననుగమింపనోపక యధిక క్షుత్పిపాసాపరవశు లయి పదాతు లయ్యయి ప్రదేశంబుల విశ్రమించి; రంత దుష్యంతుండు కతిపయామాత్య పురోహితసహితుం డై కొండొకనేల యరిగి, ముందట నొక్క పుణ్యనదీతీరంబున వివిధసురభి కుసుమఫల భారవినమ్ర తరులతాగుల్మ పరిశోభితం బయిన యొక్కవనంబు గని. 7

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; పెక్కు, మృగంబులన్= అనేక జంతువులను; ఎగిచి, చంపుచున్= తరిమి చంపుతూ; మఱియున్= ఇంకను; చంపెడు, వేడుకన్= వేటచేయాలన్న ఆసక్తితో; అతిదూరంబునకున్= మిక్కిలి దూరానికి; అరిగినన్= వెళ్ళగా; ఆతని, రథ, వేగంబున్= దుష్యంతునియొక్క రథంయొక్క వేగాన్ని; అనుగమింపన్+ ఓపక= అనుసరించటానికి సమర్థులు కాక; అధిక, క్షుద్, పిపాసా, పరవశులు+అయి= ఎక్కువగా ఆకటిచేతను, దప్పికచేతను, అదుపుతప్పినవారై; పదాతులు= నేలపై నిలబడి యుద్ధం చేసే సైనికులు; ఆ+అయి, ప్రదేశంబులన్= ఆయా ప్రాంతాలలో; విశ్రమించిరి= విశ్రాంతి తీసికొన్నారు; అంతన్= ఆ సమయంలో; దుష్యంతుండు; కతిపయ+ అమాత్య, పురోహిత, సహితుండు+ఐ= కొందరుమంత్రులతో, మంచిచెడులను తెలిపే బ్రాహ్మణులతో కూడినవాడై; కొండు+ఒక, నేల, అరిగి= వేఱొక ప్రదేశానికి చేరి; ముందటన్= ఎదురుగా; ఒక్క, పుణ్య, నదీ, తీరంబునన్= ఒక పవిత్ర మైన నదియొక్క ఒడ్డున; వివిధ, సురభి, కుసుమ, ఫల, భార, వినమ్ర, తరు, లతా, గుల్మ, పరిశోభితంబు+అయిన= రకరకా లయిన వాసనలు కలిగిన పూవులయొక్క పండ్లయొక్క బరువుచే వంగిన చెట్లు, తీగలు, పొదలతో అలంకరింపబడిన; ఒక్క, వనంబు+కని= ఒక వనాన్ని చూచి.

తాత్పర్యం: ఆవిధంగా దుష్యంతుడు అనేకమృగాలను తరిమి తరిమి చంపుతూ, ఇంకా వేటాడే వేడుకతో చాలదూరం వెళ్ళగా, ఆతడి రథవేగానికి కాలిబంట్లు తట్టుకోలేక, అనుసరించే ఓపికను కోల్పోయి, ఆకలిదప్పులతో అదుపుతప్పి ఆ యా ప్రదేశాలలో విశ్రాంతి తీసికొన్నారు. ఆ సమయంలో దుష్యంతుడు కొందరు మంత్రులతో, పురోహితులతో కలిసి వేరొక ప్రదేశానికి చేరి, ఎదురుగా ఒక పవిత్రమైన నదిఒడ్డున పలురకాల వాసనలు గల పూలతోనూ, పండ్లభారంతోనూ వంగిన చెట్లతో, తీగలతో, పొదలతో అందమైన ఒక వనాన్ని చూచాడు.

విశేషం: దుష్యంతుడు వేటాడినది సూర్యరశ్మి సోకని దుర్గమారణ్యం. దానికి సమీపంలో ఉన్నది మాలిని అనే పుణ్యనది. ఆ నదికి ఆవలి ఒడ్డుపై ఉన్నది తపోవనం. ఇటు అరణ్యానికీ అటు తపోవనానికీ నడుమ పుణ్యనది. ప్రకృతివర్ణనం పరమరమణీయం.

కణ్వాశ్రమ వర్ణన (సం. 1-64-3)

క. అమరపతి ఖాండవమునకు ।
రమణను వైశ్రవణు చైత్రరథమునకు సమా
నముగా దీనిని భూభా ।
గమునను రచియించె నొక్కొ కమలజుఁడు దయన్. 8

ప్రతిపదార్థం: కమలజుఁడు= తామరపూవునందు పుట్టినవాడైన బ్రహ్మ; దయన్= కనికరంతో; దీనిని= ఈవనాన్ని; అమర, పతి, ఖాండవమునకున్= దేవతలకు ప్రభువైన ఇంద్రుడి (ఉద్యానవనమైన) ఖాండవానికి; రమణను= ఒప్పిదమైన గుణంలో; వైశ్రవణు, చైత్రరథమునకున్= కుబేరుడియొక్క (ఉద్యానవనమైన) చైత్రరథానికి; సమానముగాన్= సరిసమానంగా, తుల్యంగా; భూ, భాగముననను= ఈ భూఖండంలో; రచియించెన్+ఒక్కొ= నిర్మించాడు కాబోలు.

తాత్పర్యం: ఈవనాన్ని ఇంద్రుడి ఉద్యానవనమైన ఖాండవానికీ, కుబేరుని ఉద్యానవనమైన చైత్రరథానికీ అందంలో సమానంగా ఉండేటట్లు భూతలంమీద బ్రహ్మ దయతో నిర్మించాడు కాబోలు!

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. వనదర్శనంచేతనే అద్భుతభావావిష్టుడైనాడు దుష్యంతుడు. అందులో ప్రవేశిస్తే మరికొన్ని అద్భుతాలను చూడబోతున్నాడనీ, అనుభవించబోతున్నాడనీ అలంకారకృతవస్తుధ్వని. అద్భుతభావవ్యంజకంగా ఫలోత్ప్రేక్షను నన్నయ నిపుణంగా ప్రయోగించాడు.

వ. అని దాని రమణీయభావంబుఁ బొగడుచుఁ జనుదెంచి యవ్వనంబు సొచ్చునప్పుడు. 9

ప్రతిపదార్థం: అని= ఆవిధంగా; దాని= ఆవనంయొక్క; రమణీయ, భావంబున్= అందమైన విధానాన్ని; పొగడుచున్= మెచ్చుకొంటూ; చనుదెంచి= వచ్చి; ఆ+వనంబు, చొచ్చునప్పుడు= ఆవనంలో ప్రవేశించేటప్పుడు (గసడదవాదేశం).

తాత్పర్యం: ఆవిధంగా దుష్యంతుడు ఆ వనసౌందర్యాన్ని మెచ్చుకొంటూ వచ్చి ఆ వనంలో ప్రవేశించే సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. అతిరుచిరాగతుం డయిన యాతనికిన్ హృదయప్రమోద మా
తతముగ నవ్వనంబున లతాలలనల్ మృదులానిలాపవ
ర్జిత కుసుమాక్షతావళులు సేసలు వెట్టినయట్టిరైరి సం
పత దళినీనినాదమృదుభాషల దీవన లొప్ప నిచ్చుచున్. 10

ప్రతిపదార్థం: అతిరుచిర+ఆగతుండు+అయిన= మిక్కిలి ఒప్పిద మైన ఆగమనం కలవాడైన; (ఆగతమంటే ఆగమనం - భావేక్తః- సు+ఆగతము= స్వాగతం కలవాడు అని భావం); ఆతనికిన్= ఆ దుష్యంతుడికి; హృదయ, ప్రమోదము= మనస్సులోని ఆహ్లాదం; ఆతతముగన్= అధికమయ్యేటట్లుగా; ఆ+వనంబున= ఆ వనంలోని; లతాలలనల్= తీగ లనెడి వనితలు; సంపతత్, అళినీ, నినాద, మృదుభాషలన్= అటూ ఇటూ తిరుగుతున్న ఆడుతుమ్మెదల ఝుంకారాలు (ధ్వనులు) అనే మెత్తనిమాటలతో; దీవనలు= ఆశీస్సులను, శుభాకాంక్షలను; ఒప్పన్= తగినవిధంగా; ఇచ్చుచున్= ఇస్తూ; మృదుల+ అనిల+అపవర్జిత, కుసుమ+అక్షత+ఆవళులు= మెల్లని(మెత్తని) గాలులచేత రాల్పబడిన పూవులు అనెడి అక్షతల సమూహాలను; సేసలు, పెట్టిన, అట్టిరు+ఐరి= తలంబ్రాలుగా పోసినవా రైనారు-లేదా-ఆశీఃపురస్సరంగా అక్షతలు చల్లినవారైనారు.

తాత్పర్యం: మిక్కిలి సముచితంగా వచ్చిన ఆ దుష్యంతుడికి మనస్సులోని ఆహ్లాదం అధికమయ్యేటట్లుగా ఆ వనంలోని లతలనే వనితలు అటూ ఇటూ ఎగురుతున్న ఆడుతుమ్మెదల ఝుంకారధ్వనులనెడి మెత్తనిమాటలతో తగిన విధంగా ఆశీస్సులను ఇస్తూ, మెల్లనిగాలులచేత రాల్పబడిన పూవు లనెడి అక్షతలసమూహాన్ని తలంబ్రాలుగా చల్లినట్లు భాసించారు.

విశేషం: అలం: రూపకం, ఉత్ప్రేక్ష, సముచితంగా ప్రవేశించిన రాజుకు సముచితమైన స్వాగతం లభించినట్లు నన్నయ వర్ణించాడు. లతాలలనలు కల్యాణగీతాలతో పుష్పాక్షతలను తలంబ్రాలు పోసినట్లు మీదచల్లారని చేసిన ఈవర్ణనం దుష్యంతుడికి జరుగబోయే కల్యాణాన్ని సూచిస్తున్నది. భావికథార్థ వ్యంజకమైన ఈపద్యం నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తికి రుచిరార్థసూక్తికీ చక్కని ఉదాహరణం. పద్యరచనలో అక్షరరమ్యత ప్రసాదమిశ్రితమైన మాధుర్యగుణాన్ని పోషిస్తూ శృంగారవ్యంజకంగా, ఆస్వాదయోగ్యంగా అమరింది. సవర్ణదీర్ఘాక్షరాల సంయోజనం పద్యానికి గీతికామాధుర్యాన్ని కలిగిస్తున్నది. నన్నయకవితాలక్షణాలన్నీ అమరిన అందమైన పద్య మిది.

వ. మఱియును. 11

తాత్పర్యం: ఇంకను. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కాఱడవిఁ బఱచు మృగముల ।
నూఱడకం దిగిచి డస్సియున్నతని శ్రమం
బాఱఁగ నెడఁ బరితాపము ।
దీఱఁగఁ బైవీచె నన్నదీపవనంబుల్. 12

ప్రతిపదార్థం: కాఱడవిన్= దట్టమైన అడవిలో; పఱచు, మృగములన్= పరుగెత్తే జంతువులను; ఊఱడకన్= విరామంలేకుండా; తిగిచి= చంపి, వేటాడి; డస్సి, ఉన్న, అతని= అలసియున్న ఆ దుష్యంతుడియొక్క; శ్రవంబు+ ఆఱఁగన్= బడలిక తొలగేటట్లు; ఎడన్= మనస్సులోని; పరితాపము, తీఱఁగన్= తాపం తీరేటట్లుగా; ఆ+నదీ, పవనంబుల్= ఆ నదియొక్కగాలులు; పై, వీచెన్= దుష్యంతునిమీద ప్రసరించెను.

తాత్పర్యం: దట్టమైన అడవిలో పరుగెత్తే మృగాలను విరామం లేకుండ వెంటాడి వేటాడటంచేత అలసియున్న దుష్యంతుడి బడలిక తీరేటట్లు, మనసులోని తాపం తగ్గేటట్లు ఆ నదిమీదనుండి వచ్చే చల్లనిగాలులు అతనిపై వీచాయి.

మానిని. ఏచి తనర్చి తలిర్చిన క్రోవుల నిమ్మగు తావుల, జొంపములం
బూచిన మంచియశోకములన్, సురపొన్నలఁ, బొన్నల, గేదఁగులం,
గాచి బెడంగుగఁ బండిన యాసహకారములం, గదళీతతులం
జూచుచు, వీనుల కింపెసఁగన్ వినుచున్ శుకకోకిల సుస్వరముల్.13

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి (పొడవుగా); తనర్చి= ప్రకాశించి పెరిగి; తలిర్చిన= చిగురులువేసిన; క్రోవులన్= ఎర్రగోరంటచెట్లచే; ఇమ్మగు= సొగసైన; తావులన్= తావులను; జొంపములన్= గుబురులుగా; పూచిన= పూలు పూసిన; మంచి, అశోకములన్= అనువైన అశోకవృక్షాలను; సురపొన్నలన్= సురపొన్న వృక్షాలను; పొన్నలన్= పొన్నచెట్లను; గేదఁగులన్= మొగలిచెట్లను; కాచి= కాయలుకాసి; బెడంగుగన్= బాగుగా; పండిన= పండియున్న; ఆ సహకారములన్= ఆ తీయమామిడిచెట్లను; కదళీ, తతులన్= అరటిచెట్ల సమూహాలను; చూచుచున్= చూస్తూ; వీనులకున్= చెవులకు; ఇంపు+ఎసఁగన్= ప్రీతికలిగేటట్లుగా; శుక, కోకిల, సుస్వరముల్= చిలుకలపలుకులు, కోకిలపాటలు (సుస్వరాలు); వినుచున్= వింటూ.

తాత్పర్యం: పొడవుగా పెరిగి చిగురించిన ఎర్రగోరంటచెట్లచే అంద మైన తావులనూ, గుబురులుగా పూలు పూసిన మంచిఅశోకవృక్షాలనూ, సురపొన్నలనూ, పొన్నలనూ, మొగలిపొదలనూ, చక్కగా కాయలు కాసి పండిన అందమైన తియ్యమామిడిచెట్లనూ, అరటిచెట్లగుంపులనూ చూస్తూ చిలుకలపలుకులను, కోకిలలమధురస్వరాలను చెవులకు పండువుగా వింటూ- (మీది పద్యంతో అన్వయం).

విశేషం: అలం: రూపకం, మానినీవృత్తంలోని ప్రతిచరణంలోనూ 7 భగాణాలపై ఒక గురువు ఉంటుంది. 1-13-19 అక్షరాలకు ఒక యతి చొప్పున మూడు యతిస్థానాలుంటాయి. నన్నయ మాత్రం 13వ అక్షరానికి మాత్రమే యతిమైత్రిని పాటించాడు. తెలుగులో ఆ, ఈఅనేవర్ణాలు ప్రసిద్ధినీ, విశేషాన్నీ, మహత్త్వాన్నీ, నిర్దేశాన్నీ సూచిస్తుంటాయి.

కవిరాజవిరాజితము.

చని చని ముందట నాజ్య హవిర్ధృత సౌరభ ధూమలతాతతులం
బెనఁగిన ప్రూఁకుల కొమ్మలమీఁద నపేతలతాంతము లైనను బా
యని మధుపప్రకరంబులఁ జూచి జనాధిపుఁ డంత నెఱింగెఁ దపో
వన మిది యల్లదె దివ్యమునీంద్రునివాసము దానగు నంచు నెదన్.14

ప్రతిపదార్థం: చని, చని= వెళ్ళివెళ్ళి; ముందటన్= ఎదురుగా; ఆజ్య, హవిః, ధృత, సౌరభ, ధూమలతా, తతులన్= యజ్ఞాలలో హోమం చేసే హవిస్సయిన నేతివాసనచేత ధరింపబడిన వాసనలు కల పొగలను కలిగిన (పొగచూరిన) తీగలయొక్క సమూహాలతో; పెనఁగిన= అల్లుకొనిపోయిన;

వ్రాఁకుల, కొమ్మల, మీఁదన్= చెట్లయొక్క కొమ్మలపై; అపేత, లతాంతములు+ఐనను= తొలగిన పూవులు కలిగిన వైనా (పూవులులేని వైనా అనిభావం); పాయని= (చెట్లను) విడిచిపెట్టని; మధుప, ప్రకరంబులన్= తుమ్మెదలయొక్క గుంపులను; చూచి; జన+అధిపుఁడు= ప్రజలకు ప్రభువైన ఆ దుష్యంతుడు; అంతన్= అపుడు; ఇది= ఈప్రదేశం; తపస్+వనము= (ఋషులు) తపస్సు చేసుకొనటానికి అనువైన అడవి; అల్ల+అదె= ఆ కనపడేదే (సమీపవాచకం); దివ్య, ముని+ఇంద్రు, నివాసము= మహిమాన్వితులైన మునులలో (ఇంద్రునివంటివాడు) శ్రేష్ఠుడైన వాడియొక్క ఉండేచోటు; తాను+అగున్, అంచున్= అయిఉండవచ్చునని; ఎదన్= మనస్సులో; ఎఱింగెన్= తెలిసికొన్నాడు.

తాత్పర్యం: ఆవిధంగా చాలదూరం వెళ్ళి ఎదురుగా యజ్ఞహవిస్సులైన నేతులవాసనలుగల పొగలతో చూరిన తీగలతో అల్లుకొని ఉన్న చెట్లకొమ్మల మీద పూవులు లేకున్నప్పటికీ విడిచివెళ్ళకుండా ఉన్న తుమ్మెదగుంపులను చూచి, ఆ ప్రాంతం తపోవన మనిన్నీ, దగ్గరలో ఉన్నది దివ్యమునీంద్రుడి యొక్క నివాస మనిన్నీ అపుడు దుష్యంతుడు మనసులో తెలిసికొన్నాడు.

విశేషం: కవిరాజవిరాజితంలోని ప్రతిచరణంలోనూ 1 నగణం, 6 జగణాలూ, 1 వగణం వరుసగా ఉంటాయి. 1, 8, 14, 20 అక్షరాలు యతిస్థానాలు. ప్రాసనియమం ఉన్నది. నన్నయ మాత్రం 14వ అక్షరంతో మాత్రమే యతిమైత్రిని పాటించి ఒక యతికే ప్రాధాన్య మిచ్చాడు. మానినీవృత్తపాదంలోని మొదటి గురువును రెండు లఘువులుగా మారిస్తే కవిరాజవిరాజిత మౌతుంది. మానినీ, కవిరాజవిరాజితాలు రెండున్నూ జంటగా కుదిరి శకుంతలాదుష్యంతుల భావికల్యాణ సమాగమాన్ని. సూచిస్తున్నవి. వనాలకంటె, ఉద్యానవనాలకంటె తపోవనానికి ఉండే విలక్షణత్వాన్ని నన్నయ ఈవర్ణనంలో చిత్రించాడు. కొమ్మలకు తీగలు అల్లుకోవటం, ఆతీగలపూలమీద తుమ్మెదలువ్రాలటం సామాన్యవనాల స్వభావం. కాని, తపోవనంలో, పూలు, పూలవాసన లేకపోయినా లతలు

హవిస్సులపొగవలన కలిగిన వాసనతో తుమ్మెదలను అమితంగా ఆకర్షిస్తున్నాయి. నాగరకజీవితంలోని విలాసగృహస్థధర్మంకంటె ఆశ్రమంలోని నియమసహితగృహస్థ ధర్మంలోని గాఢత్వాన్ని నన్నయ వ్యంజింపచేస్తున్నాడు. హవిస్సులవాసన అక్కడి స్త్రీల (శకుంతలాదుల) పాతివ్రత్యస్వభావవ్యంజకం.

వ. ఇట్లు హృదయసుఖావహం బగుచున్న యవ్వనంబులో నరిగి యరిగి యనవరత మహాద్విజ పఠ్యమానవేదధ్వనులను, నవిచ్ఛిన్న హూయమా నాగ్ని హోత్రస్వాహాశబ్దంబులను, ననేకమునిగణప్రణీత వచన విషయ విభాగ వినిర్ణయన్యాయనిపుణ విద్వత్సభాసంభాషణఘోషంబులను, బ్రతిపక్ష దుర్విభేద ప్రమాణ విచార్యమాణ వేదార్థ మీమాంసక గోష్ఠీవివాద నాదంబులనుంజేసి మ్రోయుచు, యజ్ఞప్రయోగప్రవీణు లయిన యాజ్ఞికు లకును విహితానుష్ఠానాసక్తులయిన యనుష్ఠాతలకును నధికతపోనిరతు లయిన మహాతపోధనులకును నివాసం బయిన పుణ్యనదీతీరంబునఁ దద్దయు రమ్యం బయి గంగాతీరంబున నర నారాయణస్థానంబునుంబోలె జగత్పావనం బైన కణ్వమహాముని యాశ్రమంబు గని యందు. 15

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; హృదయ, సుఖ+ఆవహంబు+అగుచున్+ఉన్న= మనస్సుకు హాయిని కలిగిస్తూ ఉన్న; ఆ+వనంబులోన్+అరిగి= ఆ వనంలోకివెళ్ళి; అనవరత, మహత్, ద్విజ, పఠ్యమాన, వేద, ధ్వనులను= ఎల్లప్పుడు గొప్ప బ్రాహ్మణులచేత చదువబడుతున్న వేదాలయొక్క స్వరనాదాలను; అవిచ్ఛిన్న, హూయమాన+అగ్నిహోత్ర, స్వాహా, శబ్దంబులను= ఎడతెగకుండ హోమం చేయబడుతున్న అగ్నిహోత్రానికి చెందిన స్వాహా అనే శబ్దాలను; అనేక, మునిగణ, ప్రణీత, వచన, విషయ, విభాగ, వినిర్ణయ, న్యాయ, నిపుణ, విద్వత్, సభా, సంభాషణ, ఘోషంబులను= పెక్కుమంది మునుల సమూహాలచేత రచింపబడిన వాక్యతాత్పర్యాలను విభజించి అర్థనిర్ణయం చేసే న్యాయశాస్త్రనిపుణు లైన పండితులయొక్క సభలలో జరిగే

సంభాషణల సవ్వడులను; ప్రతిపక్ష, దుర్విభేద, ప్రమాణ, విచార్యమాణ, వేద+అర్థ, మీమాంసక, గోష్ఠీ వివాదనాదంబులనున్+చేసి= ప్రతిపక్షం (ఎదురువాదం) చేసేవారికి చిక్కువిడదీయరాని ప్రమాణాల (ఉపపత్తుల)తో ఆలోచింపజేస్తూ ఉన్న వేదతాత్పర్యం గల మీమాంసకుల యొక్క చర్చలలోని వాదప్రతివాదాల ధ్వనులచేత; మ్రోయుచున్= సవ్వడిఔతూ; యజ్ఞ, ప్రయోగ, ప్రవీణులు+అయిన= యజ్ఞాలను నిర్వహించటంలో నిపుణులైన; యాజ్ఞికులకును= యజ్ఞం చేయించే ఋత్విక్కులకును; విహిత+అనుష్ఠాన+ ఆసక్తులు+అయిన= వేదశాస్త్రాలలో చెప్పబడిన యోగ్యమైన తపోజపాదులైన ఆచరణయోగ్యా లైనవాటిని అనుసరించటంలో ఆసక్తి కలవారు ఐన; అనుష్ఠాతలకును= కర్మనిష్ఠులకును; అధిక, తపః, నిరతులు+అయిన= గొప్పదైన తపస్సుచేయటంలో ఆసక్తికలవారు ఐన; తపస్+ధనులకును= తపస్సే ధనంగా గలవారి (తపస్వుల)కిని; నివాసంబు+అయిన= నివసించే ప్రదేశమైన; పుణ్యనదీ తీరంబునన్= పవిత్రమైన నదియొక్క ఒడ్డున; తద్దయున్, రమ్యంబు+అయి= మిక్కిలి సుందరమై; గంగా, తీరంబునన్= గంగానది ఒడ్డున; నర, నారాయణ, స్థానంబునున్, పోలెన్= ప్రాచీనములైన నరనారాయణులయొక్క నివాసస్థలంవలె; జగత్పావనంబు+ఐన= లోకాలను పవిత్రం చేసే; కణ్వ, మహత్, ముని, ఆశ్రమంబున్+కని= కణ్వమహర్షియొక్క ఆశ్రమాన్ని చూచి.

తాత్పర్యం: ఆ విధంగా దుష్యంతుడు హృదయానికి ఆహ్లాదం కలిగించే ఆ వనంలో ప్రవేశించి వెళ్ళివెళ్ళి, నిరంతరం పదక్రమంగా పఠింపబడుతున్న ఉత్తమవిప్రుల వేదనాదాలచేత, నిరంతరాయంగా అగ్నిలో వేల్చబడుతున్న హవిస్సులకు సంబంధించిన స్వాహాశబ్దాలచేత, అనేక మునులు ప్రతిపాదించిన వాక్యాలలోని (చేసిన నిర్వచనాలలోని) విషయాలను విభజించి అర్థనిర్ణయం చేసే న్యాయశాస్త్ర నిపుణులైన పండితులసభలలో జరిగే సంభాషణల ఘోషలతో, ప్రతిపక్షం చేసేవారికి చిక్కువిడదీయరాని ప్రమాణాలతో వేదార్థవిచారణ చేసే

మీమాంసకుల చర్చలలోని వాదిప్రతివాదాలవలన కలిగే సవ్వడుల చేతనూ శబ్దిస్తూ, యజ్ఞాలను నిర్వహించటంలో నిపుణులైన ఋత్విక్కులకు, వేదవిహితాలైన కర్మలను అనుసరించే నిష్ఠాపరులకు, మహాతపోధనులకు నివాస ప్రదేశమై, గంగానదీతీరంలోఉన్న నరనారాయణులు నివసించే ప్రదేశంవలె పుణ్యనదీతీరంలో సుందరంగా శోభిల్లుతూ లోకాన్ని పవిత్రం చేస్తూన్న కణ్వమహాముని ఆశ్రమాన్ని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఆర్షధర్మానికి ఆలవాలమైన ఋష్యాశ్రమంలో సాగే నిత్యకార్యక్రమాలను నన్నయ ఇందులో నిపుణంగా సూచించాడు. తపోవనంలో దుష్యంతుడు ప్రవేశించి ముందుకు సాగుతూ క్రమంగా వృక్షలతాది ప్రకృతి సంపదనూ, యజ్ఞయాగాది క్రతువులు నిర్వహిస్తూ వేదశాస్త్రాధ్యయనాలు సాగిస్తున్న మునుల సమూహాలనూ దర్శించాడు. వనంలోని అంతర్భాగాలలో ప్రవేశించి తర్వాత క్రమంగా కణ్వమహర్షియొక్క శాంతగుణంచేత ప్రభావితమైన ఆశ్రమజీవితం గోచరిస్తుంది. నన్నయ లోకజ్ఞతకు ఇది నిదర్శనం.

సీ. **శ్రవణసుఖంబుగా సామగానంబులు ।**
చదివెడు శుకముల చదువు దగిలి
కదలక వినుచుండు కరులయుఁ గరికర ।
శీతలచ్ఛాయఁ దచ్ఛీకరాంబు
కణముల చల్లనిగా డ్వాసపడి దానిఁ ।
జెంది సుఖం బున్న సింహములయు,
భూసురప్రవరులు భూతబలుల్ తెచ్చి ।
పెట్టు నీవారాన్న పిండతతులు

తే. **గడఁగి భక్షింప నొక్కటఁ గలిసియాడు ।**
చున్న యెలుకలుఁ బిల్లుల యొండు సహజ

వైరివర్గంబులయు సహవాస మపుడు ।
సూచి మునిశక్తి కెంతయుఁజోద్య మంది. 16

ప్రతిపదార్థం: శ్రవణ, సుఖంబు, కాన్= చెవులకు పండుగుగా; సామ గానంబులు= సామవేదాన్ని సస్వరంగా పాడటాలను; చదివెడు= యథాతథంగా పలుకుతూన్న; శుకముల= చిలుకలయొక్క; చదువు= పాండిత్యమందు, చదివేపద్ధతియందు; తవిలి= ఇష్టపడి; ఆసక్తిచెంది; కదలక, వినుచున్న, కరులయున్= కదలకుండా తన్మయత్వంతో వింటున్న ఏనుగులయొక్కయు; కరి, కర, శీతల, ఛాయన్= ఏనుగుల తొండాలయొక్క చల్లని నీడలో; తద్+శీకర+అంబు, కణముల= ఆ తొండాలవలని నీటితుంపురుల యొక్క; చల్లని, గాడ్పు+ఆసపడి= చల్లనిగాలిని కోరుకొని; దానిన్+చెంది= ఆ చల్లగాలిని పొంది; సుఖంబు+ఉన్న, సింహములయున్= హాయిగా ఉన్న సింహాలయొక్కయు; భూసుర, ప్రవరులు= బ్రాహ్మణశ్రేష్ఠులు; భూత, బలుల్= పక్షులు, జంతువుల వంటి జీవులకు ఆహారంగా; తెచ్చిపెట్టు= తీసికొనివచ్చి వివిధప్రదేశాలలో ఉంచే; నీవార+అన్న, పిండతతులున్= నివ్వరిధాన్యంతో వండిన అన్నపుముద్దల సమూహాలను; కడఁగి= పూని; భక్షింపన్= తినటానికి; ఒక్కటన్= ఒకచోట; కలిసి, ఆడుచున్, ఉన్న= కలసిమెలసి తిరుగుతున్న; ఎలుకలున్, పిల్లుల= ఎలుకలయొక్క, పిల్లులయొక్క; ఒండు, సహజ, వైరి, వర్గంబులయున్= పరస్పరం సహజంగా వైరం గల జాతులయినప్పటికిన్నీ; సహవాసము= కలిసిఉండే స్వభావాన్ని, సాహచర్యాన్ని, మైత్రిని; అపుడు, చూచి= ఆ సమయంలో కనుగొని; మునిశక్తికిన్= మునియొక్క మహిమకు; ఎంతయున్= ఎంతగానో; (అమితంగా); చోద్యము+అంది= ఆశ్చర్యపడి.

తాత్పర్యం: చెవులపండువుగా చిలుకలు సామవేదాన్ని సస్వరంగా పాడే పద్ధతులలో ఆసక్తిపొంది తన్మయత్వంతో కదలకుండా వింటున్న ఏనుగులూ, ఏనుగులతొండాల చల్లని నీడలలో వాటి నీటితుంపురుల చల్లనిగాలిపై ఆశపడి

దాన్ని పొంది సుఖంగా ఉన్న సింహాలూ, బ్రాహ్మణశ్రేష్ఠులు భూతబలులు తెచ్చి వివిధప్రదేశాలలో నీవారధాన్యపు అన్నపిండాలను ఉంచగా వాటిని తినాలని వేగిరపడుతూ ఒకచోట కలిసిమెలసి తిరుగుతున్న ఎలుకలూ పిల్లులూ, అవి తమతమ మధ్య పరస్పరం సహజంగా ఉన్న వైరిస్వభావం గల వర్గాలైనప్పటికీ కలసిమెలసి మసలే వాటి స్నేహప్రవృత్తిని చూచి మునిమహిమకు ఎంతగానో ఆశ్చర్యపడి.

విశేషం: ప్రకృతిపురుషుల పరస్పరప్రభావాన్ని వర్ణించటం ఉత్తమకావ్యకళ. శమ దమ సమన్వితుడు, కరుణాహృదయుడు, సమచిత్తుడు అయిన కణ్వమహర్షి తమ మహిమను తపోవన జీవులపై వేసి వాటిమధ్య వైరుద్ధ్యం లేని సహజీవన శాంత ప్రవృత్తిని కలిగించాడు. కణ్వముని మాహాత్మ్యాన్ని ఆశ్రమప్రకృతివర్ణనద్వారా వ్యంజింపజేస్తున్న ఈపద్యం ధ్వనికావ్యరచనకు చక్కని ఉదాహరణం. శకుంతలాదుష్యంతుల జీవితంలో విరుద్ధభావాలకు సంఘర్షణ ఏర్పడగా ప్రసాదించేది కణ్వమహర్షి సహనధర్మశీలమే.

వ. 'ఇక్కాశ్యపుం డైన కణ్వమహామునీంద్రునకు నమస్కరించి వచ్చెద; నా వచ్చునంతకు నందఱు నిచ్చోటన యుండునది' యని. 17

ప్రతిపదార్థం: ఈ+కాశ్యపుండు+ఐన= కశ్యపుని వంశానికి చెందిన ఈ; కణ్వ, మహత్+మునీంద్రునకున్= కణ్వుడనే గొప్ప మునిశ్రేష్ఠునకు; నమస్కరించి, వచ్చెదన్= మ్రొక్కివస్తాను; నా, వచ్చు, అంతకున్= నేను (తిరిగి) వచ్చేంతవరకున్నూ; అందఱున్= మీరందరుకూడ; ఈ+చోటన్+అ= ఈప్రదేశంలోనే; ఉండునది= ఉండవలెను; అని= అని పలికి.

తాత్పర్యం: 'కశ్యపప్రజాపతి వంశజుడైన ఈ కణ్వమహర్షిని దర్శించి నమస్కరించి తిరిగివస్తాను. నేను వచ్చేంతవరకు మీరందరూ ఇక్కడే ఉండండి' అని పలికి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. వలయు నమాత్యులం దగినవారల నుండఁగఁ బంచి ధారుణీ
తలవిభుఁ డొక్కరుండ చని తన్విఁ బయోజదళాయతాక్షి సం
కుల మిళితాళినీల పరికుంచిత కోమలకుంతలన్ శకుం
తల యను కన్యకం గనియెఁ దన్మునివల్లభు మందిరంబునన్. 18

ప్రతిపదార్థం: వలయు+అమాత్యులన్= (ఋష్యాశ్రమాలను దర్శించేటప్పుడు రాజువెంట) ఉండదగిన, అత్యవసరమైన మంత్రులను; తగినవారలన్= యోగ్యులను, సమర్థులను; ఉండఁగన్, పంచి= అక్కడే ఉండటానికి ఆజ్ఞాపించి; ధారుణీతల, విభుఁడు= రాజయిన దుష్యంతుడు; ఒక్కరుండు+అ= ఒక్కడే(ఒంటరిగానే); చని= వెళ్ళి; తన్విన్= సన్నని శరీరం కలదానిని; పయోజ, దళ+ఆయత+అక్షిన్= తామరపూలరేకుల వలె విశాలమైన కన్నులు కలదానిని; సంకుల, మిళిత+అళి, నీల, పరికుంచిత, కోమల, కుంతలన్= దట్టంగా కూడిఉన్న తుమ్మెదల వలె నల్లనై మిక్కిలి వంకరలైన సుకుమారాలైన ముంగురులను కలిగినదానిని; శకుంతల+అను, కన్యకన్= శకుంతల అనే పేరుగల కన్యను; తద్+మునివల్లభు, మందిరంబునన్= ఆ మునిశ్రేష్ఠుడైన కణ్వుడియొక్క నివాసంలో; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: తనవెంట వస్తున్న ముఖ్యు లైన మంత్రులను, అనుచరులను అక్కడే ఉండేటట్లు నియమించి దుష్యంతుడు ఒంటరిగానే వెళ్ళి, మునిశ్రేష్ఠుడైన కణ్వుడి నివాసంలో సన్నని మేను కలిగినది, తామరపూలరేకులవంటి విశాలమైన కన్నులు కలది, ఒత్తుగా గుమికూడిన తుమ్మెదవలె నల్లగా వంకరలైన మెత్తని ముంగురులు కలది, అయిన శకుంతల అనే కన్యను చూచాడు.

విశేషం: అలం: ఉపమ, వృత్త్యనుప్రాసం. ఈ పద్యరచనలో 'ల' అనే అక్షరం తరచుగా వినిపించి శకుంతల సౌందర్య లావణ్యాలను ధ్వనింపజేస్తున్నది. ఇది నన్నయ రచనలోని అక్షరరమ్యత. కణ్వుడిని దర్శింపవచ్చిన దుష్యంతుడు ఆశ్రమంలో మునికిబదులు శకుంతలను చూచినట్లు వర్ణించటం విశేషం, శకుంతల మధుర మూర్తిని వర్ణించటంలో నన్నయ మాధుర్యగుణం పోషించాడు.

వ. అదియును ననంతవిలాసంబున జయంతుండ పోని దుష్యంతు నెఱింగి, యతిసంభ్రమంబున నాసనార్ఘ్య పాద్యాది విధులం బూజించి, కుశలం బడిగి యున్న, నక్కన్యకం జూచి దుష్యంతుం డి ట్లనియె. 19

ప్రతిపదార్థం: అదియునున్= ఆ శకుంతలకూడ; అనంత, విలాసంబునన్= అపారమైన శరీరసహజహావభావాలతో; జయంతుండు+అ, పోని= జయంతుడివలెనేఉన్న; దుష్యంతున్+ఎఱింగి= దుష్యంతుడిని తెలిసికొని; అతి, సంభ్రమంబునన్= మిక్కిలి (ఆదరగౌరవాలతోకూడుకొన్న) తొట్రుపాటుతో; ఆసన+ఆర్ఘ్య, పాద్య+ఆది, విధులన్= కూర్చుండటానికి ఆసనం. త్రాగటానికి నీరు, కాళ్ళుకడుగుకొనటానికి నీరు, ఇవ్వటం మొదలైన అతిథిసత్కార విధానాలచేత; పూజించి= గౌరవించి; కుశలంబు+అడిగి, ఉన్నన్= క్షేమాన్ని తెలిసికొని ఉండగా; ఆ+కన్యకన్= ఆ శకుంతలను; చూచి; దుష్యంతుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: శకుంతలకూడా అపారసహజశరీరహావభావాలు కలిగి, ఇంద్రుడికుమారుడైన జయంతుడితో పోల్చదగిన సౌందర్యంతో ఉన్న దుష్యంతుడిని తెలిసికొని, ఆదరగౌరవాలతో కూడుకొన్న తొట్రుపాటుతో ఆసనం, అర్ఘ్యం, పాద్యం మొదలైన అతిథి సపర్యలను చేసి పూజించి, క్షేమాదులను తెలిసికొని ఉండగా, ఆ కన్యను చూచి దుష్యంతుఁడు ఈవిధంగా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

ఉ. 'క్రచ్చఱ వేఁట వచ్చి యిట కణ్వమహాముని౯ జూచి పోవఁగా
వచ్చితి; మెందుఁ బోయిరొకొ వా?' రనినన్ విని యాలతాంగి ' వా

రిచ్చటినుండి యీక్షణమ యేఁగిరి కానకుఁ బండ్లుదేర; మీ
వచ్చు టెఱింగిరేని జనవల్లభ! వారును వత్తు రింతకున్. 20

ప్రతిపదార్థం: క్రచ్చఱన్= సవిలాసంగా, వినోదంగా; వేఁట, వచ్చి= వేటకొరకు వచ్చి; ఇటన్= ఈ ఆశ్రమంలో; కణ్వ, మహత్+మునిన్= కణ్వుడనే గొప్పమునిని; చూచి, పోవఁగాన్= దర్శించి పోవటానికి; వచ్చితిమి= వచ్చాము (ఈబహువచనం స్వీయగౌరవవాచకం); వారు= కణ్వమహర్షి (ఇక్కడి బహువచనంకూడ గౌరవవాచకం); ఎందున్+పోయిరి+ఒకొ= ఎక్కడికి వెళ్ళినారో కదా!; అనినన్= అని అడుగగా; విని; ఆ, లతా+అంగి= తీగవలె శరీరంగల ఆ శకుంతల; వారు= ఆ కణ్వమహర్షి; ఇచ్చటి నుండి= ఈ ఆశ్రమంనుండి; ఈ క్షణము+అ= ఇప్పుడే; కానకున్= అడవికి; పండ్లు తేరన్= పండ్లను తేవటానికి; ఏఁగిరి= వెళ్ళారు; మీ, వచ్చుట= మీరాకను; ఎఱింగిరి+ఏని= తెలిసికొన్నచో; జనవల్లభ= ఓరాజా!; వారును= ఆ కణ్వమహర్షికూడ; ఇంతకున్= ఈలోపుననే; వత్తురు= వస్తారు.

తాత్పర్యం: 'వినోదంగా వేటకు వచ్చి కణ్వమహాముునిని దర్శించుకొని పోదా మని ఇక్కడకు వచ్చాను. వారు ఎక్కడికి పోయినారోకదా?' అని దుష్యంతుడు అడుగగా, లతాంగి అయిన శకుంతల ఇ ట్లన్నది: 'వారు ఇక్కడినుండి ఇంతకుముందే (ఈక్షణమే) పండ్లు తేవటానికి అడవిలోకి వెళ్ళారు. మీరాక వారికి తెలిస్తే, ఓరాజా! వారుకూడ ఇప్పుడే తిరిగివస్తారు'. (శకుంతల మాటలు తరువాయి వచనంలో కొనసాగుతున్నాయి.)

వ. 'వారు వచ్చునంతకు నొక్కముహూర్తం బుండునది' యనిన విని
యక్కోమలి వినయంబునకు మృదుమధురవచనంబులకు సంతసిల్లి,
దానిం గన్యకగా నెఱింగి మనోజరాజ్యలక్ష్మియుంబోని దాని సర్వలక్షణ
లక్షితంబు లయిన సర్వావయవంబులుం జూచి సంచలితహృదయుం డై
'నీ వెవ్వరి కూఁతుర? విట్టి రూపలావణ్యవిలాసవిభ్రమగుణసుందరి విందుల
కేల వచ్చి'? తని యడిగిన నది యి ట్లనియె. 21

ప్రతిపదార్థం: వారు, వచ్చు, అంతకున్= వారు తిరిగి వచ్చేవరకు; ఒక్క, ముహూర్తంబు= ఒక్కక్షణం (కొంచెంసేపు లేదా రెండు గడియల కాలం); ఉండునది= వేచియుండండి; అనినన్, విని= అని శకుంతల పలుకగా దుష్యంతుడు విని; ఆ, కోమలి, వినయంబు నకున్= ఆ (మృదులస్వభావ యైన) శకుంతల అణకువకూ; మృదు, మధుర, వచనంబులకున్= మెత్తని, తీయని మాటలకూ; సంతసిల్లి= సంతోషపడి; దానిన్= ఆ శకుంతలను; కన్యక, కాన్= వివాహం కాని వనితగా; ఎఱింగి= తెలిసికొని; మనోజ,రాజ్య, లక్ష్మియున్+పోని= మన్మథునియొక్క రాజ్యలక్ష్మివలెఉన్న; దాని= ఆశకుంతల యొక్క; సర్వ, లక్షణ, లక్షితంబులు+అయిన= అన్ని మంచి లక్షణాలు కలిగిన, సాముద్రిక చిహ్నాలు కల; సర్వ+అవయవంబులున్= శరీరఅవయవాల నన్నింటిని; చూచి; సంచలిత, హృదయుండు+ఐ= చలించిన మనస్సు కలవాడై(కోరిక కలవాడై అనిభావం); నీవు, ఎవ్వరి, కూఁతురవు= నీవు ఎవరియొక్క కుమార్తెవు?; ఇట్టి, రూప, లావణ్య, విలాస, విభ్రమ, గుణ, సుందరివి= ఇంతటి అపూర్వమైన ఆకారం, మేని నిగనిగ, సహజసుందర హావభావాలు, చేష్టలు అనే గుణాలచేత అందగత్తె వైన నీవు; ఇందులకున్= ఇక్కడికి, ఈ ఆశ్రమానికి; ఏల= ఏకారణంవలన; వచ్చితి(వి)= వచ్చావు? అని; అడిగినన్, అది= ఆ శకుంతల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: 'కణ్వమహాముని వనంనుండి తిరిగివచ్చేవరకు కొంతసేపు వేచి ఉండండి' - అని పలికిన ఆ శకుంతల వినయగుణానికీ, మెత్తని తియ్యని పలుకులకూ సంతోషించి, ఆమెను కన్యగా తెలిసికొని, మన్మథుని రాజ్యలక్ష్మివలె శుభలక్షణాలన్నింటితో కూడుకొన్న శరీరావయవాలు గల ఆమె సౌందర్యాన్ని చూచి స్పందించిన మనస్సుతో 'నీవు ఎవ్వరి కుమారితవు? ఇటువంటి అపూర్వ రూపాన్నీ లావణ్యాన్నీ సహజ శరీరహావభావ గుణాలు గల సుందరివి ఈ ఆశ్రమానికి ఏకారణంవలన వచ్చావు?' అని అడుగగా

ఆమె ఇట్లా పలికింది.

విశేషం: అలం: తొలిచూపులోనే శకుంతలాదుష్యంతులకు అభిలాష కలిగింది. అనంతవిలాసంతో జయంతుడివలెనున్న అతని అందం ఆమెను ఆకర్షించింది; ఆమె వర్తనం సౌందర్యం మన్మథరాజ్యలక్ష్మివలె ఉన్న ఆమె రూపవైభవం అతడిని ఆకట్టుకొన్నాయి. ఆశ్రమంలో కంటె రాజసౌధంలో ఉండదగిన సుందరిగా ఆమెను భావించి ఆసక్తితో ఆమెనుగురించి అడిగాడు దుష్యంతుడు.

శకుంతల దుష్యంతునకుఁ దనజన్మక్రమం బెఱింగించుట (సం. 1-65-14)

క. 'జగతీవల్లభ! యే న।
త్యగణిత ధర్మస్వరూపుఁ డని జనములు దన్
బొగడఁగ జగదారాధ్యుం।
డగు కణ్వమహామునీంద్రునాత్మజ' ననినన్. 22

ప్రతిపదార్థం: జగతీ, వల్లభ= లోకానికి నాథుడవైన ఓరాజా!; ఏను= నేను; అతి+అగణిత, ధర్మ, స్వరూపుఁడు+అని= మిక్కిలి గొప్పదయిన ధర్మము యొక్క రూపం వంటివాడు అని; జనములు= లోకములు; తన్= తనను (కణ్వుడిని); పొగడఁగన్= మెచ్చుకొంటూ ఉండగా; జగత్, ఆరాధ్యుండు+అగు= లోకాలచేత పూజింపదగినవాడు అయిన, కణ్వ, మహత్+ముని+ఇంద్రు, ఆత్మజన్= కణ్వుడుఅనేపేరుగల గొప్పమునిశ్రేష్ఠుడియొక్క కుమారితను; అనినన్= అనగా.

తాత్పర్యం: 'ఓ ప్రభువా! అపారమైన ధర్మమే రూపం దాల్చినవాడని ప్రజలు తనను ప్రశంసిస్తూ ఉండగా లోకపూజ్యుడై ఉన్న కణ్వమహా మునీంద్రుడి కూతురిని నేను' అని అనగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. 'ఇది మునికన్య యేని మఱి యేలొకొ యీలలితాంగియందు నా
హృదయము దద్దయుం దవిలె; నిప్పలు కింకను నమ్మనేర న

య్యెద; విజితేంద్రియుం డనఁగ నిమ్మునిఁ బాయక విందు' నంచుఁ దా
నిది కలరూ పెఱుంగ నవనీపతి యుత్సుకుఁ డయ్యె నాత్మలోన్.23

ప్రతిపదార్థం: 'ఇది= ఈకన్యక (శకుంతల); ముని, కన్య, ఏని= మునియొక్క కూతురైనట్లయితే; మఱి= ఈవిధంగా అని భావం; ఏల+ఒకొ= ఏకారణం చేతనో; ఈ, లలిత+అంగి, అందున్= ఈకోమలిపై; నాహృదయము= నామనస్సు; తద్దయున్= బాగా(గాఢంగా); తవిలెన్= లగ్నమైనది; ఈ, పలుకు= (ఈమె చెప్పిన) ఈమాటను; ఇంకను, నమ్మనేరను+అయ్యెదన్= ఇప్పటికిన్నీ నమ్మజాలక ఉన్నాను; ఈ+మునిన్= ఈకణ్వమునిని; విజిత+ఇంద్రియుండు+అనఁగన్= జయింపబడిన ఇంద్రియాలు కలవాడని లోకులు అనగా (అనగా అవివాహితుడై బ్రహ్మచర్యవ్రతంలో ఉన్నా డని విన్నాను అనిభావం); పాయక= ఎల్లప్పుడూ; విందున్= వింటాను; అంచున్= అని తలుస్తూ; తాన్= తాను స్వయంగా; ఇది= ఈవిషయాన్ని (ద్వితీయకు మారుగా ప్రథమ); కల, రూపు+ఎఱుంగన్= ఉన్నది ఉన్నట్లుగా తెలిసికొనటానికి; అవనీ, పతి= రాజు (దుష్యంతుడు); ఆత్మలోన్= మనస్సులో; ఉత్సుకుఁడు+అయ్యెన్= ఆసక్తు డైనాడు.

తాత్పర్యం: 'ఈ శకుంతల మునికన్యయే అయినట్లయితే ఈకోమలిపై నామనస్సు ఎందుకు గాఢంగా లగ్నమైనది?' 'నే నీమెమాటను నమ్మజాలకుండా ఉన్నాను. ఈ కణ్వముని ఇంద్రియాలను జయించినవా డని ఎప్పుడూ వింటూ ఉంటాను' అని భావిస్తూ, 'ఈమె మాటలలోని యాథార్థ్యాన్ని ఉన్నది ఉన్నట్లు తెలుసుకోవా' లని మనస్సులో దుష్యంతుడు ఆసక్తిని పొందాడు.

విశేషం: దుష్యంతుడు క్షత్రియుడు. అతడి హృదయం శకుంతలయందు లగ్నమైనది. ఆమేమో తాను మునికన్య నని చెప్పింది. ఆమె నిజంగా మునికన్యయే అయితే అతని అంతఃకరణం ఆమెయందు ఆసక్తిని పొందేది కాదు. తన అంతఃకరణం ధర్మబద్ధమైనదని దుష్యంతుడికి గాఢమైన విశ్వాసం. అది అతడి

ఉత్తమసంస్కారానికి గుర్తు. మూలభారతంలో తన సంశయాన్ని దుష్యంతుడు సూటిగా శకుంతలతో చెప్పినట్లున్నది. దానిని నన్నయ దుష్యంతుడి ఆత్మగతంగా మార్చాడు. ఈ కల్పనంమీద కాళిదాసు రచించిన అభిజ్ఞానశాకుంతల నాటకంలోని "అసంశయం క్షత్రపరిగ్రహక్షమా । యదార్య మస్యా మభిలాషి మే మనః'' "సతాం హి సందేహపదేషు వస్తుషు, ప్రమాణమంతఃకరణప్రవృత్తయః '' అనే శ్లోకపాదాల ప్రభావం కనబడుతున్నది. తన మనస్సు ఆమెపై లగ్నమైనది కాబట్టి ఆమె క్షత్రియపరిగ్రహయోగ్యమైనదనిన్నీ, దానికి దుష్యంతుడి అంతఃకరణమే సాక్షి అనిన్నీ భావం.

వ. ఇట్లు దుష్యంతుం డా శకుంతలజన్మం బెఱుంగ వేఁడి వెండియు దాని కి ట్లనియె. 24

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; దుష్యంతుండు; ఆ+శకుంతల జన్మంబు= ఆ శకుంతలయొక్క పుట్టుకనుగురించి; ఎఱుంగన్, వేఁడి, తెలిసికొనగోరి; వెండియున్= మరియు; దానికిన్= శకుంతలతో; ఇట్లు+ అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: దుష్యంతుడు ఆవిధంగా ఆ శకుంతలపుట్టుకనుగురించి తెలిసికొనగోరి శకుంతలతో మరల ఈవిధంగా అన్నాడు.

తే. ఉత్తమాశ్రమనిష్ఠితుఁ డూర్ధ్వరేతుఁ ।
డైన కణ్వమహాముని యనఘచరితుఁ;
డట్టిముని కెట్లు గూఁతుర వైతి? దీని ।
నాకు నెఱుఁగంగఁ జెప్పుము నలిన నేత్ర! 25

ప్రతిపదార్థం: నలిన, నేత్ర= పద్మాలవంటి కన్నులు కలదానా!; ఉత్తమ+ ఆశ్రమ, నిష్ఠితుఁడు= ఉత్తమమైన ఆశ్రమమైన సన్న్యాసంలో నిష్ఠ కలిగిన వాడున్నూ; ఊర్ధ్వ, రేతుఁడు= అధఃపతనం లేని రేతస్సు కలవాడు (ఇంద్రియ నిగ్రహం కలవాడు) న్నూ; ఐన; కణ్వ, మహాముని; అనఘ, చరితుఁడు=

కళంకంలేని చరిత్రకలవాడు; అట్టి= అటువంటి; మునికిన్; ఎట్లు= ఏవిధంగా; కూతురవు+ఐతి(వి)= కుమార్తె వైనావు; దీనిన్= ఈవిషయాన్ని; నాకున్= (దుష్యంతుడికి); ఎఱుఁగంగన్+చెప్పుము= తెలియజెప్పుము.

తాత్పర్యం: పద్మనేత్ర వైన ఓశకుంతలా! చతుర్విధాశ్రమాలలో ఉత్తమ మైన సన్న్యాసాశ్రమాన్ని నిష్ఠతో పాటించిన వాడూ, ఇంద్రియనిగ్రహం కలవాడూ అయిన కణ్వమహర్షి కళంకంలేని చరిత్రకలవాడు. అటువంటి ఆ మునికి నీ వెట్లా కూఁతుర వైనావు? ఆ సంగతి నాకు తెలియజెప్పుము.

వ. అని యడిగిన నారాజునకు శకుంతల యి ట్లనియె. 26

ప్రతిపదార్థం: అని, అడిగినన్= ఆ విధంగా అడుగగా; ఆ, రాజునకున్= ఆ రాజైన దుష్యంతుడికి; శకుంతల; ఇట్లు, అనియెన్= ఈవిధంగా అన్నది.

తాత్పర్యం: దుష్యంతుడు ఆవిధంగా అడుగగా శకుంతల ఈవిధంగా అన్నది.

క. 'ఇక్కమలాక్షి శకుంతల ।
యెక్కడియది? దీని జన్మ మెవ్విధ?' మని త
మ్ముక్క మునినాథుఁ డడిగిన ।
నిక్కాశ్యపు లర్థిఁ జెప్పి రేను వినంగన్. 27

ప్రతిపదార్థం: ఒక్కముని, నాథుఁడు= ఒక మునిశ్రేష్ఠుడు; ఈ+కమల+అక్షి= పద్మాలవంటి కన్నులు కల ఈ; శకుంతల; ఎక్కడి+అది= ఎక్కడినుండి వచ్చింది; దీని, జన్మము= ఈ శకుంతలయొక్క పుట్టుక; ఏ+విధము= ఎటువంటిది? అని; తమ్మున్= తమను (కణ్వమహర్షిని); అడిగినన్= అడుగగా; ఈ+కాశ్యపులు= కశ్యపవంశానికి చెందిన ఈ కాశ్యపులవారు; ఏను; వినంగన్= నేను వినేటట్లుగా; అర్థిన్= ప్రీతితో (సంస్కృతంలో ఈ అర్థం లేదు); చెప్పిరి= చెప్పారు (బహువచనం గౌరవసూచకం).

తాత్పర్యం: ఒకమునిశ్రేష్ఠుడు ఒకసారి కణ్వులవారిని ఈవిధంగా అడిగారు - 'పద్మాలవంటి కన్నులు గల ఈ శకుంతల ఎక్కడినుండి వచ్చింది? దీని పుట్టుపూర్వోత్తరా లేమిటి?' అని. అప్పుడు కణ్వులవారు నేనుకూడా వినేటట్లు ఈవిధంగా ప్రీతితో చెప్పారు.

వ. 'నాజన్మప్రకారంబు మాయయ్య యమ్మునికిం జెప్పినవిధంబు చెప్పెదఁ జిత్తగించివిను'మని యాదుష్యంతునకు శకుంతల యి ట్లనియె. 28

ప్రతిపదార్థం: మా+అయ్య= మాతండ్రి (కణ్వమహర్షి); నా, జన్మ, ప్రకారంబున్= నా పుట్టుక వృత్తాంతాన్ని; ఆ+మునికిన్, చెప్పిన, విధంబు, చెప్పెదన్= ఆ మునితో చెప్పిన పద్ధతిగానే విన్నవిస్తాను; చిత్తగించి= మనసుపెట్టి; వినుము+అని; శకుంతల; ఆ దుష్యంతు నకున్; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: 'మా తండ్రిగారైన కణ్వమహర్షి నా జన్మవృత్తాంతాన్ని ఆ మునికి చెప్పిన పద్ధతిగా నీకు విన్నవిస్తాను. మనసుపెట్టి విను' మని శకుంతల దుష్యంతుడితో ఈవిధంగా అన్నది.

విశేషం: కణ్వుడు శకుంతలకు ఆమెవృత్తాంతాన్ని ఎన్నడూ ఆమెతో స్వయంగా చెప్పకపోవటం ఒకవిశేషం. ఒక మునితో చెప్పవలసివచ్చినప్పుడు ఆమెకూడా వినేటట్లు చెప్పటం ఔచిత్యం. ఇప్పుడు శకుంతల తనజన్మవృత్తాంతాన్ని తానే చెప్పుకొంటున్నట్లు కాకుండా కణ్వుడు మునికి చెప్పినట్లుగా చెప్పటం పరమౌచిత్యం. ఈ పద్ధతి వలన శకుంతల జన్మవృత్తాంతానికి ప్రామాణికత కలుగుతుంది. కణ్వపాత్ర రంగంమీద లేని లోపం తీరుతుంది. ఇది నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి.

సీ. అనఘుఁడు రాజర్షియై తపశ్శక్తిమై ।
బ్రహ్మర్షిభావంబుఁ బడసియున్న
సన్మునీశ్వరుఁడు విశ్వామిత్రుఁ డతిఘోర ।
తపము సేయుచునున్నఁదత్తపమున

కెంతయు వెఱచి దేవేశ్వరుఁ డప్సరో ।
గణములలో నగ్రగణ్య యైన
దాని మేనక యను ధవళాక్షిఁ బిలిచి 'వి ।
శ్వామిత్రుపాలికిఁ జని తదీయ

ఆ. ఘోరతపము చెఱిచి కోమలి! నా దైన !
దేవరాజ్యమహిమఁ దివిరి నీవు
గావు' మనిన నదియుఁ గడు భయంపడి యమ ।
రేశ్వరునకు మ్రొక్కియిట్టు లనియె. 29

ప్రతిపదార్థం: అనఘుఁడు= కళంకంలేనివాడు; రాజ+ఋషి+ఐ= రాజర్షి ఐ; (తపస్సాధనలో రాజర్షి కావటం ఒకస్థాయి; బ్రహ్మర్షి కావటం దాని పైస్థాయి, విశ్వా మిత్రుడు రాజవంశంలో పుట్టి తపస్సుచేసి రాజర్షి అయినాడు); తపస్+శక్తి, మైన్= తపస్సుయొక్క బలంతో; బ్రహ్మ+ఋషి, భావంబున్= బ్రహ్మర్షి అనే స్థితిని (ఇది తపస్సాధనలో మిక్కిలి గొప్పది); పడసి, ఉన్న= పొందిఉన్న; సత్+ముని+ఈశ్వరుఁడు= ఉత్తములైన మునులలో గొప్పవాడైన; విశ్వామిత్రుఁడు; అతి, ఘోర, తపము= మిక్కిలి భయంకరమైన తపస్సును; చేయుచున్+ఉన్నన్= చేస్తూఉండగా; తద్+ తపమునకున్= ఆ మహర్షియొక్క తపస్సుకు; ఎంతయున్, వెఱచి= మిక్కిలి భయపడి; దేవ+ఈశ్వరుఁడు, దేవతలకు రాజైన ఇంద్రుడు; అప్సరస్+గణములలోన్= అప్సరసలయొక్క సమూహాలలో; అగ్ర, గణ్య, ఐన, దానిన్= మొదట లెక్కింపదగిన దైన దానిని (శ్రేష్ఠురాలిని); మేనక, అను, ధవళ+అక్షిన్= మేనక అనే పేరుగల తెల్లని కన్నులు కలదానిని; పిలిచి; కోమలి!= మృదుస్వభావురాలా!; విశ్వామిత్రుపాలికిన్= విశ్వామిత్రుడి దగ్గరకు; చని= వెళ్ళి; తదీయ, ఘోర, తపము= అతనియొక్క భయంకరమైన తపస్సును; చెఱిచి= పాడుచేసి; నా+అది+ఐన= నాకు చెందిన; దేవ, రాజ్య, మహిమన్= దేవతల రాజ్య మైన స్వర్గంయొక్క గొప్పతనాన్ని; తివిరి= ప్రయత్నించి; నీవు; కావుము=

కాపాడుము; అనినన్= అని చెప్పగా; అదియున్= ఆ మేనకకూడ; కడున్, భయము, పడి= మిక్కిలి భయపడి; అమర+ఈశ్వరునకున్= దేవతల ప్రభు వైన ఇంద్రుడికి; మ్రొక్కి= నమస్కరించి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: రాజర్షి యై తపశ్శక్తితో బ్రహ్మర్షి భావాన్ని పొందియున్న పుణ్యాత్ముడు, మునిశ్రేష్ఠుడు అయిన విశ్వామిత్రుడు అత్యంతభయంకర మైన తపస్సు చేస్తూ ఉండగా, ఆ తపస్సుకు మిక్కిలి భయపడి దేవేంద్రుడు అప్సరోగణాలలో ఉత్తమురా లైన మేనకను పిలిపించి, 'ఓకోమలీ! నీవు ఆ విశ్వామిత్రుడి దగ్గరకు పోయి అతని భయంకర తపస్సును ఏ యత్నంతో నైనా భగ్నంచేసి నా స్వర్గరాజ్య గౌరవాన్ని నీవు రక్షించాలి' అని పల్కగా, మేనక అందుకు భయపడి ఇంద్రుడికి మ్రొక్కి ఈవిధంగా అన్నది.

చ. వనజభవప్రభావుఁ డగువాని వసిష్ఠు నపత్యశోక మ
న్వననిధిలోన ముంచిన యవారితసత్త్వుఁడు నిన్నుఁ దొట్టి యీ
యనిమిషు లెల్లవానికి భయంపడుచుండుదు రట్టియుగ్రకో
పనుకడ కిప్పు డేఁగు మని పాడియె యిప్పని నన్నుఁ బంపఁగన్.30

ప్రతిపదార్థం: వనజభవ, ప్రభావుఁడు+అగువానిన్= బ్రహ్మయొక్క మహత్త్వం వంటి మహత్త్వం కలిగిన; వసిష్ఠున్= వసిష్ఠ మహామునిని; అపత్యశోకము+అన్, వననిధిలోనన్= సంతానం (చనిపోవటం) వలని దుఃఖ మనే సముద్రంలో; ముంచిన= మునిగేటట్లు చేసిన; అవారిత, సత్త్వుఁడు= అడ్డులేని గొప్పతనం కలవాడు (విశ్వామిత్రుడు); నిన్నున్+తొట్టి= నిన్ను మొదలుకొని; ఈ, అనిమిషులు, ఎల్లన్= ఈ దేవతలందరున్నూ; వానికిన్= ఆ విశ్వామిత్రుడికి; భయము+పడుచున్+ఉండుదురు= భయపడుతూ ఉంటారు; అట్టి, ఉగ్ర, కోపను, కడకున్= అటువంటి భయంకరమైన కోపంగలవాడైన విశ్వామిత్రుడి వద్దకు; ఇప్పుడు= ఈ పరిస్థితిలో; ఏఁగుము+అని= వెళ్ళుమని; ఈ+పనిన్= ఈకార్యంలో; నన్నున్, పంపఁగన్= నన్ను పంపటం; పాడి+ఎ= ధర్మమా? (ధర్మం కాదని భావం).

తాత్పర్యం: బ్రహ్మమహిమ వంటి మహిమ గల వసిష్ఠుడిని సైతం పుత్రశోకసాగరంలో ముంచినవాడు ఆ అనివార్యతేజస్వి విశ్వామిత్రుడు. నీవు మొదలుకొని దేవతలందరూ ఆ మహర్షి అంటే భయపడుతూ ఉంటారు. అట్టి భయంకర కోపస్వభావుడి పాలికి ఈ పనిమీద ఇప్పుడు నన్ను పొమ్మని చెప్పటం న్యాయం కాదు.

విశేషం: అలం: రూపకం. వసిష్ఠ మహర్షిని బ్రహ్మమహత్త్వం వంటి మహత్త్వం కలవాడని చెప్పటం; విశ్వామిత్రుడిని ఉగ్రకోపనుడు (రుద్రునివంటి కోపంకలవాడు) అనటం విశేషం. నూరుగురు పుత్రులు చనిపోవటంవలన కలిగే పుత్రశోకం సముద్రం వంటిదని రూపకం చేయటం సార్థకం. బ్రహ్మనే సముద్రంలో ముంచగలిగిన వాడికి దేవతలు ఒక్కలెక్కయా అని వ్యంగ్యం. దేవేంద్రాదులే భయపడుతూ ఉండగా కోమలికి ఆపని అసాధ్యమని భావం. ఉగ్రకోపనుని ఉగ్రత తరువాతి పద్యంలో వర్ణింపబడుతున్నది.

ఉ. అమ్ముని యల్గి చూచుడును నాక్షణమాత్రన గోత్రధారుణీ
ధ్రమ్ములు వ్రయ్యు, నయ్యిసుము దక్కఁగ నంబుధు లింకు, మూఁడులో
కమ్ములు దిర్దిరం దిరుగు, గాడ్పు చలింపఁగ నోడు, నుగ్రతం
బమ్మినయట్టి కోపపరుపాలికి భామలు వోవ నోడరే. 31

ప్రతిపదార్థం: ఆ+ముని= ఆమహర్షి (విశ్వామిత్రుడు); అల్గి, చూచుడును= కోపించి చూచిన వెంటనే; ఆ+క్షణమాత్రన్+అ= ఆ క్షణంలోపలే; గోత్ర, ధారుణీధ్రమ్ములు= సప్తకులపర్వతాలు; వ్రయ్యున్= బ్రద్దలౌతాయి; ఆ+ఇసుము, తక్కఁగన్= ఇసుక (మాత్రమే) మిగిలేటట్లుగా; అంబుధులు= సముద్రాలు; ఇంకున్= ఇంకిపోతాయి; మూఁడు, లోకమ్ములు= స్వర్గమర్త్య

పాతాళాలు అనే మూడు లోకాలు; దిర్దిరన్= దిరదిర, గిరగిర; తిరుగున్= తిరుగును; గాడ్పు= వాయువు, గాలి; చలింపఁగన్= కదలటానికి, వీచేటందుకు; ఓడున్= జంకుతుంది; ఉగ్రతన్= తీవ్రమైన కోపభావంతో; పమ్మిన+అట్టి= అతిశయించినట్టి; కోపపరు, పాలికిన్= కోపస్వభావం కలవాడి యొద్దకు; భామలు= స్త్రీలు; పోవన్+ఓడరు+ఏ= వెళ్ళటానికి జంకరా? (జంకుతా రని భావం).

తాత్పర్యం: ఆ విశ్వామిత్రముని కోపించి చూస్తే ఆ క్షణంలోనే కులపర్వతాలన్నీ బ్రద్దలౌతాయి; అడుగున ఉన్న ఇసుకమాత్రమే మిగిలేటట్లు సముద్రాలన్నీ పూర్తిగా ఇంకిపోతాయి; మూడులోకాలూ గిరగిరా చక్రంవలె తిరిగిపోతాయి; గాలి కదలటానికికూడా జంకుతుంది. ఉగ్రస్వభావంతో అతిశయించే ఆ కోపపరుడి సమీపానికి భామలు పోవటానికి భయపడరా?

విశేషం: కులపర్వతాలు: మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తిమంతము, గంధమాదనము, వింధ్యము, పారియాత్రము సప్తసముద్రములు: లవణసముద్రము, ఇక్షుసముద్రము, సురాసముద్రము, సర్పిస్సముద్రము, దధిసముద్రము, క్షీరసముద్రము, జలసముద్రము.

వ. 'అయినను నానేర్చువిధంబున నమ్మునివరుచిత్తంబు మెత్తన చిత్తజాయత్తం బగునట్లుగాఁ జేసెద' నని వాసవు వీడ్కొని మేనక తనకు మందమలయాని లంబు దోడుగాఁ జనుదెంచి, హిమవత్పర్వతప్రదేశం బునం దపంబు సేయుచున్న విశ్వామిత్రు తపోవనంబు సొత్తెంచిన. 32

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికీ; నా, నేర్చు, విధంబునన్= నేను నేర్చిన పద్ధతిలో; ఆ+మునివరు, చిత్తంబు= ఆ మునిశ్రేష్ఠుని మనస్సు; మెత్తన= తిన్నగా, లలితంగా; చిత్తజ+ఆయత్తంబు+అగునట్లు+కాన్= మన్మథునికి స్వాధీనమయ్యేటట్లుగా; చేసెదను+అని= చేస్తాను అనిచెప్పి; వాసవున్= దేవేంద్రుడిని; వీడ్కొని; మేనక; తనకున్= (మేనకకు); మంద, మలయ+అనిలంబు= మలయపర్వతంమీదనుండి వీచే మెల్లని చల్లగాలి;

తోడుగాన్= వెంట రాగా; సాయపడగా; చనుదెంచి= వచ్చి; హిమవత్, పర్వత, ప్రదేశంబునన్= హిమవత్పర్వతప్రాంతంలో; తపంబు, చేయుచున్న= తపస్సు చేస్తూఉన్న; విశ్వామిత్రు= విశ్వామిత్రుడియొక్క; తపోవనంబు= తపస్సుకొరకైన అరణ్యాన్ని; చొత్తెంచినన్= ప్రవేశించగా.

తాత్పర్యం: 'అయినప్పటికి నేను నేర్చిన విధంగా (నాశక్తికొలది) ఆ మునిశ్రేష్ఠుని మనస్సును తిన్నగా మన్మథుడికి స్వాధీనమయ్యేటట్లుచేస్తాను'- అని చెప్పి దేవేంద్రుడిని వీడ్కొని మేనక చల్లని పిల్లగాలి వెంటరాగా బయలుదేరి వెళ్ళి హిమవత్పర్వతప్రాంతంలో తపస్సు చేసికొంటూ ఉన్న విశ్వామిత్రుడి తపోవనంలో ప్రవేశించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. చల్లని దక్షిణ మారుత ।
మల్లన వీతెంచెఁ దగిలి యా లలనా ధ
మ్మిల్ల కుసుమాంగరాగస ।
ముల్లసనసుగంధి యగుచు మునివరుమీఁదన్. 33

ప్రతిపదార్థం: చల్లని, దక్షిణ, మారుతము= చల్లగా ఉండే మలయమారుతం; అల్లనన్= మెల్లగా; ఆ, లలనా, ధమ్మిల్ల, కుసుమ+అంగరాగ, సముల్లసన, సుగంధి, అగుచున్= ఆ వనిత (మేనక) యొక్క కొప్పులోని పూలవలనను, మైపూత వలనను అతిశయించిన మంచివాసన కలది ఔతూ; మునివరుమీఁదన్= మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడిమీద; తగిలి= విడువకుండా; వీతెంచెన్= ప్రసరించింది.

తాత్పర్యం: దక్షిణదిక్కునుండి వీచే చల్లని మలయానిలం ఆ మేనక కొప్పులోని పూలవాసనలచేతను, ఆమెమైపూతల సుగంధాలచేతను అమితంగా పరిమళిస్తూ ఆ మునిశ్రేష్ఠు డైన విశ్వామిత్రుడి మేనిపై విడువకుండా వీచింది.

విశేషం: పద్యంలోని ద్విరుక్త లకారప్రాస గాలి మెల్లగా వీచే లక్షణాన్ని అక్షరరమ్యంగా సూచిస్తున్నది. 'మునివర' లోని 'వర' శబ్దం మేనక ఇష్టసిద్ధిని స్ఫురింపజేస్తున్నది.

వ. అంత. **34**

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: ఆపైన (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. అనిమిషకాంతయున్ నవలతాంత విభూషణ లీల నల్లన
ల్లన వనకేళి లాలస విలాసగతిం జనుదెంచి ముందటం
గనియె మహామునిప్రవరుఁ గౌశికుఁ గౌశిక చిత్తభీతి సం
జనన మహాతపశ్చరణ సంయతచిత్తు నిరస్తచిత్తజున్. **35**

ప్రతిపదార్థం: అనిమిషకాంతయున్= దేవవనిత ఐన మేనకయు; నవ, లతాంత, విభూషణ, లీలన్= క్రొత్తవైన పూల అలంకారాల విలాసంతో; అల్లనన్+అల్లనన్= మెల్లమెల్లగా; వనకేళి, లాలస, విలాస, గతిన్= వనంలో విహరించే కోరికతో నైన కులుకునడకతో; చనుదెంచి= వచ్చి; ముందటన్= ఎట్టయెదుట; మహత్+ముని, ప్రవరున్= గొప్పమునులలో శ్రేష్ఠుడిని; కౌశిక, చిత్త, భీతి, సంజనన, మహత్+తపస్+చరణ, సంయత, చిత్తున్= ఇంద్రుడి మనస్సులో భయం పుట్టించే గొప్పదైన తపస్సు చేయటంలో నియతిగల మనస్సు కలవాడిని; నిరస్త, చిత్తజున్= తిరస్కరింపబడిన మన్మథుడిని కలిగినవాడిని; కౌశికున్= కుశికవంశానికి చెందిన విశ్వామిత్రుడిని; కనియెన్= చూచింది.

తాత్పర్యం: దేవకాంత అయిన మేనక క్రొత్తవైన పూల అలంకారాల విలాసంతో, మెల్లమెల్లగా వనంలో విహరించే కోరికతో కులుకుతూ నడుస్తూ వచ్చి తనముందట మహామునులలో శ్రేష్ఠుడూ, ఇంద్రుడిమనస్సులో భయంపుట్టించే గొప్పతపస్సు చేయటంలో నియతమైన మనస్సు కలవాడూ, మన్మథభావాన్ని జయించినవాడూ అయిన విశ్వామిత్రుడిని చూచింది.

విశేషం: రెప్పపాటు లేకుండా విశ్వామిత్రుడిని చూడటంవలన మేనకకు అనిమిషత్వం సార్థక మైన దని చమత్కారం. కౌశిక శబ్దాన్ని విశ్వామిత్రపరంగానూ, ఇంద్రపరంగానూ వాడటం విశేషం.

క. అంబుజలోచన గని విన।
యంబున నమ్మునికి మ్రొక్కి యనురాగముతో
డం బుష్పాపచయ వ్యా।
జంబున విహరించుచుండె సఖులుం దానున్. **36**

ప్రతిపదార్థం: అంబుజలోచన= పద్మాలవంటి కన్నులు గల మేనక; కని= విశ్వామిత్రుడిని చూచి; ఆ+మునికిన్; వినయంబునన్= అణకువతో; మ్రొక్కి= నమస్కరించి; అనురాగముతోడన్= ప్రీతితో; పుష్ప+అపచయ, వ్యాజంబునన్= పూలుకోసికొనటం అనే నెపంతో; సఖులున్, తానున్= చెలికత్తెలూ తానూ కలసి; విహరించుచున్+ఉండెన్= విహారం చేస్తూ ఉన్నది.

తాత్పర్యం: పద్మనేత్ర అయిన మేనక వినయంతో విశ్వామిత్రుడికి నమస్కరించి, ప్రీతితో పూలుకోసే నెపంతో చెలికత్తెలతో కలసి తానూ విహరిస్తూ ఉన్నది.

విశేషం: అంబుజలోచన అని వర్ణించటంలోనూ, బిందుపూర్వక సరళాక్షర ప్రాసలోనూ, నాదాక్షరాల, బిందుపూర్వక వర్ణాలప్రయోగంలోనూ నన్నయ అక్షరరమ్యంగా అనురాగభావాన్ని ధ్వనింపజేశాడు.

చ. అలసత యొప్పఁగాఁ దరుణి యమ్మునివల్లభుమ్రోల నున్న స
మ్మిళిత సుగంధబంధురసమీరవశంబునఁ దూలి బాల పై
వలు వెడలన్ బయల్పడియె వల్గకుచంబులుఁ గక్షయుగ్మమున్
లలితకృశోదరంబుఁ దరళత్రివళీయుత రోమరాజియున్. **37**

ప్రతిపదార్థం: తరుణి= యువతి(మేనక); అలసత, ఒప్పంగాన్= అలసభావం తోపగా; ఆ+ముని, వల్లభు, మ్రోలన్= ఆ ఋషిశ్రేష్ఠుడి (విశ్వామిత్రుని) ముందట; ఉన్నన్= ఉండగా; సంమిళిత, సుగంధ, బంధుర, సమీర, వశంబునన్= మిళితమైన మంచి వాసనగల ఒప్పిదమైన గాలివలన; బాల, పైవలువ= కోమలి పైపైట; తూలి= ఒరిగి; ఎడలన్= తొలగిపోగా; వల్ద, కుచంబులున్= పెద్దవైన చన్నులున్నూ; కక్ష, యుగ్మమున్= బాహుమూలల (చంకల) జంటయున్నూ; లలిత, కృశ+ఉదరంబున్= కోమలమైన సన్నని పొట్టయున్నూ (నడుమున్నూ); తరళ, త్రి, వళీయుత, రోమ, రాజియున్= మెరుస్తున్న కడుపుమీది మూడుమడతలతో కూడిన నూగారున్నూ; బయల్, పడియెన్= బయటపడినవి.

తాత్పర్యం: మేనక అలసభావం తోపగా ఆ ఋషిశ్రేష్ఠుడి ముందట ఉండగా, మంచివాసనతో కూడికొన్న గాలివలన కోమలి పైట ఒరిగి తొలగిపోయింది. అప్పుడు ఆమె పెద్దవైన వక్షోజాలూ, కోమలమైన సన్నని నడుమూ, మెరిసే కడుపుమీది మూడు మడతలతోకూడిన నూగారూ బయటపడ్డాయి.

విశేషం: మేనక శరీరాంగ సౌందర్యాన్ని వర్ణించే ఈపద్యరచనలో మాధుర్య మనే శబ్దగుణం పోషించి నన్నయ ఔచిత్యాన్ని పాటించాడు. ఆమె పైటను తొలగించిన గాలిని వర్ణించిన సమాసం మిగిలినవాటికంటె పొడుగ్గా ఉండటం శిల్పసుందరం. పైట తొలగినప్పుడు స్త్రీశరీరంలో కనపడే మన్మథస్థానాలను మాత్రమే వర్ణించటం రసవిభావస్ఫూర్తికి ఉద్దీపకం. అంతఃస్థాలను, అనునాసికాలను, బిందుపూర్వకవర్ణాలను వాడి మేనక సౌందర్యమాధుర్యాన్ని అక్షరరమ్యంగా నన్నయ అభివర్ణించాడు.

క. **అందుఁ దనదృష్టి నాటుడుఁ।**
గందర్ప నిశాత సాయకంబులు పెలుచన్
డెందముఁ గాఁడిన ధృతి సెడి।
కంది మునీంద్రుండు దానిఁ గవయం దివిరెన్. **38**

ప్రతిపదార్థం: ముని+ఇంద్రుండు= మునిశ్రేష్ఠుడు, విశ్వామిత్రుడు; అందున్= పైట తొలగిన ఆమె అందంలో; తనదృష్టి= తనయొక్క చూపు; నాటుడున్= తగులుకొనగా; కందర్ప, నిశాత, సాయకంబులు= మన్మథుని వాడియైన బాణాలు; పెలుచన్= అధికంగా; డెందమున్= హృదయాన్ని; కాఁడినన్= నాటగా; ధృతి+చెడి= నిబ్బరాన్ని (నిగ్రహాన్ని); కోల్పోయి; కంది= (విరహంచేత) తపించి; దానిన్= ఆమెను (మేనకను); కవయన్, తివిరెన్= కూడటానికి పూనుకొన్నాడు.

తాత్పర్యం: విశ్వామిత్రుడు తనదృష్టి పైట తొలగిన మేనకమేనిసౌందర్యంలో చిక్కుకోవటంచేత, మన్మథుడు వేసిన వాడిబాణాలు మిక్కుటంగా తనహృదయంలో నాటగా, నిగ్రహాన్ని కోల్పోయి వలపుతాపంతో మేనకపొందుకొరకు పూనుకొన్నాడు.

వ. **మేనకయు విశ్వామిత్రు నిష్టంబునకుం దగిన కామోపభోగంబులం బెద్దకాలంబు రమియించిన నయ్యిద్దఱకు నిక్కన్యక పుట్టిన, దీని మాలిని యను నొక్కయేటి పులినతలంబునం బెట్టి మేనక దేవలోకంబునకుం జనియె; విశ్వామిత్రుండును దపోవనంబునకుం జనియె; నంత నమ్ముని ప్రభావంబున.** **39**

ప్రతిపదార్థం: మేనకయున్= మేనకకూడ; విశ్వామిత్రు+ఇష్టంబునకున్= విశ్వామిత్రుడి యొక్క కోర్కెకు; తగిన= ఉచితమైన; కామ+ఉపభోగంబులన్= మన్మథక్రీడలచేత; పెద్దకాలంబు= చాలకాలం; రమియించినన్= క్రీడించగా; ఆ+ఇద్దఱకున్= ఆ ఇరువురికి; ఈ+కన్యక= ఈ ఆడపిల్ల(శకుంతల); పుట్టినన్= పుట్టగా; దీనిన్= దీనిని (ఈశిశువును); మాలిని, అను+ఒక్క, యేటి, పులిన, తలంబునన్, పెట్టి= మాలిని అనే పేరు గల ఒక నదియొక్క ఇసుకతిన్నెపై ఉంచి; మేనక; దేవలోకంబునకున్= స్వర్గానికి; చనియెన్= వెళ్లింది; విశ్వామిత్రుండును; తపస్+వనంబునకున్= తపస్సు చేసికొనే

అడవికి; చనియెన్= వెళ్ళాడు; అంతన్= ఆ మీద; ఆ+ముని, ప్రభావంబునన్= ఆ విశ్వామిత్రఋషి యొక్క మహిమవలన.

తాత్పర్యం: మేనకకూడా విశ్వామిత్రుడి కోర్కెకు తగినట్లు మన్మథక్రీడలతో భోగించగా వారిద్దరికి ఈకన్యపుట్టింది. మేనక ఈ బిడ్డను మాలినీనదీతీరాన ఒక ఇసుకతిన్నెమీద ఉంచి తాను దేవలోకానికి వెళ్ళిపోయింది. ఆ విశ్వామిత్రుడుకూడా తపోవనానికి వెళ్ళాడు. ఆ తరువాత ఆ మునిప్రభావంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మూలభారతంలో శకుంతలను (శిశువుగా ఉన్నప్పుడు) పక్షులు తమకు తాము రక్షించినట్లు ఉండగా, నన్నయ ఆ రక్షణం మునిప్రభావంవలన కలిగిం దని అమూలకమైన హేతువును చూపించాడు. మునిమహిమను ప్రకటించే ఈ కల్పన సందర్భోచితం.

ఆ. చెలఁగి లేవ నేడ్చు చిఱుతుకదానిఁ గ్ర ।
వ్యాదఘోరమృగము లశనబుద్ధిఁ
బట్టకుండఁ జెట్టుపలఁ గప్పి రక్షించు ।
కొని శకుంతతతులు గూడియుండె. 40

ప్రతిపదార్థం: చెలఁగి= పూని, ప్రయత్నించి; లేవన్= లేవటానికై; ఏడ్చు= ఏడ్చే; చిఱుతుకదానిన్= చిట్టిపాప అయినదానిని; క్రవ్యాద, ఘోర, మృగములు= రాక్షసులూ, క్రూరమృగాలూ; అశన, బుద్ధిన్= తినాలనే కోర్కెతో; పట్టకుండన్= నోటకరవకుండ; చెట్టుపలన్= రెక్కలను; కప్పి= కమ్మి; రక్షించుకొని= కావాలని ఆప్యాయంగా కాపాడి; శకుంత, తతులు= పక్షులగుంపులు; కూడి, ఉండెన్= గుంపుగా కలసిఉన్నాయి.

తాత్పర్యం: చిట్టిపాపగా ఉన్న పసిగందు పైకిలేవటానికి చేతకాక ఏడుస్తూ ఉంటే ఆ అరుపు విని రాక్షసులూ, క్రూరమృగాలూ తినాలనే కోర్కెతో

నోటకరచుకొనిపోకుండా పక్షులగుంపులు తమ రెక్కలతో ఆబిడ్డను రక్షించుకొంటూ గుమికూడిఉన్నాయి.

విశేషం: 'రక్షించుకొని' అనే ఆత్మనేపదార్థ క్రియతో పక్షు లా బాలపై ప్రదర్శించిన వాత్సల్యాతిశయాన్ని నన్నయ సూచించాడు.

వ. అంత నేము శిష్యగణంబులతోడ సమిత్కుసుమ ఫలాహరణార్థం బక్కడకుం జని, యమ్మాలినీ పులినతలంబున శకుంతరక్షిత యై యున్న కూఁతు నత్యంతకాంతిమతి నవనీతలంబున కవతరించిన తరుణ శశిరేఖ యుంబోని దాని నెత్తుకొని వచ్చి, శకుంతరక్షిత యగుటఁ జేసి శకుంతల యను నామం బిడి కరంబు గారవంబునం బెనిచితిమి. 41

ప్రతిపదార్థం: అంతన్= ఆ సమయంలో; ఏము= మేము (ఏను అనిచెప్పే గౌరవ బహువచనం ఏము); శిష్యగణంబులతోడన్= శిష్యుల సమూహాలతో; సమిత్, కుసుమ, ఫల+ఆహరణ+అర్థంబు= సమిధలు, పూలు, పండ్లు, తేవటానికై; ఆ+కడకున్= ఆ ప్రదేశానికి; చని= వెళ్ళి; ఆ+మాలినీపులినతలం బునన్= ఆ మాలిని అనే పేరుగల నదియొక్క ఇసుకతిన్నె పై ; శకుంత, రక్షిత+ఐ= పక్షులచేత రక్షింపబడినది ఐ; ఉన్న; కూఁతున్= ఆ ఆడుశిశువును; అత్యంత, కాంతి, మతిన్= అపారమైన వెలుగుతోకూడిఉన్నదానిని; అవనీ, తలంబునకున్+అవతరించిన= నేలమీదికి దిగివచ్చిన; తరుణ, శశిరేఖయున్+ పోని దానిన్= క్రొత్తదైన చంద్రకళను పోలిఉన్నదాన్ని; ఎత్తుకొని, వచ్చి= తీసికొని వచ్చి; శకుంత, రక్షిత, అగుటన్, చేసి= పక్షులచేత కాపాడబడినది కావటం చేత; శకుంతల, అను, నామంబు+ఇడి= శకుంతల అనే పేరుపెట్టి; కరంబు= మిక్కిలి; గారవంబునన్= మమకారంతో, ముద్దుగా; పెనిచితిమి= పెంచాము.

తాత్పర్యం: ఆ సమయంలో మేము శిష్యగణాలతో సమిధలు, పూలు, పండ్లు తెచ్చు కొనటానికి అక్కడికి వెళ్ళాము. మాలినీ నదీతీరంలోని ఒక

ఇసుకతిన్నెమీద పక్షులచేత రక్షింపబడియున్న ఈ అమ్మాయి మిక్కిలి కాంతితో ప్రకాశిస్తూ నేలమీదకు దిగివచ్చిన క్రొత్తచంద్రరేఖవలె ఉండగా ఎత్తుకొని వచ్చాము. శకుంతాలచేత రక్షింపబడింది కాబట్టి ఆ బాలకు శకుంతల అనే పేరుపెట్టి కడు గారాబంగా పెంచాము.

మధురాక్కర.

తనర జనకుండు నన్నప్రదాతయును భయత్రాత
యును ననఁగ నింతులకు ముప్వు రొగిన గురువులు; వీర
లనఘ! యుపనేత మఱియు నిరంతరాధ్యాపకుండు
ననఁగఁ బురుషున కియ్యేవు రనయంబును గురువులు. 42

ప్రతిపదార్థం: తనరన్= ఒప్పారగా; జనకుండున్= జన్మ నిచ్చిన తండ్రియున్నూ; అన్న, ప్రదాతయును= అన్నంపెట్టి పోషించి ప్రాణం నిలిపిన అన్నదాతయున్నూ; భయ, త్రాతయున్= భయంనుండి కాపాడేవాడున్నూ; అనఁగన్= అని; ఇంతులకున్= స్త్రీలకు; ఒగిన= వరుసగా; వీరలు= వీళ్ళు (పైనపేర్కొన్నవారు); ముప్వురున్= ముగ్గురూ; గురువులు= తండ్రులు; అనఘ!= ఓ పాపరహితుడవైన మునీ!; పురుషునకున్= మగవాడికి; మఱియున్= పైముగ్గురేకాక ఇంకను; ఉపనేత= ఉపనయనం చేసినవాడూ; నిరంతర+అధ్యాపకుండున్= ఎల్లప్పుడు వేదాలను పాఠంగాచెప్పేవాడూ; ఈ+ఏవురున్= మొత్తం ఈ అయిదుగురు; అనయంబును= ఎల్లప్పుడూ; గురువులు= తండ్రులు.

తాత్పర్యం: స్త్రీలకు తండ్రులుగా కన్నవాడినీ, అన్నం పెట్టినవాడినీ, భయంనుండి రక్షించినవాడినీ మొత్తం వరుసగా ముగ్గురిని చెప్పుతారు; ఓ పుణ్యాత్ముడవైన మహర్షీ! పురుషులకు ఈ ముగ్గురేకాక ఉపనయనం చేసినవాడినీ, వేదాలు చెప్పినవాడినీ కలిపి మొత్తం అయిదుగురిని ఎల్లప్పుడూ తండ్రులుగా పరిగణిస్తారు.

విశేషం: మూలంలో - 'శరీరకృత్, ప్రాణదాతా, యస్య చాన్నాని భుంజతే' । క్రమేణైతే త్రయోఽప్యుక్తాః పితరో ధర్మదర్శనే'' - అని స్త్రీలకు గురువులు ముగ్గురే అని చెప్పబడి ఉండగా నన్నయ పురుషులకు అయిదుగురు గురువు లని విశేషించి పేర్కొన్నాడు. మధురాక్కర చరణంలో క్రమంగా 1 సూర్యగణం, 3 ఇంద్రగణాలు, 1 చంద్రగణం ఉంటాయి. నాల్గవగణం మొదటి అక్షరంతో యతి మైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. 'అనం బరఁగిన శాస్త్రార్థంబున నేము దీనికి భయత్రాతల మగుటంజేసి గురుల; మిదియును మాచే నభివర్ధిత యగుటం జేసి మాకు హృదయానందని యైన కూఁతు' రని కణ్వమహాముని లమ్మునికిం జెప్పిన విధం బంతయు సవిస్తరంబుగా శకుంతల చెప్పిన విని దుష్యంతుం డాత్మగతంబున. 43

ప్రతిపదార్థం: అనన్+పరఁగిన= ఈ విధంగా లోకప్రసిద్ధిచెందిన; శాస్త్ర+అర్థంబునన్= శాస్త్రప్రమాణంచేత; ఏము= మేము (కణ్వుడు); దీనికిన్= శకుంతలకు; భయత్రాతలము+ అగుటన్+చేసి= భయాన్ని తొలగించినవారం కావటంచేత; గురులము= తండ్రులం (బహువచనం ఆత్మగౌరవ సూచకం); ఇదియును= ఈ శకుంతలకూడా; మాచే, అభివర్ధిత, అగుటన్+చేసి= మాచేత పెంచబడింది కాబట్టి; మాకున్, హృదయ+ ఆనందని+ఐన, కూఁతురు= మాకు మనసుకు ఆనందాన్ని కలిగించే కూతురు; అని= ఈవిధంగా; కణ్వమహత్+మునులు; ఆ+మునికిన్; చెప్పిన, విధంబు+ అంతయున్; సవిస్తరంబుగాన్= వివరంగా; శకుంతల; చెప్పినన్; విని; దుష్యంతుండు; ఆత్మ గతంబునన్= తనలో తాను స్వగతంగా (రాబోయే పద్యంలోవలె అనుకొన్నాడు).

తాత్పర్యం: 'ప్రసిద్ధ మైన ఈ శాస్త్రప్రమాణంచేత మేము శకుంతలకు భయత్రాతలం కావటంచేత గురువులం. ఈమెకూడా మాచేత పెంచబడి ఉండటంచేత మాకు మనసు కెక్కిన కూతురు' - అని కణ్వమహాముని ఆ

మునికి చెప్పిన విధమంతా వివరంగా శకుంతల చెప్పగా విని దుష్యంతుడు తనలోతాను - (ఈవిధంగా అనుకొన్నాడు). (తరువాతి పద్యంతో అన్వయం.)

దుష్యంతుండు శకుంతలను వివాహంబు సేసికొనఁ గోరుట (సం. 1-67-1)

చ. ఇది మునినాథ కన్య యని యెంతయు నిఃస్పృహవృత్తి నున్ననా
హృదయము రాజపుత్త్రి నని యిక్కమలాక్షి నిజాభిజాత్య సం
పద నెఱిఁగించినన్ మదనబాణపరంపర కిప్పు డుండ నా
స్పద మయి సంచలించె నళిపాత వికంపిత పంకజాకృతిన్. 44

ప్రతిపదార్థం: ఇది= ఆమె (శకుంతల); మునినాథ, కన్య, అని= మునిశ్రేష్ఠుడి కూతు రని; ఎంతయున్= మిక్కిలి; నిస్+స్పృహవృత్తిన్= నిరాశతో; ఉన్న; నా హృదయము= (దుష్యంతుడి మనస్సు); ఈ+కమల+అక్షి= పద్మాలవంటి కన్నులుకల ఈ శకుంతల; రాజపుత్త్రిన్, అని= క్షత్రియుడి కూతురను అని; నిజ+ఆభిజాత్య, సంపదన్= తనయొక్క వంశవైభవాన్ని; ఎఱిఁగించినన్= తెలుపగా; ఇప్పుడు; మదన, బాణ, పరంపరకున్= మన్మథునియొక్క బాణాల వరుసకు; ఉండన్, ఆస్పదము+అయి= నెలవై, వశమై; అళిపాత, వికంపిత, పంకజ+ఆకృతిన్= తుమ్మెదలు వాలటంచేత చలించినపద్మంవలె; సంచలించెన్= కంపించింది.

తాత్పర్యం: శకుంతల మునికన్య యేమో అని మిక్కిలి నిరాశతో ఉన్న నా హృదయం ఈ పద్మాక్షి తాను రాజపుత్త్రినని తన వంశౌన్నత్యాన్ని తెలపటంచేత మన్మథ బాణపరంపరకు వశమై తుమ్మెదలు వాలటంచేత కంపించిన పద్మంవలె చలించింది. (అని దుష్యంతుడు తనలో అనుకొన్నాడు).

విశేషం: అలం: ఉపమ. "ఇది మునికన్యయేని"..... అనే పద్యం, "ఇది మునినాథ కన్యయని"...... అన్న ఈ పద్యం - ఈ రెండున్నూ నన్నయ ఈకథకు పెట్టిన రెండు వన్నెలు. దుష్యంతుడి ఉత్తమచిత్తవృతికి ఉదాహరణలు. కాళిదాసుడి అభిజ్ఞానశాకుంతల నాటకంలోని "భవ హృదయ సాభిలాషం సంప్రతి సందేహ

నిర్ణయోజాతః" ఇత్యాది వాక్యాలు ఈ కథాసంవిధాన కల్పనలో నన్నయకు తోడ్పడి ఉంటాయి. "సతాం హి సందేహ పదేషు వస్తుషు ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః" అనే శ్లోకతాత్పర్యాన్ని ఈపద్యభావం ధ్వనింపచేస్తున్నది. దశవిధ మన్మథావస్థలలో మూడవదైన సంకల్పం ఇందులో సూచింపబడుతున్నది. పై రెండు పద్యాలూ చంపకమాలలే. అంటే వృత్తైక్యం పాటింపబడిందన్నమాట. రెండుపద్యాల ఎత్తుగడలూ సమానమే. ఇటువంటి వృత్త, గతిసామ్యాలు ఛందశ్శిల్పసంబంధి విశేషాలు. ఇవికూడా వస్తురస భావాలను ధ్వనింపజేస్తాయి. మొదటిపద్యంలో నాయకుడి హృదయంలో ఏర్పడిన శంక రెండవపద్యంలో నివృత్త మై రతిభావదీప్తికి ఏర్పడిన అడ్డంకి తొలగి రసస్థితికి చేరే వికాసం ఏర్పడింది. అందువలన ఈరెండుపద్యాలు నాయకగతమైన స్థాయి పోషణలో రెండు బలమైన బిందువులు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగా రీ పద్యద్వయ సన్నివేశ ప్రాశస్త్యాన్ని ఇట్లా పేర్కొన్నారు- "రెండుస్వగతములును సదృశతమము లైన చంపకము లందే నిబంధింపబడినవి. మొదటిదానియందుఁ దునిఁగిపోవచ్చిన దుష్యంతునిరతి రెండవదానియం దతుకుకొని కొసలు సాగినది. శకుంతలా దుష్యంతుల ప్రణయకలాపమున కడ్డుగా జొచ్చుకొనివచ్చిన మేనకావిశ్వామిత్రుల శృంగారవృత్తాంతమున కుభయకూలములందును నిల్చి యీ రెండుపద్యములు అవాంతర కథాప్రవాహసేతు నిబంధన ప్రయోజకములగు రెండు మహాస్తంభములవలె నున్నవి. ఇది ఛందస్సాధనముచే సాధింపబడిన కథాశిల్పము" (నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి - పు. 162)

వ. అనుచు మదనాతురుం డయి దుష్యంతుండు దనయం దక్కోమలి యనురాగం బుపలక్షించి యి ట్లనియె. 45

ప్రతిపదార్థం: అనుచున్= అని తనలో తాను అనుకొంటూ; మదన+ఆతురుండు+ అయి= మన్మథుడిచేత బాధింపబడినవాడై (కోరికను ఆపుకోలేనివాడై); దుష్యంతుండు; తనయందున్; ఆ+కోమలి, యనురాగంబు+ ఉపలక్షించి= ఆ శకుంతలయొక్క ప్రీతిని గమనించి); ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ విధంగా తనలో తాను అనుకొంటూ మనసులో మన్మథపరమైన భావాలు ఒత్తిడిచేయగా శకుంతల తనపై వలపుగొన్నట్లు గమనించి దుష్యంతుడు ఈవిధంగా పలికాడు.

క. ఈ వల్కలాజినములకు ।
నీ వన్యఫలాశనముల కీ విటపకుటీ
రావాసములకు నుచితమె ।
నీ విలసిత రూపకాంతి నిర్మలగుణముల్. 46

ప్రతిపదార్థం: నీ, విలసిత, రూప, కాంతి, నిర్మల, గుణముల్= నీ (శకుంతల) యొక్క(ప్రకాశితాలైన) అందమైన ఆకారము, దాని కాంతి, మచ్చలేని గుణాలు (అనేవి); ఈ వల్కల+అజినములకున్= ఈ నారచీరలకున్నూ; ఈ, వన్యఫల+ అశనము లకున్= ఈ అడవికి సంబంధించిన పండ్ల ఆహారాలకూ; ఈ, విటప, కుటీర+ ఆవాసములకున్= ఈ పర్ణశాల నివాసాలకూ; ఉచితమె?= యోగ్యమైనదా? కాదని భావం.

తాత్పర్యం: నీ అందమైనరూపం, నీ మేనిప్రకాశం మచ్చలేని నీగుణాలు అనేవి ఈ నారచీరలు కట్టటానికీ, అడవిపండ్లు తింటూ ఉండటానికీ, ఈ ఆకుటిండ్లలో (పర్ణశాలలలో) నివసించటానికీ తగినవి కావు.

విశేషం: అందమైన రూపం నారచీరలు కట్టటం ఉచితం కాదు; మేనికాంతి అడవిపండ్లు తినటంవలన వాడిపోతుంది కాబట్టి అనుచితం. నిర్మలగుణాలు గల ఆమె మణులు పొదిగిన గృహాలలో ఉండదగింది కాబట్టి ఆశ్రమాలలో ఉండటం ఉచితం కాదని భావం. తన అభిలాషకు అనుకూలంగా ఆమెఅందం ఆశ్రమజీవితానికి అనుకూలం కాదని ప్రబోధించాడు (ప్రశంసించాడు) దుష్యంతుడు.

ఉ. ఈ మునిపల్లె నుండు టిది యేల కరం బనురాగ మొప్పఁగా
భామిని! నాకు భార్య వయి భాసురలీల నశేషరాజ్య ల

క్ష్మీ మహనీయ సౌఖ్యముల మేలుగ నందు మనిందితేందుపా
దామలతుంగహర్మ్యముల హారిహిరణ్మయ కుట్టిమంబులన్. 47

ప్రతిపదార్థం: భామిని!= ఓ శకుంతలా!; ఈ, ముని, పల్లెన్= ఈ మునులయొక్క పల్లెలో; ఉండుట. ఇది ఏల?= ఈవిధంగా ఉండటం ఎందుకు?; కరంబు= మిక్కిలి; అనురాగము, ఒప్పఁగాన్= వలపు అందగించగా; నాకున్= (దుష్యంతునికి); భార్యవు+ అయి= ఇల్లాలివై; భాసుర, లీలన్= ప్రకాశించే వైభవంతో; అశేష. రాజ్య, లక్ష్మీ, మహనీయ, సౌఖ్యములన్= అపారమైన రాజ్యసంపదవలని గొప్పవైన సుఖాలనూ; అనిందిత+ఇందు, పాద+అమల, తుంగ, హర్మ్యములన్= మచ్చలేని చంద్రకిరణాలవలె తెల్లని ఎత్తైన మేడలయొక్క; హారి, హిరణ్మయ, కుట్టిమంబులన్= అందమైన బంగారపు కట్టడాల పైభాగాలలో, మేలుగన్= ఇంపుగా, శుభంగా; అందుము= అందుకొమ్ము, అనుభవింపుము.

తాత్పర్యం: ఓ శకుంతలా! ముని లుండే ఈపల్లెలో ఈవిధంగా ఉండటం ఎందుకు? మిక్కిలివలపు అందగించగా నాకు భార్యవు కమ్ము; ప్రకాశించే వైభవంతో అపారమైన రాజ్యసంపదవలన కలిగే సుఖాలను, మచ్చలేని చంద్రకిరణాలవలె తెల్లగానుండే ఎత్తైనమేడలలో అందమైన బంగారు కట్టడాల పైభాగాలలో మేలుగా అనుభవించుము.

విశేషం: పద్యం చిన్నచిన్న పదాలతో మొదలై సమాసాలతో ముగుస్తున్నట్లు సాగిన రచన శకుంతల అప్పటి దైన్యస్థితి నుండి పెండ్లి అయిన తరువాత క్రమంగా పొందే ఉన్నతస్థితిని స్ఫురింపచేస్తున్నట్లు దుష్యంతుడు పలికిన పద్ధతిని నన్నయ స్ఫురింపచేశాడు.

సీ. 'బ్రాహ్మంబు దైవంబుఁ బరఁగ నార్షంబుఁ బ్రా ।
జాపత్యమును రాక్షసంబు నాసు
రంబు గాంధర్వంబు రమణఁ బైశాచంబు ।
నను నెనిమిది వివాహముల యందుఁ

గడుఁ బ్రశస్తములు సత్క్షత్ర వంశ్యులకు గాం ।
ధర్వ రాక్షసములు ధర్మయుక్తిఁ;
నీకును నాకును నెమ్మిఁ బరస్పర ।
ప్రేమంబు గాముండు పెంపఁదొడఁగెఁ

ఆ. గాన యెడయుఁ జేయఁగా నేల? గాంధర్వ ।
విధి వివాహ మగుట వినవె యుక్త'
మనిన లజ్జఁ జేసి యవనత వదన యై ।
యాలతాంగి యిట్టు లనియెఁ బతికి. 48

ప్రతిపదార్థం: బ్రాహ్మంబు= సదాచారంగల వరుడిని వస్త్రాదులచేత అలంకరించి పూజించి చేసే కన్యాదానం; దైవంబున్= జ్యోతిష్టోమం మొదలైన యజ్ఞాలు ప్రారంభించే టప్పుడు యథావిధిగా ఆ యజ్ఞవిధిని నడిపిన ఋత్విజుడిని అలంకరించి చేసే వివాహం; పరఁగన్= ఒప్పగా; ఆర్షంబున్= ధర్మార్థం వరుడినుండి గోమిథునాన్ని తీసికొని కన్య నిచ్చి యథావిధిగా చేసే వివాహం; ప్రాజాపత్యమును= వరుడిచేత నేను ఇతర ఆశ్రమాలను వేటినీ స్వీకరించకుండ గృహస్థాశ్రమంలోనే ఉండి ధర్మాన్ని ఆచరిస్తాను' అని ప్రతిజ్ఞ చేయించి కన్యాదానం చేయటం; రాక్షసంబున్= కన్యను బలాత్కారంగా తీసికొని వచ్చి చేసికొనే వివాహం; ఆసురంబు= కన్యయొక్క తల్లిదండ్రులకూ, కన్యకూ యథాశక్తిద్రవ్య మిచ్చి యథేచ్ఛగా చేసికొనే వివాహం; గాంధర్వంబు= వధూవరులు పరస్పరం ప్రేమించుకొని చేసికొనే వివాహం; పైశాచంబున్= నిద్రిస్తూ కాని, త్రాగి మైమరచి కాని శీలాన్ని రక్షించుకోవటంలో పరాకుగా ఉన్న వనితను సంభోగేచ్ఛతో రహస్యంగా ఎత్తుకొనిపోయి చేసికొనే వివాహం; అను= అని చెప్పబడే; రమణన్= ఒప్పారు; ఎనిమిది, వివాహముల, అందున్= ఎనిమిది రకాల పెండ్లిండ్లలో; సత్, క్షత్రవంశ్యులకున్= మంచి క్షత్రియ వంశంలో పుట్టినవారికి; గాంధర్వ, రాక్షసములు= గాంధర్వవివాహమున్నూ, రాక్షస వివాహమున్నూ; ధర్మయుక్తిన్= ధర్మంతో కూడికొని ఉండటంచేత;

కడున్, ప్రశస్తములు= ఎంతో మేలైనవి; నీకును, నాకును= నీకూ నాకూ (శకుంతలకూ, దుష్యంతుడికీ); నెమ్మిన్= ప్రీతితో; కాముండు= మన్మథుడు; పరస్పర, ప్రేమంబు= ఒకరిపై మరొకరికి అనురాగాన్ని; పెంపన్+తొడఁగెన్= ఎక్కువ చేస్తున్నాడు; కాన= కాబట్టి; ఎడయున్+చేయఁగాన్+ఏల= ఆలస్యంచేయటం ఎందుకు; గాంధర్వ విధిన్= గాంధర్వవివాహపద్ధతిలో; వివాహము+అగుట= పెండ్లిచేసికొనటం; యుక్తము, వినవె= సమంజసం సుమా!; అనినన్= అని పలుకగా; ఆ, లతాంగి= లత వంటి శరీరంకల ఆ శకుంతల; లజ్జన్, చేసి= సిగ్గుతో; అవనత, వదన, ఐ= వంచిన మొగం కలిగినదై (తలవంచుకొని); పతికిన్= రాజుతో; ఇట్టులు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: 'బ్రాహ్మం, దైవం, ఆర్షం, ప్రాజాపత్యం, రాక్షసం, ఆసురం, గాంధర్వం, పైశాచం - అనే ఎనిమిది రకాలైన వివాహాలలో ఉత్తమక్షత్రియ వంశాలకు చెందినవారికి గాంధర్వ రాక్షసవివాహాలు ధర్మంతోకూడి ఉండటంచేత మేలైనవి. ఇప్పుడు మన్మథుడు నీకూ నాకూ ప్రేమను ప్రీతితో పరస్పరం పెంపొందింపజేస్తున్నాడు కాబట్టి ఆలస్యం చేయట మెందుకు? గాంధర్వవివాహపద్ధతిలో పెండ్లాడటం సమంజసం సుమా!' అని దుష్యంతుడు పలుకగా ఆ శకుంతల సిగ్గుతో తల వంచుకొని రాజుతో ఈవిధంగా అన్నది.

విశేషం: అష్టవిధ వివాహాలలో మొదటి నాలుగున్నూ బ్రాహ్మణులకు ఉచితమైనవి; గాంధర్వరాక్షసవివాహాలు క్షత్రియులకున్నూ, ఆసురం వైశ్యశూద్రులకున్నూ యోగ్యమైనవి. పైశాచికం ఎవ్వరూ అనుసరించతగింది కాదు - అని శాస్త్రాలు చెప్తున్నాయి. భారతదేశ మంతటా మనుస్మృతి ప్రామాణికంగా పరిగణింప బడుతుంది. దాని తరువాత గౌతమ, బోధాయన, ఆపస్తంబాదులు రచించిన ధర్మశాస్త్ర గ్రంథాలు ఆయాకాలాలలో ప్రచారంలోకి వచ్చాయి. భారతదేశంలోని ఆయాప్రాంతాలవారికి, ఆయావర్గాలవారికి అవికూడా ప్రామాణికాలుగా ఉన్నాయి. త్రిలింగదేశంలో సామవేదులు గౌతమ ధర్మసూత్రాలనూ, మిగిలినవారు

ఆపస్తంబసూత్రాలనూ అనుసరిస్తారు. కవిత్రయంవారు ముగ్గురూ ఆపస్తంబసూత్రులు, మనుధర్మాలతో ఆపస్తంబధర్మసూత్రాలు ఎడనెడ భేదిస్తాయి. ఆసందర్భాలలో నన్నయ మనుధర్మశాస్త్రాంశాలను అనుసరించి, ఆపస్తంబసూత్రాలు భేదించేఅంశాలను ప్రత్యేకించి పేర్కొనకుండా వదలటం గమనింపదగిన విషయం. రాజరాజనరేంద్రుడు 'మనుమార్గ' వర్తనుడు కావటం, వ్యాసనిబద్ధమహాభార తార్థానికి విరుద్ధం కాకుండా రచింపవలె నని ఆయన కోరటం దానికి కారణం కావచ్చు, దీనికి ఉదాహరణంగా అష్టవిధవివాహాల ప్రశంసను పేర్కొనవచ్చు. మనువు అష్టవిధవివాహాలు చెప్పాడు. వాటిలో ఆసురపైశాచాలు సర్వదా నిందించదగినవిగా పేర్కొన్నాడు. (మనుస్మృతి - 3- 21, 25). ఆపస్తంబుడు కేవలం ఆరింటినే చెప్పాడు. అవి - బ్రాహ్మ, దైవ, ఆర్ష, గాంధర్వ, ఆసుర, రాక్షసాలు. ఆపస్తంబుడు ప్రాజాపత్య, పైశాచాలను వదిలాడు. నన్నయ ఆపస్తంబసూత్రు డైనా అష్టవిధవివాహాలను పేర్కొన్నాడు. అయితే నింద్యాలను గురించి మాటాడలేదు. కథలో అవసరం లేదు కాబట్టి వదలి ఉండవచ్చును.

తిక్కన ఆనుశాసనిక పర్వంలో (2-226) బ్రాహ్మ, క్షాత్ర, గాంధర్వ, రాక్షస, ఆసుర వివాహాలను అయిదింటిని పేర్కొన్నాడు. ఇందులో క్షాత్రం క్రొత్తది. ఒకరినొకరు వలచినా రని తెలిసికొని పెద్దలు వధూవరులకు చేసే వివాహం క్షాత్రం. ఇది సంస్కృత భారతంలోనే ప్రస్తావించబడి ఉన్నది (సం.మ.భా. ఆను.44.9) దాన్ని తిక్కన యథాతథంగా గ్రహించాడు. అయితే, రాక్షస ఆసుర వివాహాలు ధర్మదూషితా లని పేర్కొన్నాడు. వివిధ ధర్మాలలో వాదు ఏర్పడినప్పుడు మనుశాస్త్రమే ప్రమాణ మని భారతం ప్రతిపాదిస్తున్న దని దీనివలన తాత్పర్యం ఏర్పడుతున్నది.

క. కరుణానిరతులు ధర్మ।
స్వరూపు లింతకు మదీయజనకులు సనుదెం
తురు; వారు వచ్చి నీ కి।
చ్చిరేని పాణిగ్రహణము సేయుము నన్నున్. 49

ప్రతిపదార్థం: కరుణా, నిరతులు= దయాపరులున్నూ; ధర్మస్వరూపులు= ధర్మమేరూపముతాల్చినవారున్నూ; (అయిన); మదీయ, జనకులు= నాతండ్రిగారు; ఇంతకున్= ఇంతలోనే; చనుదెంతురు= వస్తారు; వారు= కణ్వమహర్షి; వచ్చి; నీకున్, ఇచ్చిరి+ఏని= నీకు భార్యగా ఇవ్వటానికి అంగీకరిస్తే; నన్నున్= నన్ను; పాణిగ్రహణము, చేయుము= వివాహము చేసికొమ్ము.

తాత్పర్యం: దయాపరులు, ధర్మమే మూర్తికట్టినవారు అయిన మాతండ్రి కణ్వమహర్షులు ఇంతలోనే వస్తారు. వారు వచ్చి నన్ను నీకు భార్యగా కన్యాదానం చేస్తే నన్ను నీవు పెండ్లాడుము.

క. అనిన దానికి దుష్యంతుం డి ట్లనియె. 50

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అని శకుంతల అనిన దానికి దుష్యంతుడు ఈవిధంగా పలికాడు.

తే. తనకు మఱి తాన చుట్టంబు, తాన తనకు।
గతియుఁ, ద న్నిచ్చుచోఁ దానకర్త యనఁగ
వనజనేత్ర! గాంధర్వవివాహ మతి ర।
హస్యమును నమంత్రకమును నగుచు నొప్పు. 51

ప్రతిపదార్థం: వనజనేత్ర= పద్మాలవంటి కన్నులు కలదానా, శకుంతలా!; తనకున్, మఱి, తాను+అ, చుట్టంబు= తనకు చుట్టాలు మరెవ్వరు లేకుండా తానే తనకు చుట్టం కావటం; తాన, తనకున్, గతియున్= తనకు తానే దిక్కుకావటం; తన్నున్ (తనను)+ఇచ్చుచోన్, తాన, కర్త, అనఁగన్= తనను తాను ఇచ్చుకొనేటప్పుడు కన్యాదానం చేసే కర్తకూడా తానే కావటం; అనఁగన్= అని ప్రసిద్ధి చెందిన; గాంధర్వ, వివాహము= గాంధర్వవివాహం; అతి, రహస్యమును= మిక్కిలి గోప్యమున్నూ; అమంత్రకమును= మంత్రతంత్రాలు లేనిదిన్నీ; అగుచున్= ఔతూ; ఒప్పున్= ఒప్పారును.

తాత్పర్యం: ఓ కమలనేత్రా! తనకు తానే చుట్టం కావటం, తనకు తానే దిక్కు కావటం. తనను తాను ఇచ్చుకొంటున్నప్పుడు తానే కర్త కావటం అనే లక్షణాలతో ప్రసిద్ధి చెందిన గాంధర్వవివాహం మిక్కిలి గోప్యంగానూ, మంత్రతంత్రరహితంగానూ ఉంటుంది.

వ. అని దుష్యంతుండు గాంధర్వవివాహస్వరూపంబు చెప్పి శకుంతల నొడంబఱిచిన నది యి ట్లనియె. 52

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; దుష్యంతుండు; గాంధర్వ, వివాహ, స్వరూపంబు= గాంధర్వవివాహం జరిగే పద్ధతి; చెప్పి= తెలిపి; శకుంతలను, ఒడంబఱిచినన్= శకుంతలను ఆ వివాహానికి అంగీకరించేటట్లు చేయగా; అది= ఆ శకుంతల; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నది.

తాత్పర్యం: పైవిధంగా దుష్యంతుడు గాంధర్వ వివాహం ప్రవర్తిల్లే పద్ధతిని చెప్పి శకుంతలను ఒప్పించాడు. అప్పుడామె దుష్యంతుడితో ఈవిధంగా అన్నది.

చ. నరనుత! నీ ప్రసాదమున నా కుదయించిన నందనున్ మహీ
గురుతర యౌవరాజ్యమునకున్ దయతో నభిషిక్తుఁ జేయఁగా
వరము ప్రసన్నబుద్ధి ననవద్యముగా దయసేయు నెమ్మితోఁ;
నిరుపమకీర్తి! యట్లయిన నీకును నాకును సంగమం బగున్. 53

ప్రతిపదార్థం: నరనుత!= ప్రజలచేత కీర్తింపబడినవాడా!; నీ, ప్రసాదమునన్= నీ దయవలన; నాకున్; ఉదయించిన= పుట్టిన; నందనున్= కుమారుడిని; మహీ, గురుతర, యౌవరాజ్యము నకున్= గొప్పదైనభూమికి యౌవరాజ్యపదవియందు; అభిషిక్తున్, చేయఁగాన్= అభిషేకింపబడిన వాడినిగా చేయటానికి; వరము= వరాన్ని; దయతోన్= దయతో; ప్రసన్నబుద్ధిన్= నిండుమనసుతో; అనవద్యముగాన్= ఉదాత్తంగా, తిరుగులేకుండా; నెమ్మితోన్= ప్రీతితో; దయ, చేయు(ము)= ఇమ్ము; నిరుపమకీర్తి= సాటిలేని కీర్తికలవాడా!; అట్లు+అయినన్= నే నడిగినవిధంగా జరిగితే; నీకును, నాకును= నీకున్నూ, నాకున్నూ; సంగమంబు= కలయిక, పెండ్లి; అగున్= అగును.

తాత్పర్యం: కీర్తిమంతుడ వైన దుష్యంతుడా! నీ అనుగ్రహంవలన నాకు పుట్టిన పుత్రునకు నీ విశాలసామ్రాజ్యానికి యౌవరాజ్యపదవిలో అభిషేకం చేసేవరాన్ని దయతోకూడిన నిండుమనసుతో ఉదాత్తంగా ప్రీతితో ఇమ్ము. సాటిలేని కీర్తికలవాడా! ఈవిధంగా అయితే నీకూ నాకూ వివాహ మౌతుంది.

విశేషం: 'నరనుత' అనే పదానికి 'నరవర' అనే పాఠాంతరం ఉన్నది. (నరవర= నరులలో శ్రేష్ఠుడైనవాడా); 'నిరుపమకీర్తి' కి 'నిరుపమదాన' అనే పాఠాంతరం ఉన్నది; 'సాటిలేనిదానం చేసేవాడా!' అనే సంబుద్ధి తా నడిగే వరాన్ని తప్పకుండా ఈయటం అతని దానప్రవృత్తికి తగిన దనే భావం శకుంతల ప్రకటించిందనే అర్థం స్ఫురిస్తుంది. శకుంతల తల్లిదండ్రులవలన తనకు కలిగిన అన్యాయం తన సంతతికి జరుగకూడ దని ముందే జాగ్రత్తపడి తన లోకజ్ఞతను ప్రదర్శించింది. నన్నయ రుచిరార్థసూక్తినిధి ఈపద్యం. ప్రతి పదం శకుంతల సౌముఖ్యాన్నీ, గడుసరితనాన్నీ నిపుణంగా చాటుతున్నది. మాటలన్నీ వాచ్యార్థంలో సంస్కృతి సౌగంధ్యంతో కూడి ఉన్నాయి. వాచ్యార్థస్ఫూర్తి తరువాత ప్రతీయమాన మయ్యే వ్యంగ్యార్థంద్వారా రుచిరంగా వెలుగొందే వైదగ్ధ్యం వాటిలో గోచరిస్తుంది. నీ ప్రసాదమున - దయతో - వరము - ప్రసన్నబుద్ధి - అనే మాటలతో దుష్యంతుడిని కోరుతున్నప్పుడు శకుంతల సాక్షాత్తు భగవంతుడిని అడుగుతు న్నట్లు భక్తి వినయాలను ప్రదర్శించింది. నరనుత - నిరుపమ కీర్తి - అనవద్యముగా - అనే మాటలు వాడుతున్నప్పుడు లోకజ్ఞత ప్రకటించింది. ఇచ్చే వరం త్రికరణశుద్ధిగా తిరుగులేకుండా ప్రీతితో ఇవ్వాలని అడగటంలో నేర్పరితనం ఉన్నది. మాటతప్పితే ప్రజలలో నిరుపమానంగాఉన్న నీ కీర్తి మొక్కపోతుంది అని హెచ్చరించింది. ఇంతటి వ్యంగ్యార్థాన్ని వస్తుధ్వనికి అంగంగా వాడుకొనటం నన్నయ నేర్పరితనం. రాజు మదనాతురు డై సంగమాన్ని

కోరుతున్నాడు. గాంధర్వవివాహం అనే ధర్మాన్ని చూపుతున్నాడు. ఆ తరువాతి సంగతి మాటాడటం లేదు. శకుంతల తనకూ తన సంతతికీ భద్రతకొరకు, దుష్యంతుడి అనురాగాన్ని పరీక్షించటంకొరకు ఈ వరం అడిగింది. 'నీకును నాకును సంగమంబగున్' అనటంలో గాంధర్వవిధిని అంగీకరించి, ఆతడి సంగమాన్ని మనసారా కోరుతున్నట్లు తెలిపింది. ఆమె మాటలలో ఎంతటి చొరవ ఉన్నదో అంతటి బిగువుకూడ ఉండటం నన్నయ సంభాషణరచనా చాతుర్యఫలం. రాజసభలో ఈ వరమే చర్చనీయాంశ మౌతుంది. కాబట్టి శకుంతలకథలో ఈపద్యం త్రాసులో ముల్లువంటిది. దుష్యంతుడు కణ్వమహర్షి దర్శనం చేసికొనకుండా నిష్క్రమించటానికీ, ఆ తరువాత శకుంతలను అంతః పురానికి పిలిపించుకొనకపోవటానికీ కల గూఢ మైన హేతువు ఆమె అడిగిన ఈవరమే. ఆమె పెద్దకోరిక కోరింది. అది పుత్రుడు పుట్టినప్పుడు ఫలిస్తుంది. పుత్రుడు పుట్టితే ఆమె తెలియపరచాలి. యౌవరాజ్య విషయం ఆ తరువాతిమాట, ఇట్లా ఎన్నో సన్నివేశాలపరంపరతో ముందుకథ నడవాలి. శకుంతలా గతంగా ఉన్న స్వీయభద్రతావిషయకమైన శంకయే భావికథలో ఒక గండంగా పరిణమించబోవటం వస్తుధ్వని విశేషం. ప్రసాదము, ప్రసన్నబుద్ధి - అనే పదాలు నన్నయరచనలో ప్రధానంగా కనబడే ప్రసాదగుణాన్నీ ప్రసన్నకథాకలి(వి)తార్థ యుక్తినీ జ్ఞప్తికి తెప్పిస్తున్నాయి.

వ. అనిన విని శకుంతల కెంతయు సంతోషంబుగా దాని కోరిన వరం బిచ్చి, గాంధర్వవివాహంబున నభిమతసుఖంబు లనుభవించి, యక్కోమలి వీడ్కొని 'నిన్నుఁ దోడ్కొనిరా నస్మత్ప్రధానవర్గంబుఁ గణ్వమహాముని పాలికిం బుత్తెంచెద' నని యూఱడ నొడివి దుష్యంతుండు నిజపురంబునకుం జనియె; నిట శకుంతలయుఁ దనచేసినదాని మునివరుం డెఱింగి యలిగెడునో యని వెఱచుచుండె; నంత నమ్మహాముని వనంబుననుండి కందమూలఫలంబులు గొని చనుదెంచి, లలితశృంగారభావంబున లజ్జావనతవదనయు నతిభీతచిత్తయు నైయున్న కూఁతుంజూచి, తన దివ్యజ్ఞానంబున నంతవృత్తాంతంబు నెఱింగి, క్షత్త్రియులకు గాంధర్వ వివాహంబు విధిచోదితంబ యని సంతసిల్లి శకుంతల కి ట్లనియె. 54

ప్రతిపదార్థం: అనినన్, విని= అని చెప్పగా విని; ఎంతయున్; సంతోషంబున్; శకుంతలకున్; దాని, కోరిన, వరంబు+ఇచ్చి= ఆమెకోరిన వరం ఇచ్చి (ప్రథమకు షష్ఠి); గాంధర్వ, వివాహంబునన్; అభిమత, సుఖంబులు= ఇష్టసుఖాలు, (రతిసుఖాలు); అనుభవించి= పొంది; ఆ+కోమలిన్= ఆ శకుంతలను; వీడ్కొని= వెళ్ళివస్తానని; నిన్నున్= నిన్ను (శకుంతలను); తోడ్కొని, రాన్= తీసికొనిరావటానికి; అస్మద్, ప్రధాన, వర్గంబున్= నా మంత్రులను; కణ్వ, మహత్+ముని, పాలికిన్= కణ్వమహాముని దగ్గరకు; పుత్తెంచెదన్= పంపుతాను; అని= అనిచెప్పి; ఊఱడన్, నొడివి= సమాధానపడేటట్లు నచ్చజెప్పి; దుష్యంతుండు; నిజ, పురంబునకున్= తన రాజధానికి; చనియెన్= వెళ్ళాడు; ఇట= ఆశ్రమంలో; శకుంతలయున్= శకుంతలకూడ; తన, చేసిన, దానిన్= తానుచేసినపనిని; మునివరుండు= మునిశ్రేష్ఠుడైన కణ్వుడు; ఎఱింగి= తెలిసికొని; అలిగెడునో= కోపిస్తాడేమో; అని; వెఱచుచున్+ఉండెన్= భయపడుతూ ఉండింది; అంతన్= ఆ సమయంలో; ఆ+మహత్+ముని= ఆ కణ్వమహర్షి; వనంబుననుండి= అడవినుండి; కందమూల, ఫలంబులు, కొని= కందగడ్డలు, పండ్లు తీసికొని; చనుదెంచి= వచ్చి; లలిత, శృంగార, భావంబునన్= సున్నితమైన శృంగారహావభావాలతో; లజ్జా+అవనత, వదనయున్= సిగ్గుచేత వంచబడిన ముఖం కలిగినదియున్నూ; అతి, భీత, చిత్తయున్= మిక్కిలి భయపడిన హృదయం కలిగినదియున్నూ; ఐ; ఉన్న; కూఁతున్, చూచి= కూతురిని చూచి; తన, దివ్య, జ్ఞానంబునన్= తనయొక్క దివ్యదృష్టితో; అంత, వృత్తాంతంబున్+ఎఱింగి= జరిగిన కథనంతటిని తెలిసికొని; క్షత్త్రియులకున్= రాజులకు; గాంధర్వవివాహంబు; విధి, చోదితంబు+అ, అని= శాస్త్రసమ్మతమే అని; సంతసిల్లి= సంతోషించి; శకుంతలకున్= శకుంతలతో ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: శకుంతలమాటలు విని అమితసంతోషంతో ఆమె కోరిన వరాన్ని ఇచ్చి, గాంధర్వవివాహ మాడి, ఇష్టసుఖాలను అనుభవించి, ఆకోమలిని వీడ్కొని 'నిన్ను వెంటబెట్టుకొని రావటానికి మంత్రులను కణ్వమహాముని వద్దకు పంపుతా'నని ఆమెను సమాధానపరచి, ఒప్పించి, దుష్యంతుడు తన నగరానికి వెళ్లిపోయాడు. ఇక ఇక్కడ ఆశ్రమంలో శకుంతలకూడ తాను చేసిన పనిని కణ్వమహర్షి తెలిసికొని కోపగిస్తాడేమో అని భయపడుతూ ఉన్నది. అప్పుడు కణ్వమహర్షికందమూలాలను, పండ్లను కోసికొని వనంనుండి తిరిగివచ్చి సున్నితమైన శృంగారహావభావాలతో సిగ్గుతో తలవంచుకొని భయపడుతూ ఉన్న తనకూతురు శకుంతలను చూచి దివ్యజ్ఞానంతో జరిగిన కథనంతా తెలిసికొన్నాడు. 'క్షత్త్రియులకు గాంధర్వవివాహం శాస్త్రసమ్మతమే' అని సంతోషించి శకుంతలతో ఈవిధంగా అన్నాడు.

విశేషం: కణ్వుడు కరుణానిరతు డనీ, ధర్మస్వరూపు డనీ శకుంతల చెప్పింది. ఆమెమాటలను ఆ మహర్షి తనవర్తనంద్వారా నిరూపించుకొన్నాడు.

భరతుని జననము. (సం.1-68-1)

తే. **తల్లి! నీకులగోత్ర సౌందర్యములకుఁ ।**
దగిన పతిఁ గంటి; దానికిఁ దగఁగ గర్భ
మయ్యెఁ; నీదు గర్భమున వాఁ డఖిలభువన ।
వహన మహనీయుఁ డగు చక్రవర్తి సుమ్ము. **55**

ప్రతిపదార్థం: తల్లి= అమ్మా! (తల్లిదండ్రులు కూతుళ్ళను ఆప్యాయంగా పిలిచే పిలుపు); నీ, కుల, గోత్ర, సౌందర్యములకున్= నీకులానికీ, గోత్రానికీ, అందానికీ; తగిన= యోగ్యుడైన; పతిన్= భర్తను; కంటి(వి)= పొందావు; దానికిన్, తగఁగన్= దానికి తగినట్లుగా; గర్భము+అయ్యెన్= నీకు గర్భమైనది; నీదు, గర్భమునవాఁడు= నీ గర్భంలో ఉన్నవాడు; అఖిల, భువన, వహన, మహనీయుఁడు+అగు= సమస్తభూమిని భరించ (పాలించ)గల గొప్పవాడైన; చక్రవర్తి, సుమ్ము= చక్రవర్తి సుమా!

తాత్పర్యం: అమ్మా! నీకులగోత్రాలకు అందచందాలకు తగిన భర్తను నీవు పొందగలిగావు. దానికి తగినట్లుగా నీవు గర్భవతివికూడ అయినావు. నీగర్భంలో ఉన్నవాడు ఈసమస్త భూమిని పాలించగలిగిన మహనీయు డయ్యే చక్రవర్తిసుమా!.

విశేషం: కణ్వమహర్షి భూత, భవిష్యత్, వర్తమానాలను దర్శించగల మహిమాన్వితు డనీ, క్రాంతదర్శి అనీ ఈమాటలు స్ఫురింపజేస్తున్నవి.

వ. **'నీధర్మచరితంబునకు మెచ్చితి, నీ కోరిన వరం బిచ్చెద వేఁడు' మనిన శకుంతలయు 'నాచిత్తం బెప్పుడు ధర్మువునంద తగిలియుండను, నాకుద్భవించెడు పుత్త్రుండు దీర్ఘాయురారోగ్యైశ్వర్య బలసమన్వితుండును వంశకర్తయుఁగాను వలయు' ననిన నమ్మహాముని కరుణించి దాని కోరిన వరం బిచ్చి, యథాకాలవిధుల గర్భసంస్కార రక్షణంబులు సేయించి యున్నంత, వర్షత్రయంబు సంపూర్ణం బైన, శకుంతలకు భరతుం డుదయించి కణ్వనిర్వర్తిత జాతకర్మాది క్రియాకలాపుం డయి పెరుఁగుచుఁ గరతలాలంకృతచక్రుండును, చక్రవర్తిలక్షణలక్షితుండును, సింహసంహన నుండును, దీర్ఘబాహుండును, ననంతజవసత్త్వ సంపన్నుండును నై పరఁ గుచు.** **56**

ప్రతిపదార్థం: నీ, ధర్మ, చరితంబునకున్= ధర్మబద్ధమైన నీ ప్రవర్తనకు; మెచ్చితిన్(ని)= సంతోషించాను; నీ, కోరిన, వరంబు; ఇచ్చెదన్; వేఁడుము= కోరుకొమ్ము; అనినన్= అనగా; శకుంతలయున్, నాచిత్తంబు= నామనస్సు; ఎప్పుడున్= అన్నివేళలా; ధర్మువునందున్+అ= ధర్మంలోనే; తగిలి, ఉండను= ఆసక్తి కలిగి ఉండేటట్లూ; నాకున్, ఉద్భవించెడు, పుత్త్రుండు= నాకు పుట్టే కొడుకు; దీర్ఘ+ఆయుస్+ఆరోగ్య+ఐశ్వర్య, బల, సమన్వితుండును= దీర్ఘమైన ఆయుస్సుతోనూ, ఆరోగ్యంతోనూ, సంపదలతోనూ, బలంతోనూ కూడినవాడూ; వంశకర్తయున్= పుట్టిన వంశానికి కీర్తిప్రతిష్ఠలు కలిగించి తన తరువాతివారిని

తనవంశజులుగా పేర్కొనేటట్లు చేసే ప్రముఖుడు వంశకర్త - అటువంటి వాడుగానూ; కాన్, వలయున్, అనినన్= కావలెనని కోరగా; ఆ+మహాముని= ఆ కణ్వమహర్షి; కరుణించి= దయచూపి; దాని, కోరిన, వరంబు+ఇచ్చి= ఆమె కోరిన వరాన్ని ఇచ్చి; యథాకాల విధులన్= ఆయా సమయాలలో చేయదగిన శాస్త్రోక్త పద్ధతులతో; గర్భ, సంస్కార, రక్షణంబులు, చేయించి= స్త్రీ గర్భము తాల్చినప్పుడూ, ఆ గర్భము పెరుగుతున్నప్పుడూ గర్భస్థ శిశువు రక్షణం కోసము చేసే విధులను చేయించి; ఉన్నంతన్= ఉండగా; వర్షత్రయంబు, సంపూర్ణంబు+ఐనన్= మూడేండ్లు నిండగా; శకుంతలకున్; భరతుండు; ఉదయించి= పుట్టి; కణ్వ, నిర్వర్తిత, జాతకర్మ+ ఆది, క్రియాకలాపుండు+ అయి= కణ్వునిచేత చేయించబడిన జాతకర్మ మొదలైన సంస్కారక్రియలతో కూడినవాడై; పెరుఁగుచున్= పెద్దవాడౌతూ; కర, తల+అలంకృత, చక్రుండును= అరచేతియందు అమరిన చక్రరేఖ అనే సాముద్రిక లక్షణం కలవాడున్నూ; చక్రవర్తి, లక్షణ, లక్షితుండును= చక్రవర్తి కాగలిగే లక్షణాలు శరీరంమీద సాముద్రికంగా కనబడుతున్నవాడూ; సింహ, సంహననుండును= సింహంయొక్క శరీరంవంటి శరీరం కలవాడున్నూ; దీర్ఘబాహుండును= పొడ వైన చేతులు కలవాడున్నూ; అనంత, జవ, సత్త్వ, సంపన్నుండును+ఐ= అపారమైన వేగాన్నీ బలాన్నీ కలవాడున్నూ అయి; పరఁగుచున్= ఒప్పారుతూ.

తాత్పర్యం: 'నీధర్మప్రవర్తనకు నేను మెచ్చాను. నీవు కోరిన వరం ఇస్తాను. వేడుకొమ్ము' అని కణ్వమహర్షి అనగానే శకుంతల 'నా మనస్సెల్లప్పుడూ ధర్మంలోనే లగ్నమై ఉండాలి' అనీ, 'నాకు పుట్టే కొడుకు దీర్ఘాయువు, ఆరోగ్యం, ఐశ్వర్యం, బలం కలిగి వంశకర్తగా ప్రసిద్ధికెక్కాలి' అనీ కోరింది. అందుకు ఆ మహాముని కరుణించి శకుంతల కోరిన వరాన్ని ఇచ్చి గర్భవతికి చేయవలసిన సంస్కార రక్షణ విధులను చేయించి ఉండగా, మూడేళ్ళు నిండిన తరువాత ఆమెకు భరతుడు జన్మించాడు. కణ్వమహర్షి అతనికి

జాతకర్మాది క్రియాకలాపాలు జరిపించగా పెరుగుతున్నాడు. అరచేతిలో చక్రరేఖ కలవాడు, చక్రవర్తి, లక్షణాలన్నీ ముద్రించుకొన్న మేను కలవాడు. సింహంవలె సర్వాంగసుందరుడు, పొడుగైన చేతులు కలవాడు, అపారమైన వేగమూ, బలమూ కలవాడై భరతుడు విలసిల్లాడు.

విశేషం: భరతుడు పుట్టుకతోనే చక్రవర్తి కాదగిన సాముద్రిక చిహ్నాలు కలిగిఉన్నాడు. అరచేతిలో చక్రరేఖ రాజయోగాన్ని సూచిస్తుంది. "చక్రాసి చాప వజ్రాభా । రేఖాః కుర్వంతి భూపతిమ్' - అని సాముద్రికశాస్త్రం. చక్రం, ఖడ్గం, విల్లు, వజ్రాయుధం వంటి రేఖలు కలవాడు తప్పక రాజౌతాడని శాస్త్రం.

మ. అమితోగ్రాటవిలోనఁ గ్రుమ్మరు వరాహవ్యాళశార్దూల ఖ
డ్గమదేభాదులఁ బట్టి తెచ్చి ఘనుఁడై కణ్వాశ్రమోపాంత భూ
జములం దోలిన కట్టుచుం బలిమిమై శాకుంతలుం డొప్పె వ
న్యమదేభంబుల నెక్కుచుం దగిలి నానాశైశవక్రీడలన్. 57

ప్రతిపదార్థం: శాకుంతలుండు= శకుంతలయొక్క కుమారుడైన భరతుడు; బలిమిమైన్= బలంతో; అమిత+ఉగ్ర+అటవిలోనన్= ఎంతో భయంకరమైన అడవిలో; క్రుమ్మరు= తిరుగాడు; వరాహ, వ్యాళ, శార్దూల, ఖడ్గ, మద+ఇభ, ఆదులన్= అడవిపందులను, పాములను, పులులను, ఖడ్గమృగాలను, మదపుటేనుగులను, మరి ఇతరమృగాలను; పట్టి, తెచ్చి= పట్టుకొని, తీసికొనివచ్చి; ఘనుఁడు+ఐ= ప్రముఖుడు+ఐ; కణ్వ+ఆశ్రమ+ ఉపాంత+ భూజములందున్= కణ్వునియొక్క ఆశ్రమం యొక్క సమీపంలోని చెట్లకు; ఓలిన్+అ= వరుసగా; కట్టుచున్= కట్టివేస్తూ; తగిలి= ఆసక్తితో; మద+ ఇభంబులన్, ఎక్కుచున్= అడవికి సంబంధించిన మదించిన ఏనుగులపై ఎక్కి స్వారిచేస్తూ; నానా, శైశవ, క్రీడలన్= అనేకరకా లైన బాల్యక్రీడలతో; ఒప్పెన్= ఒప్పారెను.

తాత్పర్యం: భరతుడు అపారబలంతో అతిభయంకర మైన అడవులలో తిరుగాడే అడవిపందులను, పాములను, పులులను, ఖడ్గమృగాలను, మదించిన

ఏనుగులను ఇంకా తదితరమృగాలను అవలీలగా పట్టి తెచ్చి ఘటికుడై ఆ ఆశ్రమ సమీపప్రాంతంలో ఉన్న చెట్లకు వరుసగా కట్టివేస్తూ, ఆసక్తితో అడవిలో తిరిగే మదించిన ఏనుగులపై ఎక్కి స్వారిచేస్తూ తన బాల్యక్రీడలను అనేకవిధాలుగా ప్రదర్శిస్తూ ఉన్నాడు.

విశేషం: తండ్రి యైన దుష్యంతుడు పెద్దవా డైన తరువాత ప్రదర్శించిన బలాన్ని భరతుడు బాల్యంలోనే ప్రదర్శించాడు. శాకుంతలుండు అంటే శకుంతులయొక్కపుత్రుడని అర్థం. స్త్రీభ్యోఢక్' అని ఢక్‌ప్రత్యయాదులు వచ్చి శాకుంతలేయుడు అని కావలసింది. కాని, ఉత్సర్గశాస్త్రంచేత మహాకవి ప్రవర్తింపచేశాడని వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. ప్రసాదగుణమిశ్రిత మైన ఓజోగుణరచన బాలవీరుడి పరాక్రమవర్ణనంలో సహజంగా రాణించింది.

వ. ఇట్లు వనంబులోని సర్వసత్త్వంబులను దనమహాసత్త్వంబునం జేసి దమియించుచున్న యాతనిం జూచి యాశ్చర్యం బంది యందులమునులెల్ల నాతనికి సర్వదమనుం డను నామంబుఁ జేసిరి; కణ్వమహామునియు నక్కుమారు నుదార తేజోరూప విక్రమ గుణంబులకు సంతసిల్లి 'వీఁ డఖిల భువన యౌవరాజ్యంబునకు సమర్థుం డగు సమయం బరుగుదెంచె' నని విచారించి యొక్కనాఁడు కూఁతున కి ట్లనియె. 58

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; వనంబులోని= అరణ్యంలోని; సర్వసత్త్వంబులను= అన్నిమృగాలనూ; తన, మహత్+సత్త్వంబునన్, చేసి= తనయొక్క గొప్పదైన బలంచేత; దమియించుచున్+ఉన్నన్= అణచివేస్తూ (నశింపచేస్తూ) ఉండగా; అందుల, మునులెల్లన్= అక్కడి మునులందరు; ఆతనిన్= భరతుడిని; చూచి; ఆశ్చర్యంబు+అంది= అబ్బురపడి; ఆతనికిన్= భరతుడిని; సర్వదమనుండు= అన్నింటిని అణచువాడు; అను, నామంబున్, చేసిరి= అనే అర్థం గల బిరుదనామం పెట్టారు; కణ్వ, మహత్+మునియును; ఆ+కుమారు+ఉదార, తేజో, రూప, విక్రమ, గుణంబులకున్= ఆ బాలుని

యొక్క ఉత్తమ తేజస్సు (ప్రకాశం)కూ, ఆకారసౌష్ఠవానికీ, పరాక్రమ గుణాలకూ; సంతసిల్లి= సంతోషించి; వీఁడు= ఈ భరతుడు; అఖిల, భువన, యౌవరాజ్యంబునకున్= సమస్త రాజ్యానికి యౌవరాజ్య పదవికి; సమర్థుండు+ అగు, సమయంబు= యోగ్యుడైన సమయం; అరుగుదెంచెను+ అని= వచ్చింది అని; విచారించి= ఆలోచించి; ఒక్కనాఁడు= ఒకరోజున; కూఁతునకున్= పుత్రిక అయిన శకుంతలతో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈవిధంగా అరణ్యంలోని అన్ని జంతువులనూ తన మహాబలం చేత అణచివేస్తున్న భరతుడిని చూచి ఆశ్చర్యపడి అక్కడి మునులందరూ అతడికి 'సర్వదమనుడు' (అన్నింటిని అణచివేసేవాడు) అనే పేరుపెట్టి పిలిచారు. కణ్వమహామునికూడా ఆ బాలుడి ఉదాత్తతేజస్సును, రూపాన్నీ, పరాక్రమగుణాలనూ చూచి సంతసించి అతడు సమస్తరాజ్యానికి యువరాజుగా ఉండదగిన సమయం వచ్చిం దని భావించి ఒకనాడు కూతు రైన శకుంతలతో ఈవిధంగా అన్నాడు.

ఆ. ఎట్టిసాధ్వులకును బుట్టిన యిండ్లను।
బెద్దకాల మునికి తద్ద తగదు;
పతులకడన యునికి సతులకు ధర్మువు;।
సతుల కేడుగడయుఁ బతుల చూవె. 59

ప్రతిపదార్థం: ఎట్టి, సాధ్వులకును= ఎటువంటి పతివ్రతలకైనను; పుట్టిన, ఇండ్లను= వారివారి పుట్టిండ్లలో; పెద్దకాలము+ఉనికి= చాలకాలం ఉండటం; తద్ద, తగదు= ఎంతమాత్రం (అత్యంతం) ఉచితం కాదు; సతులకున్= ఇల్లాళ్ళకు; పతుల, కడన్= భర్తలదగ్గరే; ఉనికి= ఉండటం; ధర్మువు= ధర్మం, న్యాయం; సతులకున్= వివాహితులకు; పతులు+అ= భర్తలే; ఏడు+కడయున్= ఏడురకాలైన రక్ష; (గురువు, తల్లి, తండ్రి, పురుషుడు, విద్య, దైవం, దాత - అనేవారు ఏడురకాలైన రక్షలు); చూవె= సుమా!

తాత్పర్యం: ఎటువంటి పతివ్రతలకైనా పుట్టినిళ్ళలో ఎక్కువకాలం ఉండటం ఎంతమాత్రం ఉచితం కాదు. ఇల్లాళ్ళకు భర్తలదగ్గర ఉండటమే ధర్మం. భార్యలకు భర్తలే సర్వరక్షకులు (ఏడుగడలు) సుమా!

విశేషం: నన్నయగారి సూక్తినిధిత్వానికి ఈపద్యం ఒక చక్కని ఉదాహరణం.

కణ్వమహాముని శకుంతలను దుష్యంతుపాలికిం బంపుట (సం. 1-68-10)

వ. 'కావున నీ విక్కుమారునిం దోడ్కొని నీపతిపాలికి నరుగు' మని మహాతపోధను లైన తన శిష్యులం గొందఱం దోడువంచిన, శకుంతలయు దౌష్యంతిం దోడ్కొని దుష్యంతుపాలికి వచ్చి సకలసామంతమంత్రిపురోహిత ప్రధానపౌరజనపరివృతుండై యున్న యారాజుం గనుంగొని. 60

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నీవు; ఈ+కుమారునిన్= ఈ బాలుడిని, లేదా, పుత్రుడిని; తోడ్కొని= వెంటతీసికొని; నీ, పతి, పాలికిన్= నీభర్త దగ్గరకు; అరుగుము= వెళ్ళుము; అని; మహాతపోధనులు+ఐన= గొప్పదైన తపస్సే ధనంగా కలవారైన; తన, శిష్యులన్; కొందఱన్; తోడు, పంచినన్= తోడుగా వెంట పంపగా; శకుంతలయున్; దౌష్యంతిన్= దుష్యంతుడి పుత్త్రుడైన భరతుడిని; తోడ్కొని= వెంటతీసికొని; దుష్యంతుపాలికిన్, వచ్చి= దుష్యంతుడివద్దకు వచ్చి; సకల, సామంత, మంత్రి, పురోహిత, ప్రధాన, పౌరజన, పరివృతుండు+ఐ, ఉన్న= అందరు సామంతులు, మంత్రులు, పురోహితులు, సేనాపతులు, పురజనులచేత కూడినసభలో ఉన్నవాడైన; ఆ, రాజున్, కనుంగొని= ఆదుష్యంతుడిని చూచి.

తాత్పర్యం: 'కాబట్టి నీ వీ కుమారుడిని తీసికొని నీభర్తవద్దకు పొమ్ము' అని గొప్ప తపస్వులైన శిష్యులను కొందరిని తోడిచ్చి పంపగా శకుంతలకూడ భరతుడిని వెంటతీసికొని దుష్యంతుడి వద్దకు వచ్చి, సామంతులు, మంత్రులు, పురోహితులు, ప్రధానులు, పౌరజనులతో కూడి ఉన్నసభలో ఆ రాజును చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. గురునాశ్రమంబునను ము।
న్నరుదుగఁ బతివలనఁ గనిన యనురాగమునా
దరణము ననుగ్రహంబును।
గరుణయు సంభ్రమము నపుడు గానక యెడలోన్. 61

ప్రతిపదార్థం: మున్ను= పూర్వం; గురు, ఆశ్రమంబునను= తండ్రియైన కణ్వుడి ఆశ్రమంలో; అరుదుగన్= అపూర్వంగా; పతివలనన్= భర్తఐన దుష్యంతుడిలో; కనిన= చూచిన; అనురాగమున్= వలపునూ; ఆదరణమున్= ఆప్యాయతయూ; అనుగ్రహంబును= అనుకూలతయూ; కరుణయున్= దయయు; సంభ్రమమున్= తొట్రుపాటుతో కూడిన ఆసక్తియు; అపుడు; కానక= చూడక; ఎడలోన్= మనసులో.

తాత్పర్యం: పూర్వం తండ్రిఆశ్రమంలో అపూర్వంగా తనపతి తనపట్లచూపిన వలపును, ఆదరాన్నీ, దయనూ, ఆసక్తినీ అప్పుడు కానక హృదయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: కణ్వాశ్రమంలో దుష్యంతుడు శకుంతలను గాంధర్వవివాహం చేసికొన్న ఘట్టంలో ఆ దుష్యంతుడి పాత్రలో పోషించిన భావక్రమాన్ని వ్యంగ్యంగా నన్నయ ఇక్కడ సూచించాడు. ఇది కథాకథనశిల్పంలో ఒకభాగం. ఎన్నో యేళ్ళక్రితం జరిగిన ఆఘట్టాన్ని మధురస్మృతిగా సమీక్షించింది శకుంతల. అది వమ్ము కావటంతో ఆమెహృదయం వికలమైపోయింది.

క. ఎఱుఁగ డొకొ నన్నుః నెఱిఁగియు।
నెఱుఁగని యట్లుండునొక్కొః యెడ దవ్వగుడున్
మఱచెనొకొ! ముగ్ధ లధిపులు।
మఱవరె బహుకార్యభారమగ్నులు కారే. 62

ప్రతిపదార్థం: నన్నున్; ఎఱుఁగడు+ఒకొ= నన్ను ఎఱుగడా?; ఎఱిఁగియున్, ఎఱుఁగని, అట్లు+ఉండును+ఒక్కొ= గుర్తించికూడ గుర్తించనట్లు ఉంటున్నాడో

(నటిస్తున్నాడో) ఏమో; ఎడ, దవ్వు+అగుడున్= చూచి చాలకాలంకావటంచేత; మఱచె నొకొ= మరచిపోయాడో ఏమో; అధిపులు= రాజులు; ముగ్ధలు= మూఢులు(మరపు ఎక్కువగా కలవారు అనిభావం); మఱవరె= మరచిపోరా; బహు, కార్య, భార, మగ్నులు, కారే= పలు పనులఒత్తిడులలో మునిగి ఉంటారుకదా!

తాత్పర్యం: ఇతడు నన్ను గుర్తించలేదా? గుర్తించికూడ గుర్తించనట్లు నటిస్తున్నాడా? చాలకాలం కావటంచేత మరచాడో ఏమో; రాజులు అనేకకార్యాలలో మునిగి ఉంటారు కదా! అందువలన వారికి మరపు వింతకాదు. ప్రభువులు మూఢులు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

చ. తలఁపఁగ నాఁడు పల్కినవిధం బెడఁ దప్పఁగ వీడె నొక్కొ చూ
డ్కులు విరసంబులై కరము క్రూరము లైన నిమిత్త మేమియో?
కలయఁగఁ బల్కరించి రుపకారులు నై రని నమ్మియుండఁగా
వలవదు బుద్ధిమంతులు నవప్రియు లైన ధరాధినాథులన్. 63

ప్రతిపదార్థం: తలఁపఁగన్= ఆలోచింపగా; నాఁడు= పెండ్లినాడు; పల్కిన, విధంబు= మాటాడిన పద్ధతి; ఎడన్, తప్పఁగన్ వీడెను+ఒక్కొ= మనసుమారి వదలిపెట్టాడా ఏమి?; చూడ్కులు= చూపులు; విరసంబులు+ఐ= విముఖంగా; కరము, క్రూరములు= మిక్కిలి కఠినాలు; ఐన, నిమిత్తము+ఏమియో= అయినకారణ మేమిటో?; నవ, ప్రియులు+ఐన= క్రొత్తదనాన్నే ఎల్లప్పుడు ప్రేమించేవారైన; ధరా+అధినాథులన్= భూపతులను; కలయఁగన్= కలుపుగోలుతనంతో; పల్కరించిరి= మాటాడా రనీ; ఉపకారులును+ఐరి+అని= మేలుచేసినవారైనారనీ; బుద్ధిమంతులు= తెలివిగలవారు; నమ్మి+ఉండఁగాన్, వలవదు= నమ్మిఉండకూడదు.

తాత్పర్యం: ఆలోచించగా, ఈరాజు పెండ్లినాడు పలికినపద్ధతిని మనసు మార్చుకొని వదలిపెట్టినాడా ఏమి? అతనిచూపులు నాయెడ విరసంగా, అత్యంత కఠినంగా ఉన్నవి. కారణ మేమిటో? క్రొత్తక్రొత్తవాటినే ప్రేమించే రాజులను (క్రొత్తగా వారు కలిసినప్పుడు) కలుపుగోలుతనంతో పల్కరించా రనీ, ఉపకారులై వ్యవహరించా రనీ బుద్ధిమంతులు వారిని నమ్మి ఉండరాదు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. శకుంతలమాటలలో పాలకులస్వభావాన్ని నన్నయ పరోక్షంగా అధిక్షేపించాడు.

వ. అని తలంచి చింతాక్రాంత యై శకుంతల వెండియు నాత్మగతం బున. 64

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: ఆ విధంగా భావించి దుఃఖంచేత ఆవరింపబడిన హృదయంతో శకుంతల మనస్సులో ఇంకనూ ఇలా అనుకొన్నది.

క. మఱచినఁ దలఁపింపఁగ నగు;।
నెఱుఁగని నాఁ డెల్లపాట నెఱిఁగింప నగున్;
మఱి యెఱిఁగి యెఱుఁగ నొల్లని।
కఱటిం దెలుపంగఁ గమలగర్భుని వశమే. 65

ప్రతిపదార్థం: మఱచినన్= (ఎవరైనా ఒక అంశాన్ని నిజంగా) మరచిపోయినట్లయితే; తలఁపింపఁగన్+అగున్= జ్ఞప్తికి తేవచ్చును; ఎఱుఁగనినాఁడు= (ఎవరైనా అసలు) తెలియనిస్థితిలో ఉన్నప్పుడు; ఎల్లపాటన్= అన్నివిధాల యత్నించి ఏదోపద్ధతిలో; ఎఱిఁగింపన్+అగున్= తెలియచెప్ప వచ్చును; మఱి= కాని; ఎఱిఁగి= తెలిసికూడ; ఎఱుఁగన్+ఒల్లని= తెలియటానికి అంగీకరించని, లేదా, తెలియనట్లు నటించే; కఱటిన్= మోసగాడికి; తెలుపంగన్= తెలియచెప్పటం; కమల, గర్భుని, వశమే?= బ్రహ్మదేవుడి వశమా? కాదని భావం.

తాత్పర్యం: ఎవరైనా నిజంగా మరచిపోతే జ్ఞాపకం చేయవచ్చును; అసలు తెలియ నప్పుడు ఏ పాటుపడి అయినా తెలియచెప్పవచ్చును. కాగా, తెలిసి కూడ తెలియని వాడివలె నటించే మోసగాడికి తెలియజేయటం బ్రహ్మతరంకూడా కాదు.

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తికి ఇది చక్కని నిదర్శనం. ఈసూక్తివినగానే భర్తృహరి సుభాషితాలలోని మూర్ఖపద్ధతిలో చెప్పబడిన ఈసుభాషితం స్ఫురిస్తుంది. "అజ్ఞఃసుఖ మారాధ్యస్సు కతరమారాధ్యతేవిశేషజ్ఞః, జ్ఞానలవదుర్విదగ్ధంబ్రహ్మాపినరం న రంజయతి'. దీనికి ఏనుగు లక్ష్మణకవి అనువాదం తెలుగునాట ప్రసిద్ధం. "తెలియని మనుజుని సుఖముగఁ దెలుపం దగు సుఖతరముగఁ దెలుపఁగవచ్చున్ దెలియనివానిం, దెలిసియుఁ, దెలియని నరుఁదెల్ప బ్రహ్మదేవుని వశమే.''

వ. అయినను వచ్చి మిన్నక పోవంగాదు కావున నాపూర్వవృత్తాంతంబెల్ల నెఱింగించి యే నిక్కుమారుం జూపుదు' నని మనంబున నిశ్చయించి శకుంతల యా రాజున కి ట్లనియె. **66**

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికి; వచ్చి= ఇక్కడకు వచ్చి; మిన్నక= ఊరక; పోవన్+కాదు= తిరిగిపోవటం తగదు; కావునన్= కాబట్టి; ఆ, పూర్వవృత్తాంతంబు+ ఎల్లన్= ఆ ముందు జరిగిన కథనంతా; ఎఱింగించి= తెలిపి, జ్ఞాపకంచేసి; ఏను= నేను (శకుంతల); ఈ+కుమారున్= ఈకొడుకును; చూపుదును+అని, మనంబునన్, నిశ్చయించి= చూపిస్తానని మనస్సులో నిర్ణయించుకొని; శకుంతల; ఆ, రాజునకున్= ఆ దుష్యంతుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: 'అయినప్పటికిని, ఇంతదూరం వచ్చి ఏమీ సాధించకుండా ఊరక తిరిగిపోవటం తగదు కాబట్టి, మునుపు జరిగిన కథనంతా జ్ఞాపకంచేసి, నేను ఈ కుమారుడిని ఆతడికి చూపిస్తా' నని మనస్సులో నిశ్చయించుకొని శకుంతల దుష్యంతుడితో ఈ విధంగా పలికింది.

క. జననాథ! వేఁట నెపమున ।
గొనకొని కణ్వాశ్రమమునకున్ వచ్చి ముదం
బున నందు నాకు నీయి ।
చ్చిన వరము దలంపవలయుఁ జిత్తములోనన్. **67**

ప్రతిపదార్థం: జననాథ= ప్రజలకు ప్రభువైన ఓ దుష్యంతుడా!; వేఁట, నెపమునన్= వేట అనే మిషతో; గొనకొని= పూని (కావాలని); కణ్వ+ ఆశ్రమమునకున్, వచ్చి= కణ్వ మహర్షియొక్క ఆశ్రమానికి వచ్చి; అందున్= ఆ ఆశ్రమంలో; ముదంబునన్= సంతోషంతో; నాకున్= (శకుంతలకు); నీ, ఇచ్చిన, వరము= నీవు ఇచ్చిన వరాన్ని (ప్రథమకు షష్ఠి); చిత్తములోనన్= మనస్సులో; తలంపన్, వలయున్= జ్ఞాపకం చేసికొనవలసింది.

తాత్పర్యం: ఓరాజా! వేట అనే మిషతో కావాలని సప్రయత్నంగా కణ్వమహాముని ఆశ్రమానికి వచ్చి, అక్కడ నీవు సంతోషంగా నాకు ఇచ్చిన వరాన్ని మనసులో జ్ఞాపకం చేసికొమ్ము!

విశేషం: 60వ పద్యంలో శకుంతల అడుగగా దుష్యంతుడు ప్రసాదించిన వరం ప్రస్తావింప బడుతున్నది. శకుంతలాదుష్యంతుల నడుమ రహస్యంగా ఏర్పడిన ఒప్పంద మిది. అది విస్మరింపబడితే కథాకార్యమంతా భగ్నమైపోయినట్లే. ఆ వరానికి సాక్షు లెవ్వరూ లేరు. శకుంతలాదుష్యంతులే దానికి సాక్షులు. అందులో దుష్యంతుడు విస్మరించినట్లు నటిస్తూ ఆ సత్యాన్ని అబద్ధంగా మార్చటానికి యత్నిస్తున్నాడు. అందుకే శకుంతలకు ఆవేదన.

క. బాలార్కతేజుఁ డగు నీ ।
బాలుఁడు నీకొడుకు వీనిఁ బౌరవకుల ర
త్నాలంకారు నుదార గు ।
ణాలయు యువరాజుఁ జేయు మభిషేకముతోన్. **68**

ప్రతిపదార్థం: బాల+అర్క, తేజుఁడు+అగు= బాల॥ (ఉదయించిన) సూర్యుని ప్రకాశంవంటి ప్రకాశం కలవాడైన; ఈ బాలుఁడు, ఈ చిరంజీవి; నీ, కొడుకు= నీయొక్క కుమారుడు; పౌరవ, కుల, రత్న+అలంకారున్= పూరుమహారాజు వంశకర్తగా వెలసిన ఈవంశానికి అలంకారమైన వాడూ; (అయిన); వీనిన్= ఈ భరతుడిని; అభిషేకముతోన్= రాజ్యాభిషేకంతో, యువరాజున్; చేయుము;

తాత్పర్యం: బాలసూర్యుడివలె వెలుగుతున్న ఈ బాలుడు నీ కొడుకు. పౌరవవంశానికే అలంకార మైనవాడూ, ఉత్తమగుణాలకు నెలవైనవాడూ అయిన ఇతడిని యువరాజుగా అభిషేకించుము.

విశేషం: 74, 75 పద్యాలలో శకుంతల మాటనేర్పరితనాన్ని, ఔచిత్యాన్ని ప్రదర్శించింది. కణ్వాశ్రమంలో సంగమానికి పూర్వం దుష్యంతుడు వరమిచ్చాడు. ఆ సంగతి జ్ఞాపకం చేసింది. ఆ పైన జరిగిన గాంధర్వవిధి వివాహాన్ని ప్రస్తావించకుండా, పుత్రోదయాన్నీ, అతనియౌవరాజ్యాధికారాన్నీ పేర్కొన్నది. నిండుసభలో మాటాడేటప్పుడు పాటింపవలసిన లోకజ్ఞతను శకుంతల పాటించింది. గాంధర్వవివాహవిషయం ధ్వనిమయం చేయటం నన్నయ రచనాశిల్పం.

దుష్యంతుఁడు శకుంతలను నిరాకరించుట (సం. 1-68-18)

వ. అనిన విని దుష్యంతుండు దానినంతయు నెఱింగియు నెఱుంగని వాఁడ పోలె ని ట్లనియె. 69

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: శకుంతల ఆవిధంగా అన్న మాటలు విని దుష్యంతుడు ఆ సంగతి అంతయు తెలిసికూడ తెలియనివాడి వలె ఈ విధంగా అన్నాడు.

క. ఏ నెఱుఁగ నిన్నుఁ నెక్కడి ।
దానవు? మిన్నకయ యనుచితంబులు పలుకం

గా నేల? యరుగు మంబురు ।
హానన! యెందుండి వచ్చి తందులకు వడిన్. 70

ప్రతిపదార్థం: అంబురుహ+ఆనన!= పద్మంవంటి ముఖం కలదానా! (శకుంతలా!); ఏన్= నేను; నిన్నున్; ఎఱుఁగన్= ఎరుగను; ఎక్కడి, దానవు= ఎక్కడ పుట్టినదానవు? నీవు అసలు ఎవరవు?; ఎక్కడినుండి వచ్చినదానవు? అని మూడు అర్థాలు చెప్పవచ్చును; మిన్నక+అయ= ఊరకయే; అనుచితంబులు= కూడనిమాటలు; పలుకంగాన్+ఏల= పలకటం ఎందుకు? (వలదు అని భావం); ఎందున్+ఉండి, వచ్చితి(వి)= ఎక్కడినుండి వచ్చావో; అందులకున్= ఆ ప్రదేశానికి; వడిన్= వేగంగా; అరుగుము= వెళ్ళుము.

తాత్పర్యం: పద్మముఖీ! నిన్ను నేను ఎరుగను; నీ వసలు ఎవరవు; ఊరకే ఒప్పని మాటలు మాటలాడుతా వెందుకు? ఎక్కడనుండి వచ్చావో అక్కడికే తిరిగివెళ్ళుము.

వ. అనిన విని, వెల్లనై, వెచ్చనూర్చి, నిశ్చేష్టిత యై, కెందమ్మిరేకులవలనం దొరంగు జలకణంబులపోలెఁ గోపారుణిత నయనంబుల బాష్పకణంబులు దొరంగం దలవాంచి, యారాజుం గటాక్షించుచు, హృదయసంతాపంబు దనకుం దాన యుపశమించుకొని, పెద్దయుం బ్రొద్దు చింతించి శకుంతల యా రాజున కి ట్లనియె. 71

ప్రతిపదార్థం: అనినన్= అని రాజు పల్కగా; విని; వెల్లన+ఐ= తెల్లబోయి; వెచ్చన్+ఊర్చి= వేడిగా నిట్టూర్పు విడిచి; నిశ్చేష్టిత+ఐ= చేతలు లేనిదై, కాలుచేతులాడనిదై; కెంపు+తమ్మి, రేకులవలనన్, తొరంగు, జలకణంబుల, పోలెన్= ఎర్రతామరపూల రేకులనుండి జారే నీటిబిందువుల వలె; కోప+అరుణిత, నయనంబులన్= కోపంచేత ఎర్రబారిన కన్నులనుండి; బాష్పకణంబులు= కన్నీటిబిందువులు; తొరంగన్= కారగా; తల, వాంచి= తలను వంచికొని; ఆ, రాజున్= ఆ దుష్యంతుడిని; కటాక్షించుచున్=

కనుకొనలలోనుండి చూస్తూ; హృదయ, సంతాపంబు= మనోవేదనను; తనకున్+తాను+అ= తనకుతానే, స్వయంగా; ఉపశమించుకొని= తగ్గించుకొని; పెద్దయున్+ప్రొద్దు= చాలసేపు; చింతించి= విచారించి; శకుంతల; ఆ, రాజునకున్= ఆ దుష్యంతునికి; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: దుష్యంతుడిమాటలు విని శకుంతల తెల్లబోయి, చేష్ట లుడిగి, ఎర్రతామరపూల రేకులపైనుండి జారుతున్న నీటిబిందువులవలె కోపంచేత ఎర్రబారిన కన్నులనుండి కన్నీటిబిందువులు కారుతూఉండగా, తలవంచుకొని ఆ రాజును క్రీగంటిచూపులతో చూస్తూ మనోవేదనను తనకు తానే అణచుకొని, చాలసేపు విచారించి ఆ రాజుతో ఈ విధంగా పలికింది.

విశేషం: ఇక్కడ దుఃఖతీవ్రతవలన కలిగే వైవర్ణ్యం, స్తంభం, అశ్రుపాతం అనే సాత్త్వికభావాలు శకుంతలయందు సహజంగా వర్ణించబడినవి. బాష్పవర్ణనంలోని ఉపమాలంకారం సార్థకం.

కుపిత యైన శకుంతల దుష్యంతునకు ధర్మప్రబోధ మొనరించుట.
(సం. 1-68-22)

ఆ. ఏల యెఱుక లేని యితరుల యట్ల నీ।
వెఱుఁగ ననుచుఁ బలికె దెఱిఁగి యెఱిఁగి;
యేన కాని దీని నెఱుఁగ రిం దొరు లని।
తప్పఁబలుక నగునె ధార్మికులకు! 72

ప్రతిపదార్థం: నీవు= నీవు (దుష్యంతుడు); ఎఱిఁగి= అన్నివిషయాలు బాగా తెలిసికూడ; ఎఱుఁగను+అనుచున్= (తెలిసినదానిని) తెలియదు, అంటూ; ఎఱుక, లేని; ఇతరులు+ అ+అట్లు+అ= అజ్ఞానుల వలె ఎవరో మాటాడినట్లు; పలికెదు= మాట్లాడుతావు; ఇందున్= ఇక్కడ; దీనిని= ఈ విషయాన్ని, లేదా, ఈ శకుంతలను; ఏను+అ, కాని= నేను మాత్రమేకాని; ఒరులు= ఇంకొకరు; ఎఱుఁగరు+అని= తెలియరని; ధార్మికులకున్= ధర్మాత్ములకు, ధర్మాత్ములైన మీకు (దుష్యంతునకు); తప్పన్, పలుకన్, అగును+ఎ= అబద్ధమాడవచ్చునా? (కూడదని భావం).

తాత్పర్యం: అన్నీ బాగా తెలిసికూడ నాకు తెలియదు అని ఎవరో తెలియని ఇతరులవలె ఎందుకు మాటాడుతావు? ఇక్కడ దీనిని నేనే కాని ఇతరు లెవ్వరు ఎఱుగ రని (సాక్షులు లేరని) ధర్మాత్ములైనవారు అబద్ధమాడవచ్చునా? (తగదని భావం).

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'తప్పఁబలుక నగునె ధార్మికులకు' అనే వాక్యం సాధారణలోకధర్మంగానూ, దుష్యంతుని పట్ల వర్తించే అధిక్షేపంగానూ గ్రహించవచ్చును.

చ. విమలయశోనిధీ! పురుషవృత్త మెఱుంగుచునుండుఁ జూవె వే
దములును బంచభూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముఁడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు న న్మహాపదా
ర్థము లివి యుండఁగా నరుఁడు దక్కొనఁనేర్చునె తన్ను మ్రుచ్చిలన్. 73

ప్రతిపదార్థం: విమలయశోనిధీ!= నిర్మలమైన కీర్తికి నెలవైనవాడా!; వేదములును= వేదాలున్నూ; పంచభూతములు= భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము - అనే అయిదు ప్రకృతులున్నూ; ధర్మువు= ధర్మమున్నూ; సంధ్యలు= ఉదయసంధ్య, సాయంసంధ్య అనే రెండున్నూ; అంతర్+ ఆత్మయున్= హృదయమున్నూ; యముఁడును= (మృత్యువునకు అధిదేవత ఐన) యముడూ; చంద్ర, సూర్యులు= చంద్రుడూ, సూర్యుడూ; అహంబును= పగలూ; రాత్రియున్= రాత్రియూ; అన్, మహత్+పదార్థములు= అనబడే మహాపదార్థాలు; పురుషవృత్తము= నరుని చరిత్రాన్ని (నరులు చేసే పనులను); ఎఱుంగుచున్+ఉండున్+చూవె= తెలిసికొంటూ ఉంటాయిసుమా!; ఇవి, ఉండఁగాన్= ఈ మహాపదార్థాలు ఉండగా; నరుఁడు= మానవుడు; తన్ను= తనను తాను; మ్రుచ్చిలన్= దొంగిలింపగా, వంచింపగా; తక్కొనన్ (తల+కొనన్),

నేర్చునె= పూనుకొనగలడా? (పూనుకొనలేడని భావం). (ముచ్చిలన్= వంచించుకొని; తక్కు+ఒననేర్చునె= వేరువిధంగా చేయపూనుకొనునా? అనికూడ చెప్పవచ్చును.)

తాత్పర్యం: నిర్మలమైన కీర్తికి నిధివంటివాడ వైన దుష్యంతుడా! వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉభయసంధ్యలు, హృదయం, యముడు, చంద్రసూర్యులు, పగలు, రాత్రి - అనే మహాపదార్థాలు నరులవర్తనాన్ని ఎప్పుడూ గమనిస్తూనే ఉంటాయిసుమా! ఆ మహాపదార్థాలు ఉండగా నరుడు తనంతట తాను వంచించుకోగలడా! (సత్యాన్ని దాచుకొనగలడా, లేదా, తాను చేసిన దానిని దాచుకొనగలడా?), (లేడని భావం).

విశేషం: 'విమలయశోనిధీ!' అన్న సంబోధనం సార్థకం. అసలే అచ్చమైన కీర్తికలవాడవు ఇప్పుడు అసత్యమాడి నీ కీర్తికి మచ్చ తెచ్చుకోవద్దన్న హెచ్చరిక అందులో గమ్యం.

"ఆదిత్యచంద్రావనిలో నలశ్చ, ద్యౌర్భూమి రాపో హృదయం యమశ్చ అహశ్చ రాత్రిశ్చ ఉభే చ సంధ్యే, ధర్మశ్చ జానాతి నరస్య వృత్తమ్" - అనే మూలశ్లోకంలో లేని 'వేదాలను' మహాపదార్థాలలో మొదట చేర్చి నన్నయ వేదప్రామాణ్యాన్ని గౌరవించాడు. 'పంచమవేదానికి' సార్థకత కలిగించాడు. గాంధర్వవిధితో రహస్యంగా వివాహంచేసికొని, నిండుకొలువులో సాక్ష్యాధారాలు లేవని సాహసించాడు దుష్యంతుడు. సత్యానికీ, ధర్మానికీ, అంతేకాదు మనిషిచేసే ప్రతిపనికీ, సంకల్పానికీ అతని అంతరాత్మయే అసలైన సాక్షి. అంతరాత్మను చంపుకొంటే మనిషి తనను తాను వంచించుకొన్నట్లే అవుతుందని ఈసూక్తిలోని రుచిరార్థం. శకుంతలాదుష్యంతుల కథలోని పరమార్థం. ఇది నన్నయసూక్తి మౌక్తికం.

క. నా యెఱిఁగినట్ల యిన్నియు ।
నీ యిచ్చిన వరము ధారుణీవర! యెఱుఁగున్

నాయందుఁ దొంటియట్టుల ।
చేయు మనుగ్రహ; మవజ్ఞ సేయం దగునే! 74

ప్రతిపదార్థం: ధారుణీవర!= ఓరాజా!; నీ, ఇచ్చిన, వరము= నీవు నాకు ఇచ్చిన ఆ వరాన్ని గురించి; నా, ఎఱిఁగిన+అట్లు+అ= నాకు తెలిసిన విధంగానే; ఇన్నియున్= (ముందుపద్యంలో చెప్పిన) మహాపదార్థాలన్నీ; ఎఱుఁగున్= తెలియును; తొంటి+అట్టులు+అ= వెనుకటివలెనే; నాయందున్= నాయెడల; అనుగ్రహము, చేయుము= దయను ప్రదర్శించుము, అనురాగాన్ని అందించుము; అవజ్ఞ, చేయన్, తగును+ఏ= అవమానించటం ఉచితమా? (కాదని భావం).

తాత్పర్యం: ఓ రాజా! నీ విచ్చిన వరాన్నిగురించి నా కెట్లా తెలియునో ఆవిధంగానే వేదాలు మొదలైన మహాపదార్థాలకు కూడా తెలియును. కాబట్టి, నాపట్ల వెనుకటి వలెనే అనురాగాన్ని ప్రసాదించుము; నన్ను అవమానించటం తగునా? (తగదు).

క. సతియును గుణవతియుఁ బ్రజా!
వతియు ననువ్రతయు నైన వనిత నవజ్ఞా
న్వితదృష్టిఁ జూచు నతి దు ।
ర్మతి కిహముం బరముఁ గలదె మతిఁ బరికింపన్. 75

ప్రతిపదార్థం: మతిన్= బుద్ధియందు; పరికింపన్= ఆలోచించగా; సతియును= పతివ్రత యున్నూ; గుణవతియున్= గుణవంతురాలున్నూ; ప్రజాపతియున్= సంతానవతియూ; అనువ్రతయున్= అనుకూలయూ; ఐన; వనితన్= స్త్రీని, భార్యను; అవజ్ఞా+అన్విత, దృష్టిన్= తిరస్కార దృష్టితో; చూచు, అతి, దుర్మతికిన్= చూచే మిక్కిలి దుష్టబుద్ధి కలవాడికి; ఇహమున్, పరమున్, గలదు+ఎ= ఈ లోకంలో, పరలోకం (స్వర్గలోకం)లో సుఖం ఉంటుందా? బ్రతికినా చచ్చినా సుఖపడలే డని భావం.

తాత్పర్యం: బుద్ధితో బాగా పరిశీలిస్తే - పతివ్రత, గుణవంతురాలు, సంతానవతి, అనుకూల అయిన భార్యను తిరస్కారభావంతో చూచే మిక్కిలి

దుర్బుద్ధికి ఇహపర సుఖాలు రెండూ ఉంటాయా? (ఉండ వనీ, రెంటికి చెడ్డ రేవడి ఔతా డనీ భావం).

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తికి ఇది చక్కని ఉదాహరణం. గృహస్థాశ్రమధర్మం నాలుగు బలమైనస్తంభాలమీద నిలువబడిన వ్యవస్థ. ఆనాలుగుస్తంభాలేవంటే-1 యజమానుడు (భర్త, గృహస్థుడు, గృహమేధి) 2. కులసతి (భార్య, గృహిణి) 3. సంతానం (సుతుడు, పుత్రిక) 4. సత్యం (సత్యస్వరూపమైన పరమధర్మం, దాని వివిధభేదాలు). ఈ నాల్గింటియొక్క ప్రాశస్త్యాన్నిగురించి చెప్పించటమే శకుంతల ధార్మికోపన్యాసంలోని వ్యాసహృదయం. వాటిలో మొదటిఅంశమైన యజమానునియొక్క స్వరూపస్వభావాలను వ్యంగ్యంగా నిర్దేశించటం ఈపద్యం లోనూ ఆతరువాతి పద్యంలోనూ గమనించవచ్చును.

క. సంతతగృహమేధి ఫలం।
బంతయుఁ బడయంగ నోపు ననుగుణభార్యా
వంతుం డగువాఁడు క్రియా।
వంతుఁడు దాంతుండుఁ బుత్త్రవంతుండు నగున్. 76

ప్రతిపదార్థం: అనుగుణ, భార్యావంతుండు+అగు, వాఁడు= అనుకూలవతి అయిన భార్య కలవాడు; క్రియావంతుఁడు= కర్మలను ఆచరించేవాడూ; దాంతుండున్= ఇంద్రియ నిగ్రహం కలవాడూ; పుత్త్రవంతుండున్= పుత్రసంతానం కలవాడూ; అగున్= ఔతాడు; సంతత, గృహమేధి, ఫలంబు, అంతయున్= ఎల్లప్పుడు గార్హస్థ్యాశ్రమం నిర్వహించే యజమాని పొందే ఫలాన్నంతటినీ; పడయంగన్+ఓపున్= పొందగలుగుతాడు.

తాత్పర్యం: అనుకూలవతి ఐన భార్యగలవాడు కర్మలు ఆచరించ గలుగుతాడు, ఇంద్రియాలను నిగ్రహించగలుగు తాడు, పుత్రసంతానాన్ని పొందగలుగుతాడు, గార్హస్థ్యధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించే గృహస్థుడు పొందే ఫలాన్నంతటినీ; పడయంగన్+ఓపున్= పొందగలుగుతాడు.

విశేషం: గృహస్థాశ్రమధర్మాన్ని కీర్తించే రుచిరార్థసూక్తి యిది.

వ. మఱియును. 77

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అంతేకాక.

సీ. ధర్మార్థకామసాధన కుపకరణంబు।
గృహనీతివిద్యకు గృహము, విమల
చారిత్రశిక్ష కాచార్యకం, బన్వయ।
స్థితికి మూలంబు, సద్గతికి నూఁత,
గౌరవంబున కేకకారణం, బున్నత।
స్థిరగుణమణుల కాకరము, హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ।
చూవె భర్తకు, నొండ్లు గావు ప్రియము,

ఆ. లెట్టి ఘట్టములను నెట్టి యాపదలను।
నెట్టితీఱములను ముట్టఁబడిన
వంతలెల్లఁ బాయు నింతులఁ బ్రజలను।
నొనరఁ జూడఁగనిన జనుల కెందు. 78

ప్రతిపదార్థం: ధర్మ+అర్థ, కామ, సాధనకున్, ఉపకరణంబు= ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలను సాధించటానికి సాధనం; గృహనీతి, విద్యకున్, గృహము= గృహనీతి అనేవిద్యకు నెలవైనది; విమల, చారిత్ర, శిక్షకున్+ఆచార్యకంబు= నిర్మలమైన శీలాన్ని బోధించే గురువు; అన్వయ, స్థితికిన్, మూలంబు= వంశం నిలబడటానికి ఆధారం; సత్+గతికిన్, ఊఁత= ఉత్తమగతియైన మోక్షానికి ఊతకఱ్ఱ; గౌరవంబునకున్+ఏక, కారణంబు=

మన్ననకు ముఖ్యహేతువు; ఉన్నత స్థిరగుణమణులకున్+ఆకరము= ఆదర్శమైనవీ, కలకాలం నిలిచేవీ అయిన మణులవంటి గుణాలకు నెలవైనది; హృదయ సంతోషమునకున్, సంజనకంబు= మానసికమైన ఆహ్లాదాన్ని కలిగించేది; భార్య+ అ,చూవె= భార్యయేసుమా; భర్తకున్= మగనికి; ప్రియములు= ఇష్టమైనవి; ఒండ్లు, కావు= ఇతరాలు కావు; ఇంతులన్= భార్యలను; ప్రజలను= సంతానాన్నీ (బిడ్డలను); ఒనరన్, చూడన్, కనిన, జనులకున్= సరిగా ఆదరింపగలిగినవారికి ఎందున్= ఎక్కడైనా; ఎట్టి, ఘట్టములనున్= ఎటువంటి సన్నివేశాలలో (తరుణాలలో)నైనా; ఎట్టి, ఆపదలను= ఎటువంటి విపత్తులలోనైనా; ఎట్టితీఋములను= ఎటువంటి ఇబ్బందులలోనైనా; ముట్టన్+పడిన, వంతలు+ఎల్లన్= ఆవరించిన దుఃఖాలన్నియున్నూ; పాయున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలను సాధించటానికి అనువైన సాధనమూ, గృహనీతి అనే విద్యకు నెలవైనదీ, నిర్మలమైన శీలాన్ని గురించి ప్రబోధించే గురుస్థానమూ, వంశం నిలవటానికి ఆధారమైనదీ, ఉత్తమగతులు పొందటానికి ఊతకర్ర అయినదీ, మన్ననకు ముఖ్యహేతువైనదీ, ఆదర్శప్రాయమైనవీ కలకాలం నిలిచేవీ అయిన మణులవంటి గుణాలకు నెలవైనదీ, హృదయానందాన్ని కలిగించేదీ భర్తకు భార్యయే సుమా! మగనికి ఇల్లాలికంటె ఇంపైనది వేరొకటి లేదు. ఆలుబిడ్డలను ఆప్యాయంగా చూచేవారికి ఏచోటనైనా, ఎటువంటి పరిస్థితులలోనైనా, ఎటువంటి ఆపదలలోనైనా, ఇబ్బందులలోనైనా చుట్టుముట్టిన దుఃఖాలన్నీ తొలగిపోతాయి.

విశేషం: గృహస్థాశ్రమధర్మరక్షణకు కేంద్రబిందు వైన గృహిణియొక్క గొప్పతనాన్నిచెప్పే గొప్పతెలుగుపద్యం.

వ. మఱియు భార్య పురుషునం దర్ధం బగుటంజేసి పురుషునకు మున్న పరేత యైన పతివ్రత పరలోకంబునం దనపురుషుం గూడఁ దదాగమనంబు

ప్రతీక్షించుచుండుం; బురుషుండు మున్న పరేతుం డైనఁ బదంపడి తానును బరేత యై తనపురుషుం గూడ నరుగునట్టి భార్య నవమానించుట ధర్మవిరోధంబు; మఱియునుం బురుషుండు భార్యయందుఁ బ్రవేశించి గర్భంబునఁ బుత్త్రుండై తాన యుద్భవిల్లు గావున 'నఙ్గా దఙ్గా త్సమ్భవసి' యనునది యాదిగాఁగల వేదవచనంబులయందును జనకుండునుఁ బుత్త్రుండును ననుభేదంబు లేదు. **79**

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; భార్య= ఇల్లాలు; పురుషునందున్= మగనిలో; అర్ధంబు= సగం; అగుటన్+చేసి= కావటంచేత; పురుషునకున్; మున్ను+అ, పరేత, ఐన= మగనికంటె ముందే మరణించిన; పతివ్రత; పరలోకంబునన్= స్వర్గలోకంలోకూడ; తన, పురుషున్, కూడన్= తన భర్తతో కలియటానికి; తద్+ఆగమనంబు= అతడిరాకను; ప్రతీక్షించుచున్+ ఉండున్= ఎదురుచూస్తూ ఉంటుంది; పురుషుండు, మున్ను+అ, పరేతుండు+ఐనన్= భర్త ముందుగా చనిపోతే; పదంపడి= తరువాత; తానును, పరేత+ఐ= తానుకూడ చనిపోయినదై; తన, పురుషున్, కూడన్, అరుగునట్టి, భార్యను= తన మగనితో కలియుట కొరకు పోయే భార్యను; అవమానించుట= భంగపరచటం; ధర్మ, విరోధంబు= ధర్మానికి వ్యతిరేకం; మఱియునున్= ఇంతేకాక; పురుషుండు= భర్త; భార్యయందున్, ప్రవేశించి= భార్యలో ప్రవేశించి; గర్భంబునన్= గర్భధారణమార్గంలో; పుత్త్రుండు+ఐ= కుమారుడై; తాను+అ= తానే; ఉద్భవిల్లున్, కావునన్= పుట్టుతాడు కాబట్టి; అంగాత్+అంగాత్, సంభవసి= శరీరంనుండి పుట్టుతున్నావు; అను+అది, ఆదిగాన్+కల= అనే వాక్యం మొదలైన; వేదవచనంబుల+ అందును= వేదవాక్యాలలోకూడ; జనకుండునున్, పుత్త్రుండును, అను, భేదంబు, లేదు= తండ్రి అనీ, కొడుకనీ భేదం ఉండదు.

తాత్పర్యం: అంతేకాక, భార్య భర్తలో సగం కాబట్టి మగనికంటె ముందే చనిపోయిన పతివ్రత పరలోకంలోకూడ తనభర్తతో కూడిఉండా లని

అతడిరాకకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. భర్త ముందుగా చనిపోతే తానుకూడ వెనువెంట వెళ్లి భర్తను కూడుకొనే భార్యను అవమానించటం ధర్మవిరోధం. అంతే కాదు. భర్త భార్యయందు ప్రవేశించి గర్భంలో వసించి పుత్రుడై జన్మిస్తాడు కాబట్టి 'అంగాత్ అంగాత్ సంభవసి శరీరం నుండి పుట్టుతున్నావు ఇత్యాది వేదవాక్యంవల్ల కూడ తండ్రికొడుకులకు భేదం లేదు.

విశేషం: గృహస్థాశ్రమంలో పుత్త్రునియొక్క ప్రాధాన్యం 86 నుండి 91వ పద్యంవరకు చెప్పబడింది.

క. విను గార్హపత్య మను న ।
య్యనలము విహరింపఁబడి తదాహవనీయం
బున వెలుఁగునట్ల వెలుఁగును ।
జనకుఁడు దాఁ బుత్త్రుఁడై నిజద్యుతితోడన్. 80

ప్రతిపదార్థం: విను= తెలిసికొమ్ము!; గార్హపత్యము+అను, ఆ+ఆనలము= గార్హపత్యం అని పిలువబడే ఆ అగ్ని; విహరింపఁబడి= ప్రజ్వలింపచేయబడి; తద్+ ఆహవ నీయంబున= ఆ ఆహవనీయం అనే అగ్నిలో; వెలుఁగున్, అట్లు+అ= ఏవిధంగా వెలుగుతుందో ఆవిధంగా; జనకుఁడు= తండ్రి; తాన్= తానే; పుత్త్రుఁడు+ఐ= కుమారుడై; నిజ, ద్యుతితోన్= తనకాంతితో; వెలుగును= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: గార్హపత్యం అనబడే అగ్ని ప్రజ్వలింపబడి ఏవిధంగా ఆహవనీయంలో వెలుగొందుతుందో ఆవిధంగానే తండ్రి తానే పుత్రుడై తన ప్రకాశంతో వెలుగొందుతాడు. దీనిని తెలిసికొనుము.

విశేషం: అలం: ఉపమ. గృహస్థు నిత్యాగ్నిహోత్రం చేసికొనటానికి ఆరిపోకుండా రక్షించుకొనే అగ్ని గార్హపత్యాగ్ని, వైశ్వదేవాది క్రియలు ఆచరించటానికి గార్హపత్యాగ్నినుండి గ్రహించి క్రియాసమాప్తివరకు హోమం చేయటానికి ఉపయోగించే అగ్ని ఆహవనీయాగ్ని, గార్హపత్యంలోని అగ్నియే ఆహవనీయంలో వెలుగొందుతుంది కాబట్టి తండ్రి తనువునుండి పుత్రుడు పుట్టి ప్రకాశిస్తాడని భావం.

క. తాన తననీడ నీళ్ళు ల ।
లో నేర్పడఁ జూచునట్లు లోకస్తుత! త
త్సూను జనకుండు సూచి మ ।
హానందముఁ బొందు నతిశయప్రీతి మెయిన్. 81

ప్రతిపదార్థం: లోకస్తుత= లోకులచేత కీర్తింపబడినవాడా! దుష్యంతా!; తాను+అ= తానే; తన, నీడన్; నీళ్ళులలోన్= నీళ్ళల్లో, ఏర్పడన్= స్పష్టంగా; చూచున్+అట్లు= చూచేవిధంగా; జనకుండు= తండ్రి; తద్+సూను= అతని కుమారుడిని; చూచి; అతిశయ, ప్రీతిమెయిన్= మిక్కిలి సంతృప్తితో, మహత్+ఆనందమున్= గొప్పదైన ఆనందాన్ని; పొందును= పొందుతాడు.

తాత్పర్యం: రాజా! పురుషుడు నీళ్ళలో తననీడ తాను స్పష్టంగా చూచినవిధంగా తండ్రి కొడుకును చూచి మిక్కిలి సంతృప్తితో మహదానందాన్ని పొందుతాడు.

విశేషం: అలం: ఉపమ. పరమాత్మకు జీవాత్మకు బింబప్రతిబింబ భావం అద్వైతంలో చెప్పబడినట్లు ఇక్కడ తండ్రికొడుకులకు బింబప్రతిబింబ భావం చెప్పబడింది. తత్త్వతః రెండూ ఒకటే అని భావం.

వ. 'పున్నామ్నో నరకాత్త్రాయత ఇతి పుత్త్ర' యను వేదవచనంబు గలదు గావునఁ బుణ్యాచారుం డయిన పుత్త్రుం డుభయపక్షంబులవారి నుద్ధరించుఁ; గావున. 82

ప్రతిపదార్థం: పుత్+నామ్న; నరకాత్ - త్రాయతే+ఇతి, పుత్త్రః - 'పుత్' అనే పేరు కల నరకంనుండి కాపాడుతాడు కాబట్టి పుత్త్రుడు అనబడతాడు; అను, వేదవచనంబు; కలదు; కావునన్; పుణ్య+ఆచారుండు+అయిన, పుత్త్రుండు= పవిత్రమైన నడవడిక కలవాడైన పుత్రుడు; ఉభయ, పక్షంబుల, వారినిన్= రెండుప్రక్కలవారిని (ఇటుతండ్రి పక్షంవారిని అటు తల్లిపక్షం వారిని); ఉద్ధరించున్= ఉత్తమలోకాలను కలిగిస్తాడు (పైకెత్తుతాడు); కావున.

తాత్పర్యం: పుత్ అనే పేరుగల నరకంనుండి తల్లిదండ్రులను కాపాడుతాడు కాబట్టి పుత్రుడు అనే పేరు ఏర్పడింది అని వేదం చెప్పింది. కాబట్టి ఉత్తమ శీలుడైన పుత్రుడు తల్లిదండ్రుల ఉభయవంశాలవారిని ఉద్ధరిస్తాడు కాబట్టి.

విశేషం: పుత్రుడి మహిమ తెలియటానికి ఈపర్వంలోని జరత్కారు వృత్తాంతం, పాండురాజత పోవన వృత్తాంతాలు చదువవచ్చును.

క. **నీ పుణ్యతనువు వలనన ।**
యీపుత్త్రకుఁ డుద్భవిల్లి యెంతయు నొప్పున్
దీపంబువలన నొండొక ।
దీపము ప్రభవించినట్లు తేజం బెసఁగన్. **83**

ప్రతిపదార్థం: దీపంబు వలనన్= ఒక దీపంవలన; ఒండు+ఒక, దీపము= మరొకదీపం; తేజంబు+ఎసఁగన్= వెలుగొందగా; ప్రభవించిన+అట్లు= పుట్టినట్లు; నీ, పుణ్య, తనువు, వలనన్+అ= నీపవిత్రమైన శరీరంవలన నుండియే; ఈపుత్త్రకుఁడు= ఈ కొడుకు (భరతుడు); ఉద్భవిల్లి= పుట్టి; ఎంతయున్+ఒప్పున్= ఎంతగానో ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: ఒక దీపంనుండి మరొకదీపం పుట్టి వెలుగొందినట్లు నీ పుణ్యశరీరంనుండి ఈపుత్రుడు పుట్టి ప్రకాశిస్తున్నాడు.

విశేషం: అలం: ఉపమ. దీపంనుండి దీపం పుట్టటంతో తండ్రితనువునుండి పుత్రుడు పుట్టటం పోల్చబడింది. వెలిగించిన దీపం ఆకృతి కోల్పోయేది లేదు, వన్నెతగ్గేది లేదు. వెలిగినదీపం వెలిగించిన దీపంలాగానే ఆకృతిలో తేజస్సులో సమంగా ప్రకాశిస్తుంది. రూపాంతరం పొందినా రూపసామ్యం తండ్రిపుత్రులలో ఉంటుందని చెప్పే ఉపమ ఇది.

మ. **విపరీతప్రతిభాష లేమిటికి నుర్వీనాథ! యీ పుత్త్రగా**
త్రపరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహార కర్పూర సాం

ద్రపరాగ ప్రసరంబుఁ జందనముఁ జంద్రజ్యోత్స్నయుం బుత్త్రగా
త్రపరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే. **84**

ప్రతిపదార్థం: ఉర్వీనాథ= భూమియొక్క పతివైన ఓరాజా!; విపరీత, ప్రతిభాషలు, +ఏమిటికిన్?= విరుద్ధాలైన మారుమాటలు ఎందుకు? (అటువంటి మాటలు చెప్పబోకు మనిభావం); ఈ, పుత్త్ర, గాత్ర, పరిష్వంగ, సుఖంబు= ఈ కుమారుడియొక్క శరీరాన్ని కౌగిలించుకొనటంవలని హాయిని; చేకొనుము= స్వీకరించుము(అనుభవింపుమని భావం); ముక్తా, హార, కర్పూర, సాంద్ర, పరాగ, ప్రసరంబున్= ముత్యాలహారాలున్నూ, పచ్చకర్పూరపు దట్టమైన పొడియొక్క వ్యాపనమున్నూ (పచ్చకర్పూరపు మైపూత అనిభావం); చందనమున్= మంచిగంధమున్నూ; చంద్రజ్యోత్స్నయున్= వెన్నెలయున్నూ; జీవులకున్= ప్రాణులకు; పుత్త్ర, గాత్ర, పరిష్వంగము+అట్లు= కుమారుడి శరీరాన్ని కౌగిలించుకొన్నట్లు; హృద్యంబు+ఏ= మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించునా?; కడున్, శీతమే= మిక్కిలి చల్లదనంగా ఉండునా? (ఉండదని భావం).

తాత్పర్యం: ఓరాజా! విరుద్ధాలైన మారుమాటలు ఎందుకు? ఈపుత్రుడిని కౌగిలించుకొని ఈతడి కౌగిలివలన కలిగే సుఖాన్ని అనుభవించుము. ముత్యాలహారాలూ, పచ్చకర్పూరపు దట్టమైన పొడి ప్రసారం, మంచిగంధమూ, వెన్నెలయూ జీవులకు పుత్రునికౌగిలివలె మనసుకు సుఖాన్నీ, మంచి చల్లదనాన్నీ కలిగించలేవు.

విశేషం: అలం: వ్యతిరేకం. స్పర్శసిద్ధాంతాన్ని ప్రతిపాదించే ఈపద్యం నన్నయగారి సూక్తిమధురమైన కవిత్వానికి ఉత్తమ ఉదాహరణంగా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందింది. ఇందులో నన్నయ ఎన్నుకొన్న ఉపమాద్రవ్యాలన్నీ అమూలకాలే.

క. **అనఘుఁడు వంశకరుండై ।**
పెనుపున నీసుతుఁడు వాజపేయంబులు నూ
టొనరించు నని సరస్వతి ।
వినిచె మునులు వినఁగ నాకు వినువీథిదెసన్. **85**

ప్రతిపదార్థం: నీసుతుఁడు= నీకొడుకు; అనఘుఁడు= పాపరహితుడున్నూ; వంశకరుండు+ఐ= వంశకర్తయున్నూఅయి; పెనుపునన్= గొప్పతనంతో; వాజపేయంబులు, నూరు,+ఒనరించున్+అని= వాజపేయంఅనేపేరుగల యజ్ఞాలను నూరింటిని చేస్తాడని; వినువీథి, దెసన్= ఆకాశమార్గంలో; సరస్వతి= (ఆకాశ)వాణి; మునులు, వినఁగన్= ఋషులందరూ వినేటట్లు; నాకున్= నాకు (శకుంతలతో); వినిచెన్= చెప్పింది.

తాత్పర్యం: 'పుణ్యాత్ము డైన నీకుమారుడు వంశకర్తయై పూనికతో నూరువాజపేయ యాగాలను చేస్తా' డని ఆకాశవీధిలో సరస్వతి (ఆకాశవాణి) మునులందరూ వినేటట్లుగా నాతో చెప్పింది.

విశేషం: నన్నయ ఈ వివరాలు భరతుడు పుట్టిన ఘట్టంలో చెప్పలేదు. దుష్యంతుడి నిండుసభలో చెప్పించాడు. ఇది కథాకథన కళ. ఆకాశవాణిచేత పొగిడించుకొనినవాడు మహాత్ముడు ఔతాడనీ, ఆకాశవాణి భవిష్యద్వాణిగా సత్యమే చెపుతుందనీ అందరి విశ్వాసం. శకుంతల చెప్పిన ఆకాశవాణి సత్యకథనాన్ని దుష్యంతుడు నమ్మడు; అది పరోక్షప్రమాణం కావటంచేత. భావికథలో తన సభలోనే ఆకాశవాణి పలికినప్పుడు ప్రత్యక్షప్రమాణమని నమ్మాడు. ఆకాశవాణి ద్వయ ప్రయోగం వస్తుశిల్పం. ఈ సన్నివేశంలో తులనాత్మక శిల్పానుశీలనంవలన వస్తుధ్వని రాణిస్తున్నది.

క. భూరిగుణు నిట్టి కులవి ।
స్తారకు దారకు నుదారధర్మప్రియ! ని
ష్కారణమ తప్పఁజూడఁగ ।
సారమతీ! చనునె నాఁటి సత్యము గలుగన్. 86

ప్రతిపదార్థం: ఉదార, ధర్మ, ప్రియ= ఉత్తమ మైన ధర్మమునందు ప్రీతికల వాడా!; సారమతీ= సారవంత మైన బుద్ధికలవాడా!; నాఁటి, సత్యము, కలుగన్= ఆ వివాహంనాడు (దుష్యంతుడు) ఇచ్చిన వరమనే సత్యం వాస్తవమై ఉండగా; భూరి, గుణున్= అనేక గుణాలు కలవాడిని; ఇట్టి= ఇటువంటి (ఆకాశవాణి కీర్తించినటువంటి); కుల, విస్తారకున్= వంశాన్ని విస్తరించేవాడిని (వంశోద్ధారకుడిని); దారకున్= పుత్రుడిని (బాలకుడిని); నిష్కారణము+అ= కారణంలేకుండానే; తప్పన్, చూడఁగన్= కాదనటం (విముఖంగా చూడటం); చనునె= తగునా? (తగ దని భావం).

తాత్పర్యం: ఉత్తమధర్మప్రియా! సారమతీ! మనవివాహ మైననాడు నా కిచ్చిన వర మనే సత్యం నిలిచి ఉండగా, అపారగుణవంతుడు, వంశవిస్తారకుడు, అయిన పుత్రుడిని ఏకారణం లేకుండానే కాదనటం తగునా? (తగదు అని భావం).

విశేషం: ఉదారధర్మప్రియ! సారమతీ! అనీ శకుంతల దుష్యంతుడిని సంబోధించటం సాభిప్రాయం; ధర్మం తెలిసినవాడూ, వివేకం కలవాడూ పుత్రుడిని కాదన డని హెచ్చరింపు.

చ. నుతజలపూరితంబు లగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలు; మఱి బావులు నూఱిటికంటె నొక్కస
త్క్రతువది మేలు; తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు; త
త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు సూడఁగన్.87

ప్రతిపదార్థం: సూనృతవ్రత!= నిజము మాటాడటమే నియమంగా కలవాడా!; నుత, జల, పూరితంబులు+అగు= మంచినీటిచేత నిండినవైన; నూతులు= చేదుడుబావులు; నూఱిటికంటెన్= వందకంటె; ఒక, బావి, మేలు= ఒక దిగుడుబావి ఉత్తమం; మఱి; బావులు, నూఱిటికంటెన్= దిగుడుబావులు వందకంటె; ఒక్క, సత్+క్రతువు+అది, మేలు= ఒకమంచి యజ్ఞం ఉత్తమం; తద్+క్రతుశతంబున, కంటెన్= అటువంటి నూరు యజ్ఞాలకంటె; సుతుండు, మేలు= కొడుకు మేలు; తద్, సుత, శతకంబు, కంటెన్= అట్టి కొడుకులు వందమందికంటె; చూడఁగన్= పరిశీలించగా; ఒక సూనృత, వాక్యము, మేలు= ఒక సత్యవాక్యం ఉత్తమం.

తాత్పర్యం: సత్యవ్రతం గల ఓ రాజా! మంచినీటితో నిండిన చేదుడుబావులు నూరింటికంటె ఒక దిగుడుబావి మేలు; కాగా, బావులు నూరింటికంటె ఒక మంచియజ్ఞం మేలు; అటువంటి నూరుయజ్ఞాలకంటె ఒక పుత్రుడు మేలు. అట్టి పుత్రులు నూరుమందికంటె ఒక సత్యవాక్యం మంచిది.

విశేషం: అలం: సారాలంకారం. 'సూనృతవ్రత!' అన్న సంబోధనం సాభిప్రాయం. మాటతప్పిన దుష్యంతుడి ప్రవర్తనను ఎత్తిపొడిచేది. ఆగ్రహంలో కూడ శకుంతల ఔచిత్యం పాటించింది. గృహస్థాశ్రమధర్మంలో సంతానంకంటె సత్యం గొప్పదని తాత్పర్యం. దీనిని 95, 96 పద్యాలలోకూడా వివరించటం గమనించదగింది. ఉత్తరోత్తరాలకు ఉత్కర్ష చెప్పి వర్ణిస్తే సారాలంకారం. ఉత్కర్ష ఆకారంలో కాదు గుణంలో. ఇక్కడ పుణ్యంలో నూరు నూతులు త్రవ్వించిన పుణ్యంకంటె ఒక బావి త్రవ్వించిన పుణ్యం మిన్న. నూరు బావులు కట్టించిన పుణ్యంకంటె ఒక యజ్ఞంవలని పుణ్యం మేలు. నూరుయజ్ఞాల ఫలంకంటె ఒక కొడుకును పొందిన పుణ్యం మిన్న. నూర్గురు కొడుకులను కన్న పుణ్యంకంటె ఒక సత్యవాక్యం శ్రేష్ఠం. నూరు సంఖ్య అధికమైన ప్రమాణానికి గుర్తు. నన్నయ రుచిరార్థసూక్తికి ఇది మంచి ఉదాహరణం.

క. వెలయంగ నశ్వమేధం ।
బులు వేయును నొక్కసత్యమును నిరుగడలం
దుల నిడి తూఁపఁగ సత్యము ।
వలనన ములుసూపు గౌరవంబున పేర్మిన్. 88

ప్రతిపదార్థం: తులన్= త్రాసునందు; వెలయంగన్= ప్రకటమయ్యేటట్లు; అశ్వ మేధంబులు, వేయునున్= వేయి అశ్వమేధయాగాలు (ఒకవైపు)నూ; ఒక్క, సత్యమును= ఒక సత్యాన్ని మాత్రమే (రెండోవైపునూ); ఇరుగడలన్= రెండువైపులా; తులన్= త్రాసులో ఇడి=ఉంచి; తూఁపఁగన్= తూచగా; గౌరవంబున+పేర్మిన్= గురుత్వము నందలి ఆధిక్యంతో ॥బరువుయొక్క ఆధిక్యంతో సత్యము, వలనన= సత్యంవైపే; ములు, చూపున్= ముల్లు చూపుతుంది, మొగ్గుచూపుతుంది. (సత్యమే గొప్ప దని సూచిస్తుంది అని భావం).

తాత్పర్యం: ఒక త్రాసులో బాహాటంగా వేయి అశ్వమేధాల (ఫలాన్ని)ను ఒకవైపునా, ఒక్కసత్యాన్ని మాత్రమే మరొకవైపునా ఉంచి తూచగా సత్యంవైపు బరువువలన ములుచూపి (మొగ్గుచూపి) సత్యమే గొప్పదని నిరూపిస్తుంది.

విశేషం: కొన్నిప్రతులలో ఈపద్యంతరువాత మరొక కందపద్యం అధికంగా కనబడుతున్నది. అది- ''క. విను సత్యాలాపమునకు। మనుజేంద్ర! శతాశ్వమేధమహితఫలంబుల్ । గొనకొని చూచిన సరిగా । వనయంబును నిట్లు వలుకు నాగమఫణితుల్''. తాత్పర్యంలో ఈపద్యంకంటె విశేషం లేకపోవటంచేత ఆపద్యం లేకపోయినా సందర్భంలో ఎటువంటి లోపమూ కానరాదు.

తే. సర్వతీర్థాభిగమనంబు సర్వవేద ।
సమధిగమము సత్యంబుతో సరియుఁగావు
ఎఱుఁగు మెల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద ।
యండ్రు సత్యంబు ధర్మజ్ఞు లైన మునులు. 89

ప్రతిపదార్థం: సర్వ, తీర్థ+అభిగమనంబు= సమస్త తీర్థాలకు పోవటం; సర్వ, వేద, సమధిగమము= వేదాలనన్నింటిని అధ్యయనం చేయటం; సత్యంబుతోన్, సరియున్, కావు= సత్యంతో సాటి కావు; ధర్మజ్ఞులు+ఐన, మునులు= ధర్మం బాగా తెలిసిన ఋషులు; ఎందున్= ఎప్పుడైనా, ఎక్కడైనా; సత్యంబు= సత్యం; ఎల్ల, ధర్మంబులకున్= ధర్మాలన్నింటికంటె; పెద్ద, అండ్రు= గొప్పది అంటారు; ఎఱుఁగుము= తెలిసికొనుము, గమనించుము.

తాత్పర్యం: తీర్థా లన్నింటినీ సేవించటం, వేదాల నన్నింటినీ అధ్యయనం చేయటం సత్యంతో సాటికావు. ధర్మం బాగాతెలిసిన ఋషులు ఎల్లప్పుడు అన్నిధర్మాలకంటె సత్యమే గొప్పదని అంటారు. దీన్ని గమనించుము.

విశేషం: గృహస్థాశ్రమధర్మాలన్నింటిలో సత్యమే శ్రేష్ఠమని భావం. "సత్యమేవేశ్వరో లోకే । సత్యే ధర్మః ప్రతిష్ఠితః । సత్యమూలాని సర్వాణి । సత్యాన్నాస్తి పరం పదం'' అని పురాణోక్తి. లోకంలో సత్యమే ఈశ్వరుడు; సత్యంలోనే ధర్మం నిత్యంగా నిలిచి ఉంటుంది; సర్వజగత్తుకూ సత్యమే మూలం; సత్యంకంటె ఉత్తమపదం మరొకటి లేదు. సత్యమంటే సత్యావాక్య మనీ, నిత్య(సత్య)మనీ రెండర్థాలున్నాయి. ఆ రెండూ ఈ సందర్భంలో గృహస్థాశ్రమపరంగా అన్వయిస్తాయి.

క. కావున సత్యము మిక్కిలి ।
గా విమలప్రతిభఁ దలఁచి కణ్వాశ్రమ సం
భావిత సమయస్థితి దయఁ ।
గావింపుము; గొడుకుఁ జూడు కరుణా దృష్టిన్. 90

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; విమల, ప్రతిభన్= నిర్మలమైన బుద్ధితో; సత్యమున్= సత్యాన్ని; మిక్కిలిగాన్= గొప్పదానినిగా; తలఁచి= భావించి; కణ్వ+ఆశ్రమ, సంభావిత, సమయస్థితి= (నీవు) కణ్వాశ్రమంలో చేసిన ప్రతిజ్ఞను; దయన్= దయతో; కావింపుము= నెరవేర్చుము; కొడుకున్=(నీ) కొడుకును (భరతుడిని); కరుణాదృష్టిన్= దయాభావంతో; చూడుము= చూడుము (మన్నించుము).

తాత్పర్యం: కాబట్టి, నిర్మల మైన బుద్ధితో సత్యం గొప్పదిగా భావించి, కణ్వమహర్షిఆశ్రమంలో నీవు చేసిన ప్రతిజ్ఞను దయతో నెరవేర్చుము. నీ కొడుకును దయతో చూడుము.

విశేషం: గృహస్థాశ్రమధర్మంలో సత్యంచేత సర్వార్థసాధనం చేయవచ్చని భావం.

క. క్షత్త్రవరుఁ డైన విశ్వా ।
మిత్త్రునకుఁ బవిత్ర యైన మేనకకున్ స
త్పుత్త్రి నయి బొంకు వలుకఁగ ।
ధాత్రీతలనాథ! యంత ధర్మేతరనే? 91

ప్రతిపదార్థం: ధాత్రీతలనాథ= ఓరాజా!; క్షత్త్రవరుఁడు+ఐన= క్షత్త్రియులలో ఉత్తముడయిన; విశ్వామిత్త్రునకున్= విశ్వామిత్రుడికిన్నీ; పవిత్ర+ఐన= పవిత్రురాలు అయిన; మేనకకున్= మేనకకున్నూ; సత్+పుత్త్రిన్+అయి; యోగ్యురాలైన కుమార్తె నయి; బొంకు, పలుకఁగన్= అబద్ధ మాడటానికి; అంత, ధర్మ+ఇతరనే?= నేను అంత అధర్మపరురాలనా? (కానని భావం).

తాత్పర్యం: ఓరాజా! క్షత్త్రియులలో ఉత్తము డైన విశ్వామిత్రుడికీ, పవిత్రురా లైన మేనకకూ యోగ్యురా లైన కుమార్తె నయిన నేను అబద్ధమాడటానికి అంత అధర్మపరురాలను కాను.

వ. అనిన శకుంతల పలుకులు సేకొన నొల్లక దుష్యంతుం డి ట్లనియె. 92

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: పైవిధంగా పలికిన శకుంతలయొక్క మాటలను దుష్యంతుడు అంగీకరించక ఈవిధంగా అన్నాడు.

క. ఏ నెట? నీ వెట? సుతుఁ డెట? ।
యే నెన్నఁడు తొల్లి చూచి యెఱుఁగను నిన్నున్;
మానిను లసత్యవచనలు ।
నా నిట్టు లసత్యభాషణం బుచితంబే? 93

ప్రతిపదార్థం: ఏన్+ఎట= నేను ఎక్కడ?; నీవు+ఎట= నీవు ఎక్కడ?; సుతుఁడు+ఎట= కుమారుడు ఎక్కడ; ఏన్= నేను; నిన్నున్= నిన్ను (శకుంతలను); తొల్లి= పూర్వం; ఎన్నఁడున్= ఏరోజునా, ఎప్పుడూ; చూచి, ఎఱుఁగను= చూడలేదు (చూచినట్లు జ్ఞాపకం లేదు); మానినులు= ఆడువారు; అసత్య, వచనలు, నాన్= అబద్ధాలు ఆడుతారు అన్నట్లుగా; ఇట్టులు= ఈవిధంగా; అసత్యభాషణంబు= అబద్ధాలు ఆడటం; ఉచితంబు+ఏ= తగునా? (తగదని భావం).

తాత్పర్యం: నే నెక్కడ? నీ వెక్కడ? కుమారు డెక్కడ? ని న్నింతకుపూర్వం ఏనాడూ చూచి ఎఱుగను. 'ఆడువారు అబద్ధా లాడుతారు' అన్నట్లుగా ఈవిధంగా అసత్యం పలకటం నీకు తగునా? (ఉచితం కాదు).

విశేషం: 'అసత్యవచనా నార్యః' అని మూలం, దీనిని నన్నయ ఔచిత్యవంతంగా తెలుగుచేశాడు. 'స్త్రీలు అసత్యవచనలు నాన్' -అనటంలో ఆ విశేషం ఉంది. ఆడువారు అసత్యాలు మాట్లాడుతారు అన్న నిశ్చితార్థం కాకుండా, ఆడువారు అబద్ధాలు చెపుతారేమో అన్నపేరు నీవలన వచ్చేటట్లుగా (నాన్= అనగా) అని చెప్పటం ఔచిత్యం. స్త్రీజాతికి అపకీర్తి తేవద్దు అనే హెచ్చరిక ఇందులో గమ్యం. మరొక విశేషాన్ని శ్రీమదాంధ్రమహాభారతం సంశోధితముద్రణం పేర్కొన్నది." క. వనకన్యకయఁట నేనఁట । వనమున గాంధర్వమున వివాహంబఁట నం । దనుఁ గనెనట, మరచితినఁట । వినఁగూడునె యిట్టిభంగి విపరీతోక్తుల్' - ఈపద్యము ఆదిపర్వమున నున్న దని అప్పకవి వ్రాసియున్నాడు- ఈపద్యము పినవీరభద్రుని శృంగారశాకుంతలములో నున్నది. అయినచో నిచ్చోటనే యుండఁబోలు. (ప్రథమసంపుటం - పుట. 204 (అధస్సూచి). దుష్యంతుడు ఈ మాటలన్న తరువాత శకుంతలనూ మేనకా విశ్వామిత్రులనూ, అనౌచిత్యంతోకూడిన నిందావాక్యాలతో అధిక్షేపించినట్లు సంస్కృతభారతంలో ఉన్నది. నన్నయ ఆ మాటలన్నీ వదలి శకుంతల సచ్ఛీలాన్ని వ్యక్తం చేశాడు.

క. పొడవునఁ బ్రాయంబునఁ గడుఁ।
గడిఁది బలంబునను జూడఁగా నసదృశునీ
కొడు కని యీతని నెంతయు।
నెడమడుగుగఁ జూపఁ దెత్తె యిందఱు నగఁగన్. 94

ప్రతిపదార్థం: ఈతనిన్= ఇతనిని (భరతుడిని); చూడఁగాన్= పరిశీలించగా; పొడవునన్= ఆకారంచేత; ప్రాయంబునన్= వయస్సులోనూ, కడున్, కడిఁది, బలంబునను= అమితమైన బలంలోనూ; అసదృశున్= సాటిలేనివాడిని; నీకొడుకు+అని= నీయొక్క కుమారుడు, అని; ఎంతయున్, ఎడమడుగుగన్= ఎంతయో విరుద్ధంగా; ఇందఱున్= ఇంతమంది; నగఁగన్= నవ్వేటట్లు, ఎగతాళిచేసేటట్లు; చూపన్= నాకు చూపించటానికి; తెత్తె= తెస్తావా?

తాత్పర్యం: చూడంగానే రూపంలోనూ, వయస్సులోనూ అధికమైన బలంలోనూ సాటిలేనివాడుగా కనబడుతున్న ఇతడిని 'నీకొడుకు' అని ఎంతో విరుద్ధంగా అందరూ నవ్వేటట్లు నాకు చూపటానికి తీసికొనివచ్చావా?

వ. 'ఇట్టి లోకవిరుద్ధంబుల కే మోడుదు; మయుక్తంబు లయిన పలుకులు పలుకక నీయాశ్రమంబునకుం బొ' మ్మనిన శకుంతల యత్యంతసంతాపితాంతఃకరణ యై. 95

ప్రతిపదార్థం: ఇట్టి= ఇటువంటి; లోక, విరుద్ధంబులకున్= వాస్తవానికి వ్యతిరేకంగా ఉండేవాటికి; ఏము= మేము (నేను అనే సర్వనామానికి గౌరవవాచక బహువచనం); ఓడుదుము= భయపడతాము, జంకుతాము (అంగీకరించమని భావం); అయుక్తంబులు+ అయిన= తగనివి అయిన; పలుకులు, పలుకక= మాటలు మాటాడక; నీ, ఆశ్రమంబునకున్+పొమ్ము+ అనినన్= నీయొక్క ఆశ్రమానికి తిరిగిపొమ్ము అని అనగా; శకుంతల; అత్యంత, సంతాపిత+అంతఃకరణ+ఐ= మిక్కిలి తపింపబడిన హృదయం కలిగినదై.

తాత్పర్యం: ఇటువంటి లోకవాస్తవ వ్యతిరేకాంశాలను మేము అంగీకరించం. తగనిమాటలు పలుకక నీవు నీ ఆశ్రమానికి తిరిగిపొమ్ము - అని దుష్యంతుడు పలుకగా శకుంతల మనస్సులో అధికంగా సంతాపాన్ని పొందినదై.

మధ్యాక్కర.

'తడయక పుట్టిననాఁడ తల్లిచేఁ దండ్రిచే విడువఁ
బడితి; నిప్పుడు పతిచేతను విడువఁబడియెదనొక్కొ!
నుడువులు వేయు నిం కేల? యిప్పాటినోములు తొల్లి
కడఁగి నోఁచితిని గా కేమి' యనుచును గందె డెందమున. 96

ప్రతిపదార్థం: పుట్టిననాఁడు+అ= పుట్టిననాడే; తడయక= ఆలస్యంకాక; తల్లిచేన్, తండ్రిచేన్= తల్లిచేత (మేనకచేత), తండ్రిచేత (విశ్వామిత్రుడిచేత) విడువఁబడితిన్= వదలివేయబడినాను; ఇప్పుడు; పతిచేతను= భర్తచేతకూడ; విడువఁబడియెదన్+ఒక్కో= వదలబడతానో ఏమో!; ఇంకన్+ఏల= మరింకెందుకు; నుడువులు, వేయున్= వేయి (పెక్కు)మాటలు; ఈ+పాటి, నోములు= ఇంతటి (ఫలాన్ని ఇచ్చే) నోములు పూజలు; తొల్లి= పూర్వం; కడఁగి= పూనుకొని; నోచితిని, కాక+ఏమి= నోచాను కాబోలు; అనుచును; డెందమునన్= హృదయంలో; కందెన్= దుఃఖించింది, బాధపడింది.

తాత్పర్యం: 'పుట్టిననాడే వెంటనే తల్లిదండ్రులచేత ఆ నాడు విడువబడినాను. ఇప్పుడు భర్తచేతకూడ విడువబడతాను కాబోలు; ఇక వేయి(పెక్కు)మాట లాడట మెందుకు? పూర్వం ఇటువంటి కొరనోములే నోచాను కాబోలు. అని శకుంతల మనసులో బాధపడింది.

విశేషం: మధ్యాక్కర పాదంలో వరుసగా రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం, రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం ఉంటాయి. నన్నయ అయిదవ గణం మొదటి అక్షరంతో యతి పాటించాడు. ప్రాస నియమం ఉన్నది. ఈపద్యంలో ఒక్క 'పతి' అనే శబ్దం తప్ప మిగిలిన వన్నీ తెలుగు మాటలే. శోకభావాని కనుగుణమైన వృత్తాన్ని, రచనను, వాక్యాలను ఇందులో నన్నయ ప్రయోగించాడు.

వ. ఇట్లు దద్దయు దుఃఖించి విగతాశయై బోరనఁదొరఁగు బాష్పజలంబు లందంద యొత్తికొనుచు 'నింక దైవంబ కాని యొండు శరణంబు లేదని యప్పరమ పతివ్రత తనయుందోడ్కొనిక్రమ్మఱిపోవ నున్న యవసరం బున. 97

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; తద్దయున్= మిక్కిలి; దుఃఖించి= ఏడ్చి; విగత+ఆశ+ఐ= వదలబడిన ఆశలు కలదై; బోరనన్= ఎడతెరపిలేకుండ; తొరఁగు= కారు; బాష్పజలంబులు= కన్నీళ్ళు; అందు+అందు+అ= అక్కడికక్కడే; ఒత్తికొనుచున్= చెంగుతోఅద్దుకొంటూ; ఇంకన్= ఇకపై; దైవంబు+అ, కాని= దేవుడే తప్ప; ఒండు, శరణంబు, లేదు+అని= మరొకదిక్కు లేదని; ఆ+పరమపతివ్రత= ఆ గొప్ప ఇల్లాలు; తనయున్+ తోడ్కొని= కొడుకును వెంటబెట్టుకొని; క్రమ్మఱిపోవన్+ఉన్న, అవసరంబునన్= తిరిగిపోబోతున్న సమయంలో.

తాత్పర్యం: ఈవిధంగా మిక్కిలి యేడ్చి, ఆశలు వదలుకొని, ఎడతెరపిలేకుండ కారే కన్నీళ్ళను అప్పుడప్పుడు ఒత్తుకొంటూ, ఇకపై నాకు దైవమే శరణ్యమని భావించి, ఆ ఉత్తమపతివ్రత కొడుకును వెంటబెట్టుకొని తిరిగిపోబోతున్న సమయంలో.

విశేషం: 'అన్యథా శరణం నాస్తిత్వమేవ శరణం మమ' వంటి భక్తిభావం శకుంతల ప్రదర్శిస్తున్నది కాబట్టి దైవరక్షణం కలుగుతుందని భావికథార్థధ్వని.

దివ్యవాణి నాకర్ణించి దుష్యంతుఁడు శకుంతలను గ్రహించుట (సం. 1-69-28)

చ. 'గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు; సే
కొని భరియింపు మీతని; శకుంతల సత్యము వల్కె ,సాధ్వి, స
ద్వినుత, మహాపతివ్రత వివేకముతో' నని దివ్యవాణి దా
వినిచె ధరాధినాథునకు విస్మయ మందఁగఁ దత్సభాసదుల్. 98

ప్రతిపదార్థం: గొనకొని= అతిశయించి; వీఁడు= ఇతఁడు (భరతుడు); నీకును, శకుంతలకున్, ప్రియనందనుండు= నీకూ శకుంతలకూ (పుట్టిన) ముద్దుబిడ్డడు; ఈతనిన్= ఈపుత్రుడిని; చేకొని= స్వీకరించి; భరియింపుము= పోషించుము; సాధ్వి= ఇల్లాలు; సత్+వినుత= ఉత్తములచేత కీర్తింపబడినట్టి; మహాపతివ్రత= గొప్పపతివ్రత; (అయిన) శకుంతల; వివేకముతోన్= తెలివితో; సత్యము, పల్కెన్= నిజం చెప్పింది (గసడదవాదేశం); అని; తద్, సభా+ఆసదుల్= ఆ సభలో ఉన్నవారు; విస్మయము+అందఁగన్= ఆశ్చర్యపడగా; దివ్యవాణి= దేవతాసంబంధమైన వాణి, ఆకాశవాణి;

ధరా+అధినాథునకున్= భూపతికి, రాజుకు (దుష్యంతుడికి); వినిచెన్= వినిపించింది.

తాత్పర్యం: 'ఈభరతుడు నీకూ శకుంతలకూ మిక్కిలి ముద్దుబిడ్డడు. ఈతనిని స్వీకరించి, పోషించుము. ఇల్లాలు, ఉత్తమకీర్తి కలిగింది, మహాపతివ్రత అయిన శకుంతల వివేకంతో నిజం చెప్పింది' - అని ఆకాశవాణి ఆ సభలోనివారు విని ఆశ్చర్యపడేటట్లు రాజుకు వినిపించింది. (ప్రకటించింది).

విశేషం: కథానిర్వహణంలో అంతంలో అద్భుతరసం ఉండాలని లక్షణవాక్యం. సభాసదులు విస్మయ మందేటట్లు ఆకాశవాణి పలకటంవలన అది సిద్ధించింది. ఇందులో స్వతస్సిద్ధంగా ఏర్పడిన అర్థశక్తివలన కలిగిన వస్తువు చేసే వస్తుధ్వని (స్వతస్సంభవ్యర్థ శక్త్యుద్భవ వస్తుకృత వస్తుధ్వని) ఉన్నది. 'ఏ నెట? నీ వెట? సుతు డెట? ఏ నెన్నఁడు తొల్లి చూచి యెఱుఁగను నిన్నున్' - అన్న దుష్యంతుడి మాటలకు పరోక్ష సమాధానం దివ్యవాణి సాక్ష్యం. పురుషుడి వృత్తాన్ని గమనిస్తూ ఉండే మహాపదార్థాలలో శబ్దగుణం కలిగిన ఆకాశం సాక్ష్యం పలకటం అద్భుతం. ఔచిత్యం. అమూర్తమైన ఆకాశవాణికి మానవీకరణం వస్తుకళావిశేషం. 'గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు' అనే వాక్యంలో దుష్యంతుడి ఆక్షేపాలన్నీ నిరాకరింపబడ్డాయి. తల్లిదండ్రులకు ప్రియనందనుడు భరతుడు అని పేర్కొనటంలో శకుంతలకు వలెనే దుష్యంతుడికికూడా భరతుడు ప్రీతిపాత్రుడే అయినా రాజు కావాలని ఆ సత్యాన్ని దాస్తున్నాడని ధ్వని. 'కొడుకును స్వీకరింపు' మనేది ధర్మప్రబోధం. 'శకుంతల సత్యం చెప్పింది' అనటంలో దుష్యంతుడు అబద్ధం చెప్పాడని తేలిన తాత్పర్యం. శకుంతల వివేకవతి. ఆమె తన ఉపన్యాసంలో క్రమంగా గృహిణి గొప్పతనాన్ని చెప్పి సాధ్వి అనిపించుకొన్నది. చక్రవర్తికాబోయే కొడుకు గొప్పతనాన్ని వివరించి సద్వినుత అనిపించు కొన్నది. దుష్యంతుడిని ఇంత సుకుమారంగా మందలించి సత్యాన్ని ప్రతిష్ఠాపించిన ఆకాశవాణి మాటలుకూర్చిన ఈరచనలో సౌకుమార్య మనే శబ్దగుణం సార్థకంగా పోషింపబడింది. పరుషవాక్యాలతో తిరస్కరించిన దుష్యంతుడికి దివ్యవాణి

సుకుమారంగా ధర్మాన్ని నిర్దేశించింది. దానిని వస్తుధ్వనితో నిర్వహించటం నన్నయ రచానాశిల్పం.

వ. ఇ ట్లెల్లవారలకు నతిహర్షంబుగా శకుంతల పతివ్రతాత్వంబును సత్యంబును భరతోత్పత్తియుఁ బ్రశంసించు వేలుపుల పలుకు లతివ్యక్తంబు లయి యాకాశంబువలన వీతెంచిన విని దుష్యంతుండు సభాసదులు విన ని ట్లనియె. 99

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అతి, హర్షంబుగాన్= మిక్కిలి సంతోషంతో; శకుంతల, పతివ్రతాత్వంబును= శకుంతలయొక్క పాతివ్రత్యాన్ని గురించి; సత్యంబును= సత్యాన్ని గురించి; భరత+ఉత్పత్తియున్= భరతునియొక్క పుట్టుకను గురించి; ప్రశంసించు, వేలుపుల, పలుకులు= కీర్తించే దేవతల మాటలు; అతి, వ్యక్తంబులు+ అయి= మిక్కిలి స్పష్టంగా; ఆకాశంబువలనన్= ఆకాశంనుండి; వీతెంచినన్= రాగా; దుష్యంతుండు; విని; సభాసదులు; వినన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా శకుంతల పాతివ్రత్యాన్ని గురించి, సత్యాన్ని గురించి, భరతుడి పుట్టుకను గురించి మిక్కిలి సంతోషంతో కీర్తించే దేవతలమాటలు, విస్పష్టంగా ఆకాశంనుండి వెలువడగా దుష్యంతుడు విని సభాసదులతో ఈవిధంగా అన్నాడు.

విశేషం: ఆకాశవాణితోపాటు దేవతల మాటలు వినబడటం ఈ కథలోని విశేషం. అపూర్వంకూడా, గృహస్థాశ్రమ వ్యవస్థలో ఇల్లాలు, కొడుకు, సత్యం అనే అంశాలు యజమానుడు (గృహస్థుడు) అనే ఒక్కరిచేత వంచింపబడితే ధార్మికంగా, ఆధ్యాత్మికంగా ప్రకృతిలో ఎంత సంక్షోభం కలుగుతుందో ఈ సన్నివేశంలో నన్నయ వస్తుధ్వని నాశ్రయించి ప్రపంచించాడు. దేవతలు శకుంతలను, భరతుడిని, సత్యాన్ని గురించి ప్రశంసించిన వాక్యాలు సభలో ఉన్నవారందరికీ హర్షాతిశయం కలిగించినట్లు నన్నయ పేర్కొనటంతో అంతటి నిండుసభలో దుష్యంతు డొక్కడే

దోషిగా మిగిలి పోయాడని చెప్పక తెలుస్తున్న విశేషం. ఈ ముగింపు ఎంత గొప్పగా ఉన్నది! 'ధర్మో రక్షతి రక్షితః' అన్న వేదోక్తి సార్థక మైనది.

తే. ఏను నీ యింతియును గాని యెఱుఁగ రన్యు।
లర్థిఁ గణ్వమహాముని యాశ్రమంబు
నందు గాంధర్వవిధి వివాహమునఁ గరము।
నెమ్మిఁ జేసిన దీని పాణిగ్రహణము. 100

ప్రతిపదార్థం: అర్థిన్= కోర్కెతో; కణ్వ, మహత్+ముని, ఆశ్రమంబునందున్; గాంధర్వ, విధిన్, వివాహమునన్= గాంధర్వ పద్ధతిలో చేసికొనే పెండ్లి; కరమున్, నెమ్మిన్= మిక్కిలి ప్రీతితో; చేసిన, దీని, పాణిగ్రహణము= చేసికొన్న ఈమెతోడి వివాహం; ఏనున్= నేనున్నూ (దుష్యంతుడున్నూ); ఈ+ఇంతియునున్= ఈ వనిత (శకుంతల) యున్నూ; కాని= తప్ప; అన్యులు= ఇతరులు; ఎఱుఁగరు= తెలియరు. (ఇతరులకు తెలియదని భావం).

తాత్పర్యం: అలనాడు కోరి కోరి కణ్వమహర్షి ఆశ్రమంలో గాంధర్వవివాహ పద్ధతి నాశ్రయించి ఈమెను మిక్కిలి ప్రీతితో చేసికొన్నవివాహం నాకూ ఈమెకూ తప్ప ఇతరుల కెవ్వరికి తెలియదు.

తే. అన్యు లెఱుఁగమిఁ జేసి లోకాపవాద।
భీతి నెఱిఁగియు నిత్తన్విఁ బ్రీతి దప్పి
యెఱుఁగ నంటిని నిందఱ కిప్పు డెఱుఁగఁ।
జెప్పె నాకాశవాణి యచ్చెరువు గాఁగ. 101

ప్రతిపదార్థం: అన్యులు= ఇతరులు; ఎఱుఁగమిన్, చేసి= ఎరుగకపోవటంచేత; లోక+అపవాద, భీతిన్= లోకనిందవలని భయంచేత; ఈ+తన్విన్= ఈవనితను; ఎఱింగియున్= తెలిసియుండికూడ; ప్రీతి, తప్పి= ఆప్యాయత లేకుండ; ఎఱుఁగను, అంటిని= నాకు తెలియదన్నాను; ఇందఱకున్= ఇంతమందికి; ఇప్పుడు= ఈక్షణంలో; ఆకాశవాణి; అచ్చెరువు, కాఁగన్= అబ్బురపాటు కలిగేటట్లు; ఎఱుఁగన్, చెప్పెన్= తెలియచెప్పింది.

తాత్పర్యం: ఇతరుల కెవ్వరికీ తెలియదు కాబట్టి లోకనింద కలుగునేమో అన్నభయంతో నా కీమె తెలిసిఉన్నప్పటికీ కఠినంగా 'ఈమె నాకు తెలియదు' అన్నాను. కాని, ఇప్పుడు అందరికీ తెలిసేటట్లు అద్భుతంగా ఆకాశవాణి ప్రకటించింది.

విశేషం: దుష్యంతుడు నిజాన్ని బయటపెట్టాడు. కళంకాన్ని కడిగివేసికొన్నాడు. అతడి వర్తనంవలన శకుంతలా మాహాత్మ్యం ధ్వనింపజేయబడింది.

వ. అని మహానురాగంబునం గొడుకు నెత్తికొని హర్షపులక లెసఁగ నాలింగనంబు సేసి, శకుంతలా మహాదేవి నతిప్రణయగౌరవంబున సంభావించి, యౌవరాజ్యంబునకు భరతు నభిషిక్తుంజేసి. పెద్దకాలంబు రాజ్యసుఖంబు లనుభవించి, తన రాజ్యభారం బంతయు భరతుం బూన్చి, దుష్యంతుండు తపోవనంబున కరిగిన. 102

ప్రతిపదార్థం: అని= అని పలికి; దుష్యంతుండు; మహత్+అనురాగంబు నన్= మిక్కిలి ప్రేమతో; కొడుకున్= కుమారుడిని ప్రేమాతిశయంతో (భరతుడిని); ఎత్తికొని; హర్ష, పులకలు+ఎసఁగన్= సంతోషంతో కూడిన గగుర్పాటు కలుగగా; ఆలింగనంబు, చేసి= కౌగిలించుకొని; శకుంతలా, మహాదేవిన్= పట్టమహిషి అయిన శకుంతలను; అతి, ప్రణయ, గౌరవంబునన్= మిక్కిలి వలపు యొక్క గురుత్వంతో; సంభావించి= సమ్మానించి; భరతున్= భరతుడిని; యౌవరాజ్యంబునకున్, అభిషిక్తున్, చేసి= యౌవరాజ్యపదవిలో అభిషేకం చేసి; పెద్దకాలంబు= చాలకాలం; రాజ్య, సుఖంబులు= రాజ్యంవలని భోగాలు; అనుభవించి= పొంది; తన, రాజ్యభారంబు+అంతయున్; భరతున్+పూన్చి= భరతుడు వహించేటట్లు చేసి; తపోవనంబునకున్+అరిగినన్= తపస్సుకు అనువైన అరణ్యానికి పోగా.

తాత్పర్యం: అని పలికి దుష్యంతుడు అమితప్రేమతో కొడుకును ఎత్తుకొని సంతోషంతో కలిగిన పులకలతో కౌగిలించుకొని, పట్టమహిషి అయిన శకుంతలను మిక్కిలి ప్రణయగౌరవంతో సమ్మానించి, భరతుడిని యౌవరాజ్యపదవిలో అభిషేకించి, చాలకాలం రాజ్యసుఖాలు అనుభవించి, తన రాజ్యభారా న్నంతా భరతుడికి అప్పగించి, తాను తపోవనానికి పోగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం - అని ఆశ్రమాలు నాలుగు. అందులో దుష్యంతుడు గార్హస్థ్యాశ్రమాన్ని నిర్వహించి వానప్రస్థం స్వీకరించాడు. బహుకాలం వనంలో తపస్సు చేసికొంటూ ఉండే ఆశ్రమం వానప్రస్థం. కథను ముగించటంలో కమనీయశిల్పం ఉన్నది ఇక్కడ. యజమానుడు మొదట సత్యాన్ని అంగీకరించి గృహస్థధర్మానికి మూలమైన శక్తిని రక్షించాడు. ఆమీద 'పుత్రగాత్రపరిష్వంగసుఖాన్ని' అనుభవించి దీపంవలన వెలిగిన దీపంవంటి అద్వైతానుభవంతో స్పర్శజ్ఞానంవలన కలిగిన పులకలతో పుత్రమహిమను చవి చూచాడు. గార్హపత్యాగ్ని ఆహవనీయంలో ప్రజ్వలించటానికి కారకురాలైన ఇల్లాలిని సంభావించాడు. ఇప్పటికి గృహస్థధర్మపీఠం నాలుగుకాళ్ళమీద నిలబడింది. భరతుడికి యౌవరాజ్యాభిషేకం చేసి సత్యవాక్యస్థాపనం చేసి, మిగిలిన ఆశ్రమధర్మాలను దుష్యంతుడు అనుసరించి సమగ్రజీవితాన్ని సాగించాడు.

* * *